www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 45 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ నిజ శ్రావణ శుద్ధ ద్వాదశి
28 ఆగస్ట్-03 సెప్టెంబర్ 2023
వెల : ₹20/-



# మూలాలను విస్మరించని పెనుమార్పు దిశగా..

సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎర్రకోట మీద నుంచి ఇచ్చిన ప్రసంగం కాబట్టి ప్రధాని ముఖ్యాంశాలను ప్రస్తావించడంలో విశేషమేముంటుందని భావించినా, దేశహితానికి అవెంతో కీలకమైనవిగా గుర్తించాలి

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# ప్రకృతి అందాల నడుమ ఆధ్యాత్మిక శోభ

మూడువైపులా అరేబియా సముద్రంతో, 20 అంతస్తుల గోపురంతో అటు ఆధ్యాత్మికతకు, ఇటు ప్రకృతి సౌందర్యానికి నెలవుగా ఉన్నది కర్ణాటకలోని మురుడేశ్వరాలయం. మరొక ప్రముఖ శివక్షేత్రమైన గోకర్ణానికి అతి సమీపంలో ఉన్న ఈ ఆలయంలో భారీ శివుని విగ్రహం దర్శనమిస్తుంది. నేపాల్‌లోని కైలాసనాథ్ మహాదేవ విగ్రహం తర్వాత అత్యంత పొడవైన శివుని విగ్రహం ఇదే. 237.5 అడుగుల ఎత్తుతో ప్రపంచంలోనే రెండవ అతిఎత్తైన గోపురంగా ఈ ఆలయ రాజగోపురం ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో వెలుగుతున్న దీపాన్ని ఆలయ నిర్మాణ సమయంలో వెలిగించారని, అప్పటి నుంచీ అది అఖండంగా వెలుగుతోందని భక్తుల విశ్వాసం. కందుక అనే చిన్న కొండపై నిర్మించిన ఆలయానికి భక్తులు ఈ గోపురంలోంచి వెళ్లాలి. కొండపై శివుని దర్శనం చేసుకుని బయటకు వచ్చిన భక్తులు చుట్టూ ఉన్న ప్రకృతి సౌందర్యానికి ముగ్ధులవుతారు. ఈ ప్రాంగణంలో శివుడితో పాటు రామేశ్వరుడికి, శనీశ్వరుడికి కూడా ఆలయాలు ఉన్నాయి. ఒక్క గర్భగుడి మినహా ఈ ఆలయాన్ని ఆర్.ఎన్. శెట్టి అనే వ్యాపారవేత్త పూర్తిగా పునర్నిర్మించి, దానికి ఆధునికతను తెచ్చారు.





## వాకాటి పాండురంగారావు స్మారక

# కథల పోటీ

జాగృతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక కోసం సుప్రసిద్ధ కథా రచయిత స్వర్గీయ వాకాటి పాండురంగారావు స్మారక 'కథల పోటీ - 2023' నిర్వహిస్తున్నాం. రచయితలకు ఆహ్వానం..



**ప్రథమ బహుమతి : రూ. 12000/-**

**ద్వితీయ బహుమతి : రూ. 7000/-**

**తృతీయ బహుమతి : రూ. 5000/-**



1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు జాగృతి పారితోషికం ఉంటాయి.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 3 కథలకు మించి పంపరాదు.
4. కథ తన స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. దీపావళి సంచిక నుంచి ఆరంభించి, వరుసగా ఈ కథలను ప్రచురిస్తాం.
6. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి. చేతి రాత అందంగా, న్యాయనిర్ణేతలకు అర్థమయ్యేలా ఉంటే స్కాన్ చేసి పంపినా పరవాలేదు. కొట్టివేతలు ఉన్నా, సరిగా స్కాన్ చేయకున్నా పోటీకి తీసుకోలేం.
7. కథను పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
8. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. సంపాదకునిదే అంతిమ నిర్ణయం.

**కథలు జాగృతికి చేరడానికి చివరి తేది: 2 సెప్టెంబర్, 2023**

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.4000, సంవత్సర చందా రూ.850, విడి ప్రతి రూ.20**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006140532 5, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై Jagriti Prakashan Trust అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : సిహెచ్. కుమార్

నాలుక అబద్ధం చెప్పినా, నరాలు నిజాన్ని కక్కేస్తాయి. రాజకీయ భాష నేర్చిన నాలుక ఎన్ని విన్యాసాలనైనా చేయగలదు. కానీ వారసత్వాన్నీ, మూలాలనూ నరాలలో ప్రవహించే నెత్తురు విస్మరించలేదు. సానుకూల, ప్రతికూల భావనలతో ఈ మధ్య వినిపించిన రెండు ప్రకటనలు దీనినే రుజువు చేస్తాయి. 'భారతీయ ముస్లింలు ప్రధానంగా హిందూధర్మం నుంచి ఇస్లాంలోకి మారినవారే. ఇందుకు తిరుగులేని ఉదాహరణ కశ్మీర్ లోయ. ఒకనాడు అధిక సంఖ్యాకులైన పండిత్‌లను ఇస్లాంలోకి మతం మార్చారు' అన్నారు కశ్మీర్ డెమాక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ నాయకుడు గులాం నబీ ఆజాద్. నిద్ర నటిస్తున్న ఉదారవాదులు, చరిత్రకారులు, రాజకీయ నేతలను కదిపే వ్యాఖ్యలివి. ఆరు వందల ఏళ్ల క్రితం కశ్మీర్‌లో ఉన్న ముస్లింలు అంతా ఎవరు? కశ్మీరీ పండిత్‌లేనని దోడా జిల్లాలో మాట్లాడుతూ ఆజాద్ వ్యాఖ్యానించారు. ఇస్లాం 1500 ఏళ్ల క్రితమే ఉనికిలోకి వచ్చింది. కానీ హిందూధర్మం పురాతనమైనది. పది మందో ఇరవై మందో వారు (ముస్లింలు) బయటనుంచి వచ్చారు. అందులో కొంతమంది మొగలాయిల సైన్యంలో ఉన్నారు అని ఆజాద్ చెప్పారు. ఇస్లాం ఈ దేశంలో జనించలేదన్న సంగతి ఒక వాస్తవం అని ఆయన నిష్కర్షగా చెప్పారు. తాను హిందూ ముస్లిం ఐక్యతనే ఆకాంక్షిస్తున్నానని, రాజకీయాలలో మతం ఉపయోగించుకోవడం అంటే బలహీనతను ప్రదర్శించడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎంత యాదృచ్ఛికమో! ఆజాద్ వ్యాఖ్యకు ఒక కొనసాగింపు సంభవించింది. అఖిల భారత మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసి తన నేపథ్యంలోని మహా సత్యాన్ని ఒకానొక బలహీన క్షణంలో బయటపెట్టారు. ఆ నేపథ్యం గురించి వచ్చిన ఒక వ్యాఖ్య మీద స్పందిస్తూ, 'అవును, మా ముత్తాత హిందువు, పేరు తులసీరామదాస్' అంటూ గుట్టు విప్పారు. నోరు విప్పితే సంఘ పరివార్‌ని ఒక మాట అనడం రివాజు కాబట్టి ఆ ఒప్పుకోలుకు తోకను తగిలించారు. అదేమిటో, సంఘీయులు ఒక కథ అల్లదలిచినప్పుడల్లా నా పూర్వీకులు బ్రాహ్మణులు అన్న సంగతి వారికి గుర్తుకొస్తుంది అన్నారాయన.

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ నిజ శ్రావణ శుద్ధ ద్వాదశి**


**లోపలి పేజీలలో...**




ముఖపత్ర కథనం
**మూలాలను విస్మరించని పెనుమార్పు దిశగా..**
6లో



జాతీయం
**నూహ్ హింస.. భారీ కుట్ర**
12లో



15
ధారావాహిక నవల
**మహా సంకల్పం**
- పి. చంద్రశేఖర ఆజాద్
20లో

# జాగృతి

## సంపాదకీయం

# స్వాగతించాల్సిన మాటలు

ఒవైసి ముత్తాత హైదరాబాద్ బ్రాహ్మణుడనీ, ఆయనను ఇస్లాంలోకి మార్చారనీ 2017 ప్రాంతంలో బీజేపీ ఎంపీ, రచయిత రాకేశ్ సిన్హా వెల్లడించారు.

ఇదే సమయంలో ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ నాయకుడు ఆచార్య ప్రమోద్ కృష్ణమ్ మరొక వాస్తవాన్ని ధ్రువీకరించారు. ఈ సందర్భంలో అది గుర్తు చేసుకోవాలి. 'కాషాయం అంటే చిందులు తొక్కే కొందరు హిందూద్వేషులు కాంగ్రెస్‌ను కబ్జా చేశారు. వీళ్లకి భారతమాతాకీ జై అన్న నినాదం నచ్చదు. దేశాన్ని ముక్కలు చేయాలని అనుకుంటున్న వీళ్లంతా పార్టీలో పెద్ద పెద్ద స్థానాలు ఆక్రమించారం'టూ భారీ ఆరోపణే చేశారు. ఇది ఎందుకు చేయవలసి వచ్చింది! శ్రీ కల్కి ఆశ్రమ నిర్వాహకుడు కృష్ణమ్ తిలక ధారణ చేస్తారు. వీటిని ఆ పార్టీలో చాలామంది ఈసడించుకుంటున్నారట. తనను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నుంచి తప్పించిన కారణమూ అదేనని కృష్ణమ్ అభిప్రాయపడ్డారు. గీతాప్రెస్‌కు గాంధీ శాంతి పురస్కారం ప్రకటించడాన్ని తన పార్టీ నాయకులు తప్పు పట్టినప్పుడు కూడా కృష్ణమ్ తీవ్రంగానే స్పందించారు. కాంగ్రెస్ మీద హిందూ వ్యతిరేక ముద్ర వేయాలని బీజేపీ కోరుకుంటూ ఉంటే, ఆ కోరికను సొంత పార్టీ వారే తీరుస్తున్నారని ఆరోపించారు. ఆ పార్టీ ధోరణి గురించి ఇలాంటి మాటలు ఇప్పటికే చాలా సందర్భాలలో వినిపించాయి.

భారత్‌ను పరాయి మతాలు గాయపరచడం ఎంత వాస్తవమో ఇక్కడ ఒకరు న్యాయబుద్ధితో అంగీకరిస్తే, ఇంకొకరు వక్రబుద్ధితో చెప్పారు. ఇస్లామిక్ హింస కారణంగానే భారతదేశానిది గాయపడిన నాగరికత అయింది. పాకిస్తాన్ వాళ్లు ఈ విషయం బాహాటంగానే చెబుతారు అన్న అర్థంలో నోబెల్ బహుమతి గ్రహీత వీఎస్ నయాపాల్ పలికిన మాటలు అచారిత్రకం కాదని వాస్తవాలు చెబుతున్నాయి. అయినా మన దేశవాళీ ఉదారవాదులు, నాటు మేధావులు ఆయనను దుమ్మెత్తి పోశారు. అది వేరే విషయం. నయాపాల్ ప్రపంచానికి చాటిన మంచిమాట ఉంది. కత్తి మొనతో మారిన కాలమాన పరిస్థితులు, రక్తపాతాల నేపథ్యంలో కొందరు మతం మారారు. ఆరాధనా పద్ధతులు వేరయ్యాయి. అంతమాత్రాన వారు తమ గతాన్ని నిరాకరించవలసిన పనిలేదు అన్నదే ఆయన ఉద్దేశం. 'అయోధ్యలో వివాదాస్పద కట్టడాన్ని కూల్చడం మంచి పరిణామం. హిందువులలో తమదైన ఆత్మ పరిశీలన మొదలు కావడం ఆనందించదగినదే' అని నమ్మిన నయాపాల్ ఏ మాట అన్నా కుహనా సెక్యులరిస్టులు దుమ్మెత్తి పోయడం వింతకాదు. ఇక్కడ గురజాడ అప్పారావు 'పెద్ద మసీదు' కథ అదే ఆవిష్కరించింది. అది ఒక జాతికి తగిలిన గాయం. చరిత్ర నుంచి వర్తమానం తప్పించుకోలేనట్టే, ఏ సమాజమూ, సమూహమూ తన నేపథ్యాన్ని చెరిపి వేయలేదు. ఆ విషయాన్ని గుర్తించడానికి కొందరైనా ముందుకు వస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఒవైసి వంటివారు కూడా తప్పక నోరు విప్పుతున్నారు.

ఇలాంటి ప్రకటనలను వెలువరించడం వెనుక ఉద్దేశాలు ఎలాంటివైనా ఈ దేశం వాటిని స్వాగతిస్తుంది. కొంతకాలంగా ఆర్‌ఎస్ఎస్ పెద్దలు చెబుతున్న మాట ఇప్పటికైనా వారి తలకెక్కడం ఆహ్వానించదగినది. అలా అని ఇదంతా ఇవాళ్టి ముస్లిం సమాజం తమ మతాన్ని వదిలిరమ్మని చెప్పడానికి కాదు. ఎప్పుడో పెద్దలు తీసుకున్న నిర్ణయంతో ప్రధాన స్రవంతి చింతనకు దూరమైనా గతాన్ని నిరాకరించకండి అని చెప్పేందుకే. ఆ దృష్టితో దేశంలో శాంతియుత వాతావరణం, సౌభ్రాత్రం నింపే వాతావరణాన్ని బలపరచమనే. ఇవాళ కావలసింది అదే. కానీ అలాంటి ప్రయత్నాలకు విఘాతం కలిగించాలనుకునే శక్తులు ఇంకా ఈ దేశంలో రాజకీయ నేతలుగా చలామణి అవుతున్న సంగతి గుర్తించాలని కృష్ణమ్ వంటివారి ప్రకటనలు హెచ్చరిస్తున్నాయి. ★

28 ఆగస్ట్ 2023, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**మనోధర్మం**

– తటవర్తి నాగేశ్వరి

దర్శనం





ధర్మ దీక్షాధారణే రాఖీ (సందేశం) – 24
వారికి మళ్లీ మొండిచెయ్యే! (తెలంగాణ) – 28
'ఇసుకా'సురుల స్వైర విహారం (వేదిక) – 30
కచ్చతీవు, కోకో దీవులను ఎలా కోల్పోయాం? (అంతర్జాతీయం) – 32
వాగ్గేయకారుని వదలని రజాకారులు (అమృతోత్సవాలు) – 34
'కోమల'త్వం ఆమె గాత్ర తత్వం (మహిళ) – 10
విరాట్.. భారత క్రికెట్ సమ్రాట్ (క్రీడ) – 43
'జైలర్'తో రజనీ కెరీర్‌కు కొత్త ఊపిరి! (సినిమా) – 50

**భారతదేశ 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ఎర్రకోటపై పతాకావిష్కరణ చేయడం వరుసగా ఇది పదోసారి! అయితే ఈ ఆగస్టు 15కు మూడు ప్రత్యేకతలున్నాయి. మొదటిది ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, స్వాతంత్ర్య సమరంలో విప్లవ పథాన్ని ఎంచుకున్న అరవిందఘోష్ 150వ జయంతి కాగా, రెండవది స్వామి దయానంద సరస్వతి 200వ జయంతి జరుపుకుంటున్న సంవత్సరం, మూడవది రాణి దుర్గావతి 500వ జయంతి కూడా. సార్వత్రిక ఎన్నికలకు ముందు జరుగుతున్న స్వాతంత్ర్య దినోత్సవాలు కావడంతో నరేంద్ర మోదీ ముఖ్యాంశాలను ప్రస్తావించడంలో పెద్ద విశేష మేముంటుందని భావించినా, దేశహితానికి అవెంతో కీలకమైనవిగా గుర్తుంచుకోవాలి.**



ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగంలో ప్రధానంగా ఐదు అంశాలను ప్రస్తావించారు. మొదటిది సంప్రదాయిక నైపుణ్యాలను పెంపొందించే విశ్వకర్మ పథకం, రెండవది జన ఔషధి కేంద్రాలను ప్రస్తుతం ఉన్న పదివేల నుంచి 25 వేలకు పెంచడం, మూడవది పట్టణ పేదలు, మధ్యతరగతి వారికి సొంత ఇంటి కల నెరవేర్చడం, నాల్గవది ఐదేళ్ల కాలంలో భారత్‌ను ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా నిలపడానికి హామీతో పాటు ద్రవ్యోల్బణాన్ని మరింతగా తగ్గించి, ప్రజలపై దాని భారాన్ని తొలగించడానికి కృషి చేయడం. ఇక ఐదవది 'లక్‌పతి దీదీ' పథకం. వీటితో పాటు మణిపూర్ సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల కాలంలో 13.5 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డ అంశాన్ని కూడా ఆయన గుర్తు చేశారు. పేదల కొనుగోలు శక్తి పెరిగినప్పుడు, వ్యవస్థాపకత కూడా వృద్ధి అవుతుంది. ఫలితంగా పట్టణాలు, నగరాల్లో ఆర్థిక వ్యవస్థ మరింత వేగంగా పరుగులు పెడుతుంది. ఇదంతా చక్రగతిన జరిగే కార్యక్రమం. ఈ చక్రాన్ని మరింత ముందుకెళ్లేలా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ప్రధాన మంత్రి ముద్రా యోజన ద్వారా ప్రభుత్వం ఎంతోమందికి ఉపాధి కల్పించింది. ఇవి ప్రజాకర్షక అంశాలు కావు!

సమర్థవంతంగా అమలుచేసే తమ సత్తాను ప్రజలకు తెలియజేసిన ముఖ్యమైన విశేషాలు. అంతేకాదు సర్వజన హితం, సర్వజన సుఖాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకునే నిర్ణయాలు రాబోయే వెయ్యి సంవత్సరాల దేశ బంగారు భవిష్యత్తును నిర్మిస్తాయి. భారత్ నుంచి వెలువడుతున్న సచేతన కాంతి నుంచి ప్రపంచం తమను తాము ఉద్దీప్తం చేసుకోవాలని చూస్తోంద నడంలో ఎంతమాత్రం సందేహం లేదు. నేడు భారత్ ప్రపంచానికి గ్లోబల్ సౌత్ వాణిని వినిపించే స్థాయికి ఎదిగిందంటే అందుకు ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే.

**పీఎం విశ్వకర్మకు కేబినెట్ ఆమోదం**

ఆగస్ట్ 16న ప్రధాని అధ్యక్షతన జరిగిన 'ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ' సమావేశం ఐదేళ్ల కాలంలో అమలు చేయనున్న పీఎం విశ్వకర్మ పథకానికి ఆమోద ముద్ర వేసింది. పీఎం విశ్వకర్మ సహాయపడుతుంది.

**రెండు దశల శిక్షణ**

పీఎం విశ్వకర్మలో బేసిక్, అడ్వాన్స్‌డ్ అనే రెండు దశల నైపుణ్య శిక్షణ ఉంటుంది. శిక్షణకాలంలో లబ్ధిదారులకు నెలకు రూ. 500 స్టైపండ్ కింద చెల్లిస్తారు. ఆధునిక యంత్రాలు, పరికరాల కొనుగోలుకు రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుంది. మొదటి ఏడాది ఐదు లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. రానున్న ఐదేళ్లకాలంలో మొత్తం 30లక్షల కుటుంబాలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కలిగించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. మొదట 18 రకాల సంప్రదాయ నైపుణ్యాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. గురు–శిష్య పరంపరను, కుటుంబ ఆధారిత సంప్రదాయ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.




**జమలాపురపు విఠల్‌రావు**

సీనియర్ జర్నలిస్ట్


15 వేల స్వయం సహాయక బృందాలకు డ్రోన్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. దేశంలో అత్యధికశాతం మంది ప్రజలు ఆధారపడిన వ్యవసాయరంగాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ డ్రోన్ శిక్షణ ఇవ్వడం వల్ల, ఈ రంగంలో మరింత విస్తృతంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్ట డానికి వీలవుతుందన్నది ప్రభుత్వ ఉద్దేశం. ప్రధాని

# మూలాలను విస్మరించని పెనుమార్పు దిశగా..

పథకాన్ని ప్రధాని ఆగస్ట్ 15న ఎర్రకోటపై తన ప్రసంగం సందర్భంగా ప్రకటించారు. రూ.13 వేల కోట్లు ఖర్చు కాగల ఈ పథకం కింద మొత్తం 30 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుంది. చేనేత కార్మికులు, స్వర్ణకారులు, వడ్రంగులు, లాండ్రీ కార్మికులు, క్షురకులు, కుమ్మరులు, శిల్ప కళాకారులు, రాళ్లు కొట్టేవారు, తాపీ మేస్త్రీలు, బుట్టలు అల్లేవారు, చీపుర్లు తయారు చేసేవారు, తాళాలు తయారు చేసేవారు, బొమ్మల తయారీదారులు, పూలదండలు తయారుచేసేవారు, మత్స్యకారులు, దర్జీలు, చేపల వలలు అల్లేవారు.. తదితర సంప్రదాయ వృత్తుల వారికి ఈ పథకం లబ్ధి చేకూరుస్తుంది. విశ్వకర్మ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 17న పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద అర్హులైనవారికి ఒక సర్టిఫికెట్, గుర్తింపుకార్డు ఇస్తారు. 5శాతం వడ్డీతో రూ.2లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తారు. ఈ పథకం కింద లబ్ధిదారులకు నైపుణ్య శిక్షణతో పాటు ఇతర ప్రోత్సాహకాలను కూడా అందిస్తారు. ముఖ్యంగా మార్కెటింగ్ విషయంలో ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. అంటే ఉత్పత్తుల విక్రయంలో ప్రభుత్వం

**'లక్‌పతి దీదీ' పథకం**

ప్రధాని మహిళల కోసం ప్రకటించిన మరో పథకం 'లక్‌పతి దీదీ'. ఈ పథకం కింద రెండు కోట్ల మంది మహిళలకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొని రావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం ముఖ్యంగా గ్రామీణ మహిళలకు సాంకేతిక శిక్షణ అందిస్తారు. ప్లంబింగ్, ఎల్.ఇ.డి. బల్బుల తయారీ, డ్రోన్ ఆపరేటింగ్ రంగాల్లో శిక్షణ ఇస్తారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఉపయోగ పడేందుకు వీలుగా మహిళలకు 'డ్రోన్ ఆపరేటింగ్'లో శిక్షణ ఇస్తారు. ఇప్పటికే దేశంలో స్వయం సహాయక బృందాల ద్వారా పది కోట్ల మంది మహిళలు వివిధ బ్యాంకులతో లావాదేవీలు జరుపుతున్నారు. అంగన్‌వాడీల్లో పనిచేస్తున్నారు. ఔషధసేవల్లో పాలు పంచుకుంటున్నారు. వీటన్నింటికీ అదనంగా దేశంలోని స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళలకు డ్రోన్‌ల పైలెటింగ్, నిర్వహణ, మరమ్మతుల విషయంలో శిక్షణ ఇస్తారు. ఆ విధంగా వేలాది స్వయంసహాయక బృందాలకు డ్రోన్‌లను అందుబాటులోకి తేవా లన్నది ప్రధాని లక్ష్యం. తొలి విడతగా దేశంలోని

ప్రకటనపై 'ఐఒ టెక్ వరల్డ్ ఏవియేషన్' సంస్థ సహ వ్యవస్థాపకులు, డైరెక్టర్ దీపిక భరద్వాజ్ స్పందిస్తూ 15వేల స్వయం సహాయక బృందాలకు డ్రోన్‌లను అందుబాటులోకి తెచ్చి వాటిని నడపడం, మరమ్మతులు, నిర్వహణ విషయంలో శిక్షణ ఇవ్వడం నిజంగా వ్యవసాయ రంగం





రూపు రేఖలను సమూలంగా మార్చి వేసే చర్య అంటూ అభినందించారు. దీనివల్ల వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వినియోగం మరింత విస్తృతం కావడమే కాకుండా, ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగు తాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇదొక విప్లవాత్మక మార్పునకు దోహదం చేయగలదు. ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొని రావడం ద్వారా గ్రామాల్లో రెండు కోట్ల మంది 'లక్‌పతి దీదీ'లను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం విషయాన్ని జి-20 సదస్సు దృష్టికి తీసుకెళ్లినప్పుడు వారి ప్రాముఖ్యాన్ని ప్రతి ఒక్కరూ అంగీకరించిన అంశాన్ని సాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ ప్రస్తావించిన సంగతి ఇక్కడ ప్రస్తావనార్హం.

**నగరాల్లో ఈ-బస్ సేవ**

పర్యావరణానికి హితం కలిగించే రీతిలో దేశంలోని వివిధ నగరాల్లో ఈ-బస్ (ఎలక్ట్రిక్ బస్సులు)లను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 'పీఎం ఈ-బస్ సేవ' పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రవాణా సదుపాయం వ్యవస్థీకృతంగా లేని నగరాల్లో వీటిని ప్రవేశ పెడతారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగ స్వామ్య విధానంలో దేశంలోని 169 నగరాల్లో పదివేల ఈ-బస్సులను ప్రవేశపెట్టనున్నారు. ఈ పథకం అంచనా వ్యయం రూ.57613కోట్లు. ఇందులో కేంద్రం రూ.20 వేల కోట్లు సమకూరుస్తుంది. హరితపట్టణ రవాణా కార్యక్రమాల్లో భాగంగా 181 నగరాల్లో మౌలిక సదుపాయాలు వృద్ధి చేయనున్నారు.

**ఏడు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు**

రైల్వేలో 7 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దీని అంచనా వ్యయం రూ.32,500 కోట్లు. ఈ భారాన్ని కేంద్రమే భరిస్తుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని 35 జిల్లాల్లో ఈ ప్రాజెక్టులను చేపడతారు. ప్రస్తుతం ఉన్నవాటి సామర్థ్యం పెంచుతారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రస్తుతం ఉన్న రైల్వే నెట్‌వర్క్ మరో 2339 కిలో మీటర్ల మేర విస్తరిస్తుంది. అంతేకాదు చేపట్టబోయే కొత్త ప్రాజెక్టుల వల్ల ప్రస్తుత సామర్థ్యానికి అదనంగా వార్షికంగా 200 మిలియన్‌టన్నుల సరుకు రవాణా సాధ్యంకాగలదని అంచనా. దక్షిణమధ్య రైల్వే పరిధిలో రూ.7500 కోట్ల వ్యయంతో ట్రాక్ డబ్లింగ్ పనులు చేపడతారు. ఇందులో గుంటూరు- బీబీనగర్ సెక్షన్‌లో 239 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులకోసం రూ.2853.23 కోట్లు ఖర్చు చేస్తారు. అదేవిధంగా ముద్ఖేడ్-మేడ్చల్, మహబూబ్‌నగర్-డోన్ సెక్షన్లలో 417.88 కిలోమీటర్ల మేర రూ.4686.09 కోట్ల వ్యయంతో డబ్లింగ్ పనులు చేపట్టనున్నారు. గుంటూరు-బీబీనగర్ ప్రాజెక్టును వచ్చే నాలుగేళ్ల కాలంలో పూర్తిచేయాలన్నది లక్ష్యం. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే తెలుగు రాష్ట్రాల్లో సరుకు రవాణా మరింత అధికంగా జరగడమే కాకుండా, రైళ్ల వేగం పెరిగి ప్రయాణసమయం గణనీయంగా తగ్గుతుంది. ఫలితంగా ఈ ప్రాంతాల్లో సామాజిక,

## ప్రధాని నోట.. 6 జీ మాట



'ప్రపంచంలోనే అత్యంత వేగంగా 5 జీ విస్తరణ దేశంలో కొనసాగుతోంది. ఇప్పటివరకు 700కు పైగా జిల్లాలకు ఈ 5 జీ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు మనం 6 జీ కోసం సిద్ధమవుతున్నాం. పునరుత్పాదక ఇంధన వనరుల కల్పన విషయంలో 2030 లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, 2021-22 నాటికే దాన్ని సాధించాం. 20 శాతం ఇథనాల్‌తో కూడిన పెట్రోల్ మిశ్రమ వినియోగాన్ని కూడా గడువుకు ఐదేళ్ల ముందే సాధించాం. అదేవిధంగా 500 బిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని కూడా లక్ష్యానికి ముందే దాటిపోయాం. 25 సంవత్సరాల క్రితం మనకు ఒక నూతన పార్లమెంట్ భవనం కావాలన్న చర్చ జరిగింది. ఆ కల ఇప్పుడు సాకారమైంది. సైన్యంలో వన్ ర్యాంక్-వన్ పెన్షన్ విధానం అమలవుతోంది. వరుస బాంబుపేలుళ్ల సంఘటనలు ఇప్పుడు గతం. నేడు దేశంలో శాంతి సుస్థిరతలు పరిఢవిల్లు తున్నాయి. దేశంలో ఉగ్రవాద దాడులు గణనీయంగా తగ్గిపోయాయి. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో కూడా నేడు శాంతి నెలకొనడం గమనార్హం. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా రూపొందాలనేది ప్రతి భారతీయుడి దృఢ సంకల్పం. దీన్ని సాధించడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై శ్రమించాలి'.

**మహిళలే మహారాణులు**

పౌర విమానయాన రంగంలో ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లో పనిచేసే మహిళా పైలెట్ల సంఖ్య అధికం. చంద్రయాన్, మూన్ మిషన్‌లను నిర్వహించేది అత్యధిక సంఖ్యాకులైన మహిళా శాస్త్రవేత్తలే. అసమతుల్య అభివృద్ధి వల్ల మనదేశం విపరీతంగా నష్టపోయింది. ప్రస్తుతం ప్రాంతీయ ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని అన్ని ప్రాంతాల సమతుల్యాభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోంది. ప్రస్తుతం దేశంలో అన్ని రంగాలూ అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి. హైవేలు, వాటర్ వేలు, ఎయిర్ వేలు, రైల్వేలు, ఐ-వేలు, ఇన్ఫర్మేషన్‌వేలు, ఈ విధంగా దేశం అభివృద్ధి పథంలో పయనించని రంగాలే లేవంటే అతిశయోక్తి కాదు. గత తొమ్మిదేళ్లుగా ప్రభుత్వం తీరప్రాంతాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి విశేష కృషి చేస్తోంది. ఆయా ప్రాంతాల బలోపేతం కోసం 'పర్వత మాల', 'భారత్ మాల' వంటి సామాజిక పథకాలను అమలుచేసింది. తూర్పు భారత దేశాన్ని గ్యాస్ పైప్‌లైన్‌తో అనుసంధా నించే కార్యక్రమం పూర్తిచేసింది. మాతృభాషలో విద్యాభ్యాసాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ దిశగా సుప్రీంకోర్టు తన తీర్పులను ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంచడం పట్ల ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. దీనివల్ల కోర్టుకు హాజరయ్యే వ్యక్తికి తీర్పులు మాతృభాషలోనే అందుబాటులో ఉంటాయి. మాతృభాషకు ప్రాధాన్యం పెరుగుతుందనటానికి ఇది తార్కాణం. ఇంకొన్ని అంశాలు మోదీమాటలలోనే..

'దేశ సరిహద్దు గ్రామాల్లో 'వైబ్రెంట్ బోర్డర్ విలేజ్' కార్యక్రమాన్ని ప్రారంభించాం. జీ-20 సదస్సుకు మనం 'ఒకే ప్రపంచం', 'ఒకే కుటుంబం', 'ఒకే భవిష్యత్తు' అనే అంశాలను ప్రపంచం



ఆర్థికాభివృద్ధి ఊపందుకోగలదు. ఇక ఖుర్దా రోడ్ నుంచి విజయనగరం మధ్యలో 385 కిలో మీటర్ల మేర మూడో లైన్ నిర్మాణం చేపడతారు. ఇందుకు రూ.5618 కోట్లు ఖర్చు కాగలదని అంచనా. ఈ లైన్ ఆగ్నేయ రైల్వే పరిధిలోకి వస్తుంది.

**నెరవేరనున్న పేదల సొంతింటి కల**

పట్టణాల్లో అద్దె ఇళ్లలో కాలం గడుపుతున్న పేదలు, మధ్య తరగతి ప్రజల కోసం ప్రత్యేక పథకాన్ని తీసుకురానున్నట్టు ప్రధాని మోదీ ప్రకటించారు. ముఖ్యంగా మురికివాడలు, అనధికారిక నివాస ప్రాంతాల్లో బతుకులీడుస్తున్న వారికి ఇది ప్రయోజనం కాగలదు. ముఖ్యంగా అటువంటివారు ఇళ్లు కట్టుకోవడానికి రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. వడ్డీలేని రుణాలు సమకూర్చడం వల్ల పేదలు, మధ్య తరగతి వారికి లక్షలాది రూపాయల వడ్డీభారం తగ్గుతుంది. దీనిపై పూర్తివివరాలు తెలియాల్సి ఉంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన అమలుచేస్తోంది. ఇందులో ప్రధానంగా నాలుగు అంశాలుంటాయి. మొదటిది లబ్ధిదారుడే ఇల్లు నిర్మించుకోవడం, రెండవది భాగస్వామ్యంతో తక్కువ ఖర్చుతో ఇళ్లనిర్మాణం, మూడవది మురికివాడల పునరాభివృద్ధి కాగా నాల్గవది రుణాలపై వడ్డీ రాయితీ కల్పించడం. నిజానికి ఈ యోజన అమలు గడువు మార్చి 31, 2022, కానీ మొదటి మూడు అంశాలకు సంబంధించి ఈ పథకం అమలును డిసెంబర్ 31, 2024 వరకు పొడిగించారు.

ఇక నాల్గవ దాన్ని 2022, మార్చి 31 తర్వాత కూడా ప్రభుత్వం అమలు జరుపుతోంది. ఆగస్ట్ 14 వరకు పీఎంఏవై-యు పోర్టల్ ప్రకారం 1.18 కోట్ల ఇళ్లు మంజూరు కాగా, వీటిల్లో 76.25 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. ఇందుకు మొత్తం వ్యయం కేటాయింపు రూ.1.42 లక్షల కోట్లు కాగా రూ.58,868 కోట్లు వడ్డీ రాయితీకి ఖర్చు చేసింది. పేద మధ్యతరగతి వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం, పీఎం సహాయనిధి ద్వారా 50వేల కోట్లు ఖర్చు చేసింది. రూ.4 లక్షల కోట్ల వ్యయంతో పేదలకు ఇళ్లు నిర్మించి 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చామని ప్రధాని పేర్కొనడం గమనార్హం.

**మణిపూర్ సమస్య**

మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించారు. మణిపూర్ ప్రజలకు దేశం యావత్తు అండగా నిలుస్తున్నదని, రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే పరిస్థితులు కుదుటపడుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యకు శాంతియుత పరిష్కారం కోసం, శాంతి స్థాపన కోసం కృషిచేస్తున్నాయి. విచిత్రమేమంటే మణిపూర్ విషయంలో కేంద్రంపై అవిశ్వాసం పెట్టిన విపక్షాలకు హోంమంత్రి అమిత్‌షా, ప్రధాని నరేంద్ర మోదీలు సహేతుకమైన రీతిలో దీటుగా సమాధానం చెప్పడంతో, తట్టుకోలేని విపక్షాలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేయడం వాటి నిస్సహాయతను వెల్లడి చేసింది. సరైన రీతిలో సంసిద్ధంగా రావాలంటూ ప్రధాని విపక్షాలకు చురకలంటించడం గమనార్హం.

---

ముందుంచాం. ఇదే ఆలోచనతో మనం ముందుకెళుతున్నాం. 'ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్'ను ముందుకు తెచ్చాం. నేడు ప్రపంచంలోని ఎన్నో దేశాలు ఇందులో భాగస్వామ్యం అవుతున్నాయి. జీవవైవిధ్య ప్రాధాన్యాన్ని తెలిపేందుకు 'బిగ్ క్యాట్ అలయెన్స్'తో ముందుకొచ్చాం. భూతాపం, ప్రకృతి విపత్తుల కారణంగా మౌలిక సదుపాయాలకు కలిగే నష్టాల నివారణకు మనం ఇంకా ఎంతో చేయాల్సి ఉంది. ఇందుకోసం సీడీఆర్ఐ (కోయ్‌లేషన్ ఫర్ డిజాస్టర్ రిసైలెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)కు రూపకల్పన చేశాం. నేడు సముద్రాలు సంఘర్షణలకు కేంద్రాలుగా మారుతున్న తరుణంలో, సముద్ర ప్రాంతాల్లో శాంతి నెలకొల్పేందుకు 'ప్లాట్‌ఫామ్ ఆఫ్ ఓషన్స్'ను ఏర్పాటు చేశాం. సంప్రదాయ వైద్యానికి ప్రాధాన్యతనిచ్చే క్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ)కు చెందిన అంతర్జాతీయ కేంద్రాన్ని మనదేశంలో ఏర్పాటు చేసేలా కృషిచేశాం. 'యోగ', 'ఆయుష్' ద్వారా ప్రపంచ ఆరోగ్యానికి మార్గం చూపాం".

**2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా..**

'2047 నాటికి భారత్ వందేళ్ల స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటుంది. నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మన త్రివర్ణపతాకం సగర్వంగా వినువీధుల్లో ఎగరాలన్నది నా ఆకాంక్ష. దీన్ని సాధించాలంటే పారదర్శకత, నిష్పాక్షపాత్యం అత్యంత అవసరం. వివిధ సంస్థలు, కుటుంబాలు, పౌరులు ఈ సాధనకు అవసరమైన బలాన్నివ్వాలి. అంతేకాదు దేశంలో 30 ఏళ్ల లోపు యువకుల సంఖ్య అత్యధికంగా ఉండటం కూడా మనకు గొప్ప వనరుగా ఉపయోగపడుతుంది'.

**ముంచేస్తున్న మూడు రుగ్మతలు**

దేశం ఎదుర్కొంటున్న దుస్థితికి మూడు రుగ్మతలు ప్రధాన కారణం. మొదటిది అవినీతి. అన్ని సమస్యలకు అవినీతే మూలకారణం. అన్ని రకాల అవకాశాలను దేశం కోల్పోవడానికి ప్రధాన కారణం ఇదే. అందువల్ల ప్రతిఒక్కరూ ఈ అవినీతి నుంచి భారత్‌ను విముక్తం చేసేందుకు కృషిచేయాలి. ఇక రెండవది కుటుంబ స్వార్థం. ఈ స్వార్థమే దేశంలోని ప్రజల హక్కులను కాలరాసింది. ఇక మూడో రుగ్మత సంతుష్టీకరణ. ఇది దేశ ప్రాథమిక ఆలోచనా విధానమైన అందరినీ కలుపుకొనిపోయే జాతి లక్షణాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ఈ రుగ్మతలకు కారకులైన వారు ప్రతి దాన్నీ ధ్వంసం చేస్తూ వస్తున్నారు. అందువల్ల మనమంతా ఈ మూడు రుగ్మతలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాటం సలపాలి. దళితులు, వెనుకబడిన వారు, పస్మందా వర్గాలు, గిరిజన సోదరులు, సోదరీమణులు అంతా కలిసి కట్టుగా ఈ మూడు రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి. అవినీతి అంటేనే అసహ్యం పుట్టే వాతావరణాన్ని సృష్టించాలి. ఒంటికి పట్టిన మురికిని వదిలించుకోవడానికి ఏం చేస్తామో అదేవిధంగా సమాజాన్ని కూడా అవినీతి మురికి నుంచి శుభ్రం చేయాలి. నైపుణ్యానికి, తెలివితేటలకు, సామర్థ్యాలకు ఈ ఆశ్రిత పక్షపాతం పెద్ద శత్రువు. వీటిని పైకి రానీయదు. అందువల్ల కుటుంబ స్వార్థం నుంచి ప్రజాస్వామ్యానికి విముక్తి కలిగినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుంది. సామాజిక న్యాయానికి సంతుష్టీకరణ చెరుపు చేస్తోంది. అవినీతి, సంతుష్టీకరణ అభివృద్ధికి ప్రధాన శత్రువులు. మరి 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను చూడాలనుకుంటే, అవినీతిని సమూలంగా పెకలించి వేయాల్సిందే.

**ప్రతిక్షణం దేశం కోసమే**

'2014లో నేను మార్పునకు హామీ ఇస్తూ మీ ముందుకు వచ్చాను. నన్ను నమ్మి అధికారం కట్టబెట్టారు. 'రిఫార్మ్', 'పెర్‌ఫార్మ్', 'ట్రాన్స్‌ఫార్మ్' ద్వారా మీలో మార్పు పట్ల విశ్వాసం కలిగించాను. 2019లో మళ్లీ నన్ను ఆశీర్వదించారు. 2047 నాటి కల సాకారం కావాలంటే రాబోయే ఐదేళ్లకాలం సువర్ణావకాశం. వచ్చే ఆగస్ట్ 15న ఇదే ఎర్రకోట నుంచి దేశం సాధించిన విజయాలను మీ ముందుంచుతాను. మీరంతా నా కుటుంబంలోని వారు, నేను ఈ కుటుంబంలో భాగమన్న భావనే నా ఈ శ్రమకు కారణం. నేను మీతోనే జీవిస్తాను, మీ కోసమే పోరాడతాను. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన వారి ఆశీస్సులు మనపైన ఉంటాయి. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడినవారు దేశం కోసం ప్రాణత్యాగానికి వెనుకాడలేదు. కానీ నేడు మనకు ప్రతిక్షణం దేశం కోసం జీవించే అవకాశం లభించింది'. ★

### మరో ఐదేళ్లలో మూడో ఆర్థిక వ్యవస్థగా..

వచ్చే ఐదేళ్లలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అమెరికా, చైనా తర్వాత మనదేశమే ఉంటుందని ప్రధాని నొక్కి చెప్పడం విశేషం. ఇదే సమయంలో ప్రపంచం మొత్తం నేడు ద్రవ్యోల్బణం గుప్పిట్లో చిక్కుకొని ఉంది. మరి అటువంటి ప్రపంచ దేశాల నుంచి వస్తువులు దిగుమతి చేసుకుంటే, వాటితో పాటు దేశంలోకి కూడా ద్రవ్యోల్బణం ప్రవేశించడం అనివార్యం. ఈ నేపథ్యంలో ద్రవ్యోల్బ ణాన్ని కట్టడి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేసి కొంతమేర విజయం సాధించింది. అయితే ఈ స్వల్ప విజయం ప్రభుత్వానికి సంతృప్తినివ్వడం లేదు. మనదేశంలో పరిస్థితులు ప్రపంచం కంటే మెరుగ్గా ఉన్నాయని చెప్పడానికి వీల్లేదు. కానీ దేశప్రజలపై ద్రవ్యోల్బణ భారాన్ని తగ్గించడానికి మరిన్ని చర్యలను ప్రభుత్వం తప్పక తీసుకుంటుందని ప్రధాని స్పష్టంచేశారు. కరోనా నేర్పిన పాఠాల నేపథ్యంలో, మనదేశం ప్రపంచానికే దిక్సూచిగా మారింది. కరోనా సమయంలో ఎన్నో కఠిన సవాళ్లను ఎదుర్కొంటూ దేశం ముందుకు సాగింది. కొవిడ్ 'ఒకే ధరిత్రి', 'ఒకే ఆరోగ్యం' అన్న సూత్రాలను మనదేశం ముందుకు తెచ్చింది. ప్రపంచాన్ని మార్చడంలో భారత్ నిర్ణయాత్మక పాత్ర పోషిస్తోంది. దేశంలో 200 కోట్ల టీకాలు ఇవ్వాలన్న బృహత్ సంకల్పాన్ని చేపట్టినప్పుడు, ప్రపంచ దేశాలు ఇది ఎంతవరకు సాధ్యమని ప్రశ్నించాయి. కానీ అశావర్కర్లు, అంగన్‌వాడి వర్కర్లు, హెల్త్ వర్కర్లు దీని సుసాధ్యం చేసి చూపారు. ఇదే మన దేశానికున్న అద్భుత శక్తి! జనఔషధి పేరుతో ప్రజలందరికీ చౌకధరలో మందులను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఇందుకు వీలుగా జనౌషధి మందుల దుకా ణాలను 10వేల నుంచి 25 వేలకు పెంచనున్నారు. జన్‌ధన్ ఖాతాలతో పేదల బతుకుల్లో వెలుగులు నింపడమే కాదు మారుమూల గ్రామాలకు విద్యుత్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దేశ ప్రజలందరికి ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చింది.

### ప్రధాని ప్రసంగంలోని మరికొన్ని అంశాలు

గత పదేళ్ల కాలంలో భారత్ సాధిస్తున్న అభివృద్ధిని, మనదేశ గొప్పదనాన్ని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. రాబోయే కాలంలో ప్రపంచాన్ని టెక్నాలజీ శాసిస్తుంది. ఉపగ్రహ ప్రయోగాల రంగంలో మనం దూసుకుపోతున్నాం. 30 ఏళ్ల యువతే దేశానికి దిశను నిర్దేశించాలి. యువశక్తే భారత్‌కు బలం. సాంకేతిక రంగంలోనే కాదు, వ్యవసాయ రంగంలో కూడా దేశం ముందుకు దూసుకెళుతోంది. 'డెమోగ్రఫీ, డెమోక్రసీ, డైవర్సిటీ' దేశానికి ఎంతో ముఖ్యం. టెక్నాలజీ విషయంలో ఎంతో ముందుకెళ్లి, డిజిటల్ దిశగా దూసుకెళు తోంది. క్రీడారంగంలో కూడా యువత ప్రపంచ




వేదికల్లో తమ సత్తా చాటుతోంది. సాంకేతిక రంగంలో స్టార్టప్‌లలో మనదేశం మూడో స్థానంలో ఉంది. ఈ ఏడాది జరుగబోయే ప్రతిష్టాత్మక జీ-20 సమావేశానికి మనదేశం ఆతిథ్యం ఇచ్చే అరుదైన అవకాశం లభించింది. గతంలో స్థానిక సంస్థల అభివృద్ధి కోసం రూ.70వేల కోట్లు ఖర్చుపెడితే నేడు అది రూ.3లక్షల కోట్లకు చేరుకుంది. గతంలో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం రూ.90 వేల కోట్లు ఖర్చు చేస్తే ఇప్పుడది రూ.4 లక్షల కోట్లకు చేరింది. రైతులకు యూరియా కొనుగోలు కోసం రూ.10 లక్షల కోట్లు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తోంది. అదేవిధంగా యువకులకు స్వయం ఉపాధి కింద కేంద్రం రూ.20 లక్షల కోట్లు ఖర్చు చేసింది. ముద్ర యోజన కింద 8కోట్ల మంది ప్రయోజనం పొందితే, వీరు మరో 8-10 కోట్ల మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకున్నారు. కరోనా కాలంలో దేశంలోని మధ్యతరహా పరిశ్రమలు మూతపడకుండా ఉండేం దుకు ప్రభుత్వం రూ.3 లక్షల కోట్లు ఖర్చుచేసి వాటిని బలోపేతం చేసింది. రూ.2.5 లక్షల కోట్లు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రభుత్వం జమ చేసింది. ఇవి నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. అలాగే, ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో చేపట్టిన జల్ జీవన్ మిషన్‌కు మరో రూ.2 లక్షల కోట్లు ప్రభుత్వం కేటాయించింది. పశువుల వ్యాక్సి నేషన్ కోసం రూ.15వేల కోట్లు, ఆయుష్మాన్ భారత్ స్కీమ్ కింద రూ.70 వేల కోట్లు ప్రభుత్వం కేటాయిం చింది. ఇంటర్నెట్ డేటా 2014కి ముందు చాలా ఖర్చుతో కూడి ఉండేది. కాగా ప్రపంచంలో అత్యంత చౌక ధరలో ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నది కూడా మనదేశంలోనే.

### పునరుత్పాదక ఇంధన వనరులు

నేడు దేశం పునరుత్పాదక ఇంధన వనరుల కోసం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే హైడ్రోజన్‌పై ప్రధానంగా దృష్టిపెట్టింది. ఇప్పుడు మనదేశం పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో ముందుకు తెచ్చిన 'ఒకే సూర్యుడు', 'ఒకే ప్రపంచం', 'ఒకే గ్రిడ్' అనే భావనలను ప్రపంచం ఆమోదిస్తోంది. ఇదే సమయంలో అంతరిక్షంలో భారత్ పాత్ర మరింతగా పెరుగుతోంది. సుదూర సముద్ర మిషన్‌లను కూడా దేశం చేపడుతోంది. దేశంలో రైళ్లు ఆధునికతను సంతరించుకుంటున్నాయి. వందేభారత్ రైళ్లు ఇందులో భాగమే. నేడు ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ సదుపాయం ఉంది. ఇదే సమయంలో దేశం క్వాంటమ్ కంప్యూటర్లపై దృష్టికేంద్రీకరించింది. నానో యూరియా, నానో డీఏపీల కోసం పరిశోధనలు సాగిస్తూనే, సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్య మిస్తోంది. పారా ఒలింపిక్స్‌లో దివ్యాంగులు కూడా సగర్వంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే తరుణం రావాలి. ఈ నేపథ్యంలోనే దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

### గత ప్రభుత్వాలకు భిన్నం

లక్ష్యాల సాధనలో ప్రభుత్వం గతానికి భిన్నంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా శంకుస్థాపన చేసిన పనులు పూర్తయి, ఈ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవడం విశేషం. స్వాతంత్ర్య అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశంలో 75 వేల అమృత్ సరోవర్‌ల నిర్మాణ పనులు జరుగు తున్నాయి. మానవశక్తి, జలశక్తి సామర్థ్యాలు దేశ పర్యావరణాన్ని పరిరక్షించడానికి దోహదం చేస్తాయి. 18 వేల గ్రామాలకు విద్యుత్ సదుపాయ కల్పన, జన్‌ధన్ ఖాతాలు తెరవడం, బాలికల కోసం మరుగు దొడ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు నిర్దేశిత గడువు కంటే ముందే పూర్తికానున్నాయి. ★



ఆగస్ట్ 29 జాతీయ క్రీడా దినోత్సవం / ధ్యాన్‌చంద్ జయంతి

# హాకీ ఆయన శ్వాస



ఒక నియంతకు తన దేశం అమ్మకానికి లేదంటూ, స్థైర్యంతో, సాహసంతో సమాధానం చెప్పిన క్రీడాకారుడు ధ్యాన్‌చంద్. 1936 ఒలింపిక్స్‌లో హాకీలో జర్మనీపై విజయం సాధించిన అనంతరం భారతీయ ఆటగాడు ధ్యాన్‌చంద్ ఆటతీరుకు ముగ్ధుడైన అడాల్ఫ్ హిట్లర్ ఆయనకు తన సైన్యంలో మంచి స్థానమిస్తాను రమ్మని ఆహ్వానించినప్పుడు ఆయనకు లభించిన సమాధానం అది. కేవలం క్రీడనే కాదు, దేశాన్ని కూడా ప్రేమించిన ధ్యాన్‌చంద్ వంటి క్రీడాకారులు మన యువ ఆటగాళ్లకు ఆదర్శం కావాలి.

నా తండ్రి ధ్యాన్‌చంద్‌ని చూడడానికి మీరట్‌లోని మా ఇంటికి నిరంతరం అభిమానులు వస్తుండేవారు. నాకు ఊహ తెలిసీతెలియని వయసులో ఇంతమంది రోజూ ఎందుకు వస్తున్నారు? అని ఆశ్చర్యం వేసేది. మా తండ్రి హాకీ మాంత్రికుడని తర్వాత తెలిసింది. నేను పెరిగిన తర్వాత శ్రీలంక, జపాన్ దేశాలలో ఆయన ప్రాక్టీస్ మ్యాచ్‌లు చూశాను. అక్కడి ప్రేక్షకులు, క్రీడాకారులు విశేష ఆసక్తితో ఆటకు సంబంధించి అనేక మెలకువలను నేర్చుకొనేవారు. మన జట్టు దేశ విదేశాల్లో ఆడడానికి అవసరమైన డబ్బు కోసం మా తండ్రి గారు చందాల కోసం ప్రజలు, ప్రభుత్వ అధికారులు, రాజులను ఆశ్రయించేవారు. బంతిని 'ఔట్ సైట్ రైట్'ఉన్న వారికి పంపి తన మధ్యలో 'పొజిషన్'లోఉండి గోల్ చేసేవాడు. ఇది ఒక ప్రత్యేకత. మా నాన్న వేసిన గోల్సు అన్ని ప్లేస్‌మెంట్, స్లూప్ లేదా ఫ్లిక్‌తోనే పడేవి. బంతిని హిట్ చేసి ఎప్పుడూ గోల్ చేయలేదు. ఆ విధంగా గోల్‌కీపర్‌ను కంగారుపెట్టేవాడు. మా తండ్రి గారి ఆటను చూడడానికి ప్రజానీకం పోటీపడేది.

అలనాటి విఖ్యాత సినీ గాయకుడు కుందన్‌లాల్ సైగల్ నాన్నగారి ఆటను చూడడానికి బొంబాయి స్టేడియానికి వచ్చారు. పోటీ ప్రథమార్థంలో నాన్నగారి జట్టు ఒక్క గోల్ కూడా చేయలేదు. దాంతో సైగల్ నిరుత్సాహపడ్డారు. అయితే పోటీ ద్వితీయార్థంలో నాన్నగారు ఎనిమిది గోల్స్ వేసి విజయం సాధించడంతో సైగల్ అభినందిస్తూ, 'నీ జట్టు కోసం మీరు కోరిన ఎనిమిది పాటలు పాడతాను' అని ప్రకటించి జట్టు సభ్యులను తన ఇంటికి విందుకు ఆహ్వానించారు. వారు కోరిన పాటలు పాడి ప్రతి క్రీడాకారునికి చేతి గడియారం బహూకరించారు. మా తండ్రిగారు జీవితాంతం ఆ గడియారాన్నే ధరించారు.

1936 బెర్లిన్‌లో ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి భారత హాకీ జట్టు వెళ్లవలసి ఉంది. మరోవంక బర్మాయుద్ధంలో ఆయన సైనిక విధులు నిర్వహించవలసి ఉంది. అయితే ప్రత్యేక అనుమతితో ఒలింపిక్స్‌కు వెళ్లారు. ఆ యుద్ధంలో పాల్గొన్న వారంతా మరణించారు. మా తండ్రిగారు ఒలింపిక్స్‌కు వెళ్లడం వలన బతికి బయట పడ్డారని పిస్తుంది. 1956లో ఆర్మీలో పదవీ విరమణ చేసి తిరుగు ప్రయాణమైనప్పుడు మీరట్ రైల్వేస్టేషన్‌లో వేలాదిమంది అభిమాన స్వాగతం పలికారు.

**శిక్షణ కేంద్రాలు**

ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు నాన్న ధ్యాన్‌చంద్ శిక్షణ కేంద్రాలు నడిపేవారు. మా నాన్నకు హాకీ అంటే ప్రాణం. ఆ ఆట కోసం నిరంతరం ప్రయాణం చేస్తుండేవారు. పతకాలు కోసం ఆడేవారే కానీ ధనకోసం కాదు. నేను కూడా 1975 ప్రపంచకప్ హాకీ విజేతను. అప్పుడు ప్రభుత్వం రూ. 50 మాత్రమే ఇంక్రిమెంట్ ఇచ్చింది. కానీ నేటి విజేతలు కోట్లు సంపాదిస్తున్నారు. 1962 వరకు మా ఇంటికి విద్యుత్ సదుపాయం కల్పించుకోలేక పోయాం.ఆయన పెన్షన్ దేనికి సరిపోయేది కాదు. రేషన్ కోసం గంటల తరబడి క్యూలో నిలబడవలసి వచ్చేది. వ్యక్తిగత ప్రయోజనాల కోసం తన పేరును ఎక్కడా ఉపయోగించరాదని చెప్పేవారు. ఆయన వ్యక్తిత్వమే మాకు చక్కని ఆస్తి. నా సోదరుడు రైల్వే ఉద్యోగి అయినా తండ్రిపేరు ఎక్కడా వాడుకోలేదు. మా పినతండ్రి రూప్‌సింగ్ కూడా నాన్నగారితో సమానంగా ఆడేవారు. వారిద్దరు కలసి ఒలింపిక్స్‌లో దేశానికి ఐదు బంగారు పతకాలు సాధించిపెట్టారు. పద్మభూషణ్ గ్రహీత నాన్న ప్రథముడు. కానీ ఆయనకు 'భారతరత్న' దక్కలేదు. నేను, మరికొందరి మిత్రులు చేసిన ప్రయత్నం వలన ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని జాతీయ క్రీడాదినంగా ప్రకటించింది. 1995లో అప్పటి ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు చొరవతో ఢిల్లీ స్టేడియంలో నాన్నగారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విద్యార్థి దశలో తాను తరగతులకు గైర్హాజరై ధ్యాన్‌చంద్ ఆటను తిలకించేవాడినని పీవీ గారు స్వయంగా చెప్పారు. ఢిల్లీ స్టేడియాన్ని 2002లో ధ్యాన్‌చంద్ స్టేడియంగా మార్చారు.

నాన్న అనారోగ్యం పాలైనప్పుడు (1979) ఢిల్లీ ఎయిమ్స్‌లో చేర్పించడానికి ఆస్పత్రి వద్ద గంటల కొద్ది క్యూలో నిలబడవలసి వచ్చింది. జనరల్ వార్డులో ప్రవేశం దొరికింది.అక్కడ ఐదు రోజులు ఉన్నారు. దీనిపై దేశ వ్యాప్తంగా పత్రికలలో వార్తలు రావడంతో ప్రత్యేక వార్డుకు మార్చారు. ఆయన మరణ వార్త తెలిసి పెద్ద సంఖ్యలో ప్రజానీకం అంతిమదర్శనం కోసం వచ్చారు. అంత్యక్రియల కోసం భౌతిక కాయాన్ని ఝాన్సీ తీసుకువెళ్లవలసి ఉండగా, ప్రభుత్వం తరపు నుంచి ఎలాంటి సహకారం లేదు.

అభిమానుల అండతో స్వగ్రామం చేరుకున్నాం. ఆయన నిరంతరం క్రీడను అభ్యసించిన ఝాన్సీ క్రీడా మైదానంలో అంత్యక్రియలు జరిగాయి. ఝాన్సీ కొండపై ఆయన శిలావిగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నేడది ఒక యాత్రాస్థలంగా రూపుదిద్దుకుంది. ప్రముఖ క్రీడాకారులలో ఉన్న ప్రతిభను గ్రహించి ఆటలను అభ్యసించాలి అన్న నాన్న మేజర్ ధ్యాన్‌చంద్ మాటలు ఔత్సాహిక క్రీడాకారులకు స్ఫూర్తిదాయకం కావాలని ఆశిస్తాను.

**సేకరణ : పల్లె వేణుగోపాలరావు, క్రీడాభారతి ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్, 9441681399**

ముస్లింలు మెజారిటీలో ఉన్న ప్రాంతంలో హిందువులకు ఎటువంటి హక్కులూ ఉండవని 'సెక్యులర్' దేశంలో ఉంటున్న ముస్లింలు ఇచ్చిన సందేశం 'నూహ్' (హరియాణా). ముందస్తు ప్రణాళికతో, క్షుణ్ణమైన అవగాహనతో, వ్యవస్థీకృతంగా, కుట్రతో చేసిన హింస ఇది. తాము మెజారిటీగా ఉన్న ప్రాంతంలో హిందువులు అణిగి మణిగి ఉండాలే తప్ప సమానంగా ప్రవర్తించ కూడదన్నదే 'నూహ్'లో జరిగిన హింస ఇస్తున్న సందేశం.




# నూహ్



*ముస్లింల భావనలలో ముఖ్యమైన అంశం ప్రజాస్వామ్యానికి సంబంధించినది కాదు. హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలు చేసే పోరాటాన్ని మెజారిటీ పాలనతో ప్రజాస్వామ్యం ఎలా ప్రభావితం చేస్తుందన్నదే వారి ఆలోచన. అది వారిని బలహీనం చేస్తుందా? ఒకవేళ ప్రజాస్వామ్యం వారిని బలహీనం చేస్తే, వారికి ప్రజాస్వామ్యం వద్దు. హిందువులపై ఆధిపత్యాన్ని కలిగి ఉన్న ముస్లిం పాలకుడిని బలహీనం చేయడం కన్నా ముస్లిం రాష్ట్రాలలో క్షీణించిన స్థితిగతులు కొనసాగాలనే వారు కోరుకుంటారు.*

**– డా॥ బాబా సాహెబ్ అంబేడ్కర్, పాకిస్తాన్ ఆర్ పార్టిషన్ ఆఫ్ ఇండియా, థాకర్ అండ్ కో లిమిటెడ్, బాంబే, 1945, పేజీ. 227..**

వాస్తవంగా, 1946-47, అంటే భారత విభజనకు ముందు, ఢిల్లీలోని మేహరౌలీ నుంచి, రాజస్తాన్‌లోని దౌసాలో గల బందికుయి వరకు స్వతంత్ర ప్రతిపత్తి గల 'మియోస్తాన్'ను డిమాండ్ చేస్తూ పాల్పడ్డ హింసను ఈ నూహ్‌లో జరిగిన తాజా ఘటనలు గుర్తుకు తెస్తున్నాయి.

నూహ్ జిల్లా ఎప్పుడూ ఏదో ఒక వివాదం వల్ల వార్తల్లో ఉంటుంది– సైబర్ క్రైమ్, పశువుల అక్రమ రవాణా, కిడ్నాప్‌లు, అత్యాచారాలు, బలవంతపు మతమార్పిడులు, హత్యలు, దళితులపై దాడులు.. ఒకటేమిటి, సర్వభ్రష్టుత్వాలూ అక్కడ కనిపిస్తాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే, దీనిని నేరాలకు కేంద్రంగా పరిగణించవచ్చు. ఇటీవలే శివయాత్ర లేక జలాభిషేక యాత్ర సందర్భంగా ఇక్కడ జరిగిన ఘటనలు మొత్తం దేశానికి, ప్రత్యేకంగా హిందువులకు ఒక సందేశంగా భావించాలి. మేవాట్‌లోని సాంప్రదాయాలు, మహాభారత కథనాలతో ప్రజలను పున:అనుసంధానం చేసేందుకు ఈ ప్రాంతంలో ప్రతి ఏడాది విశ్వహిందూ పరిషత్, 'జలాభిషేక యాత్ర'ను నిర్వహిస్తుంది. ఈసారి యాత్ర నూహ్ ప్రాంతంలోకి ప్రవేశించగానే, యాత్రికులపై రాళ్లు రువ్వడం ప్రారంభమైంది. అంటే, యాత్ర ప్రవేశించే ముందే ముస్లింలు తమ ఆయుధాలను సిద్ధం చేసిపెట్టు కున్నట్టుగా వారు ఒక్కసారిగా యాత్రికులపై దాడికి పాల్పడ్డారు. పోలీసు లెక్కల ప్రకారం ఆరుగురు మాత్రమే మరణించినా, ప్రత్యక్ష సాక్షులు ఆ సంఖ్య మరింత ఎక్కువేనని చెప్తున్నారు. ఇంత చేసీ, వారు తమ మైనార్టీ కార్డును నిస్సిగ్గుగా బయటకు తీసి, హింసకు కారణం బజరంగ్ దళ్, గోసంరక్షకులని ఆరోపిస్తున్నారు.

భారతదేశ వ్యాప్తంగా హిందువులపై జరిగే దాడుల సరళితో నూహ్ మమేకం అవ్వడమే కాదు, దాదాపు 4000 మంది భక్తులను ఒక ఆలయంలో బందీలను చేసి, భారీగా పోలీసులు మోహరించి ఉన్నప్పటికీ, జంకూ గొంకూ లేకుండా కాల్పులకు పాల్పడడం ద్వారా ఇతరుల కన్నా ఒక అడుగు ముందుకు వేశారు. అక్కడకు చేరుకున్న పోలీసు దళాలు.. ప్రధాన రోడ్లన్నీ ముస్లింల ముట్టడిలో ఉండడంతో బందీలను రహస్యంగా పొలాల నుంచి కాపాడవలసి వచ్చింది. తాము ప్రజాస్వామిక, స్వేచ్ఛను ప్రేమించే సమాజంలో ఉన్నామని చెప్పుకునే ప్రజలు, పాలనావ్యవస్థ ఉన్న దేశంలో ఇటువంటి ఘటనలు జరగడం తీవ్ర ఆందోళనకు, ఆలోచనకు

## ప్రణాళికాబద్ధమైన దాడుల సరళి

**దాడికి ముందు**

- ఏదో ఒక మిషతో హిందువులపై దాడి చేసేలా స్థానిక ముస్లింలను రెచ్చగొట్టేం దుకు సోషల్ మీడియా వినియోగం
- దాడి చేయాలనుకున్న ప్రదేశం వద్ద మేడలపై భారీ ఎత్తున రాళ్లు, గాజు సీసాలు, పెట్రోలు బాంబులను సేకరించి పెట్టడం
- ఈ ద్వేషపూరిత నేరానికి పాల్పడే ముందు సీసీటీవీ కెమెరాలను బద్దలు చేయడం

**దాడి సమయంలో…**

- మేడలపై నుంచి లేదా (ఈ సందర్భంలో) కొండపై నుంచి, పట్టుకోలేని, చేరలేని విధమైన స్థానాల నుంచి ఆకస్మిక దాడులకు పాల్పడడం
- జిహాదీ/ ఇస్లామిక్ నినాదాలు చేయడం
- మహిళలు, పిల్లలను లక్ష్యంగా చేసుకోవడం
- పోలీసు సిబ్బందిని లక్ష్యంగా చేసుకోవడం
- ముస్లిం మెజారిటీ ప్రాంతాలలోని పోలీసు రికార్డులను ధ్వంసం చేయడం
- ఒకరికొకరు మార్గదర్శనం చేసుకునేందుకు సోషల్ మీడియాను ఉప యోగించడం



# హింస.. భారీ కుట్ర

రవి మిశ్ర

లోను చేస్తాయి.

రాడికల్ ఇస్లాంవాదులు విదేశీ మద్దతుతో, హిందువులపై దాడులకు ఒక టూల్ కిట్‌ను ప్రమాణీకరించారు. ఇస్లాం మూకలు అవసరమైనప్పుడల్లా సత్వర సమన్వయ, సహకారం కోసం సోషల్ మీడియా వేదికలను ఉపయోగించుకుంటున్నాయి. ముఖ్యంగా, దాడుల సమయంలోనూ, తరువాత తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసేందుకు వారు దీనిని విస్తృతంగా వాడుకుంటున్నారు. వారి లక్ష్యం సుస్పష్టం–హిందువుల పండుగలు, మత పరమైన సందర్భాలపై దాడి చేయడం. కొద్దికాలం ముందే బెంగాల్‌లో రామనవమి ఊరేగింపుపై, ఉత్తరాఖండ్, ఢిల్లీలో హనుమాన్ జయంతి యాత్రల సందర్భంగా, సోషల్ మీడియా పోస్టు సాకుతో బెంగళూరులో హింస, సీఏఏ వంకతో ఈశాన్య ఢిల్లీలో దాడులు.. ఇవన్నీ అందరికీ గుర్తుండే ఉంటాయి. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. సమాచార యుద్ధంలో ఒక కీలక భాగమైన ప్రధాన స్రవంతి మీడియా, 'సెక్యులర్' సాకు చూపించి, తరచూ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోంది. బాధితులు హిందువులైనప్పుడు, దాడి చేసినవారిని గుర్తించేందుకు సంశయించడం అన్నది పూర్తిగా వారి వృత్తిపరమైన విలువలకు వ్యతిరేకమైనది.

**ముందస్తు ప్రణాళికతో దాడి**

✧ 'ఒకవేళ మోను (మోనేసర్) మేవాట్ వస్తే, మేం మొత్తాన్నీ భస్మం చేస్తాం' అంటూ మహమ్మద్ సబీర్‌ఖాన్ జులై 31వ తేదీన ఫేస్‌బుక్‌లో రోడ్డుపై వరుసగా పెట్టిన గ్యాస్ సిలిండర్ల ఫోటోను పోస్టు చేశాడు.

✧ అదే రోజు (జులై 31న)న జలాభిషేక యాత్ర ప్రారంభమైన కొద్ది సేపటి తర్వాత, 'కుఛ్ దేర్ మే నూహ్ మే... ఇన్షాల్లా' (కొద్దిసేపట్లో నూహ్‌లో ఇన్షాల్లా) అంటూ రహీస్ ఖాన్ రంగలియా అనే వ్యక్తి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు.

✧ యాత్రగా మేవాట్‌కు వస్తున్న వీహెచ్‌పీ సభ్యుల ఊరేగింపునకు సంబంధించిన లైవ్ అప్‌డేట్లను ఆయేషా నవాజ్, ఆర్బాజ్‌ఖాన్ దంగల్ అనే యువకులు పోస్టు చేస్తూ వచ్చారు.

✧ యాత్రలో పాల్గొంటున్న హిందువుల కన్నా ఎక్కువ సంఖ్యలో ముస్లిం పురుషులు ముందుకు వచ్చి, అవకాశం వచ్చినప్పుడు దాడి చేసేలా యాత్రికులకు ముందు, చివరలో నిలబడవల సిందిగా ఆదేశిస్తూ మహమ్మద్ సాబీర్ ఖాన్ తన ఓ పోస్ట్ చేశాడు.

✧ మరొక ఫేస్‌బుక్ చాట్‌లో సిద్ధంగా ఉండవల

## హిందువులపై దాడులు; గతంలో జరిగిన హింస

**ఈశాన్య ఢిల్లీ, 2020**

- సీఏఏ వ్యతిరేక నిరసనల ముసుగులో ఈశాన్య ఢిల్లీకి చెందిన హిందువులపై దాడులు
- ఈ హింసలో దాదాపు 51 మందికి పైగా వ్యక్తులు మరణించగా, 200కి పైగా గాయపడ్డారు.
- ఇళ్లు, దుకాణాలు, ఆలయాలపై ముస్లిం మూకలు దాడి చేసి, తగులబెట్టారు
- ఒక నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ, '2020లో ఢిల్లీ అల్లర్లు ప్రణాళికాబద్ధంగా అమలు చేసిన ఒక కుట్ర' అంటూ ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది.

**బెంగళూరు (కర్ణాటక), ఆగస్ట్ 2020**

- ముస్లిం అల్లరిమూకలు కేజీ హళ్లి ప్రాంత పోలీసు స్టేషన్‌పై దాడి చేసి, దానికి నిప్పంటించడమే కాక రాళ్లతో, ఇనుప ఊచలతో, మెరుగు పరిచిన పెట్రోల్ బాంబులు, ఇతర ఆయుధాలతో పోలీసులపై దాడికి పాల్పడ్డారు.
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను విస్తృతంగా ధ్వంసం చేశారు
- నిందితుడు ఇమ్రాన్ అహ్మద్‌కు బెయిల్‌ను నిరాకరిస్తూ, 'ఇది హఠాత్తుగా, తీవ్రంగా రెచ్చిపోవడం వల్ల జరిగింది కాదు, కనీసంగా చెప్పాలంటే ప్రతి చిన్న విషయాన్నీ ముందుగానే కచ్చితంగా ప్రణాళిక వేసుకుని, దాని ప్రకారమే అమలు చేశారు' అని కర్ణాటక హైకోర్టు పేర్కొంది

**జహంగీర్‌పురి (ఢిల్లీ), ఏప్రిల్ 2022**

- ముస్లిం మూకలు హనుమాన్ జయంతి ఊరేగింపుపై దాడి చేశారు.
- ఈ హింస ముందస్తుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారమే జరిగిందని ఢిల్లీ పోలీసులు అధికారికంగా ప్రకటించారు
- ప్రధాన నిందితులు మహమ్మద్ అన్సార్, తబ్రేజ్, షేక్ ఇష్రిల్ వ్యూహాత్మకంగా ఊరేగింపు మార్గంలో అనేక మిద్దెల మీద రాళ్లను, గాజు సీసాలను చేర్చారు.

**రూర్కీ (ఉత్తరాఖండ్) ఏప్రిల్ 2022**

- హనుమాన్ జయంతి ఊరేగింపుపై ఇటువంటి దాడే
- ముస్లిం మూకలు మేడలపై నుంచి రాళ్లను విసరడమే కాదు, అందులో పాలుపంచుకున్న హిందువులపై కాల్పులు జరిపారు.

**హౌరా, హుగ్లీ, దల్‌ఖోలా (పశ్చిమ బెంగాల్), ఏప్రిల్ 2023**

- రామనవమి శోభాయాత్రపై ప్రత్యేకంగా మసీదుల సమీపంలో అల్లరిమూకల దాడి
- మహిళలు, పిల్లలు, వాహనాలపై రాళ్లు రువ్వడమే కాదు, ఇతర ప్రభుత్వ ఆస్తుల దగ్ధం

**వడోదర (గుజరాత్), ఏప్రిల్ 2023**

- రామ నవమి ఊరేగింపుపై రాళ్ళు రువ్వడం
- 500మంది ముస్లిం అల్లరి మూకలపై ఎఫ్ఐఆర్ దాఖలు

# ద్వేషపూరిత మేవాట్

## మతాంతరీకరణల కేంద్రం

ఇద్దరు హిందూ విద్యార్థులను నమాజ్ చేసి, ఇస్లాంలోకి మారవలసిందిగా మాధి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల 'మేవాట్ మోడల్ స్కూల్' ఉపాధ్యాయులు ఇద్దరు ఒత్తిడి చేస్తున్నారని 2017 జులైలో వార్తలు వచ్చాయి.

- నిందితులను మొయినుద్దీన్, ముబారక్ అలీ, మహమ్మద్ ఆరీఫ్‌లుగా గుర్తించారు. కొద్దిరోజుల తర్వాత, బాధితులు పాఠశాల వదిలిపోయేలా ఒత్తిడి తెచ్చారు.
- ఇస్లాంలోకి మారేందుకు నిరాకరించిన మేవాట్‌లోని మోహ్లాక గ్రామానికి చెందిన ఒక దళిత కుటుంబంపై జనవరి 2018లో దారుణంగా దాడి చేశారు.
- వ్యక్తుల నుంచి డబ్బులు గుంజేందుకై తనపై లైంగిక అత్యాచారాలకు పాల్పడుతున్నారంటూ 22 ఏళ్ల తన భార్య చేత తప్పుడు కేసులు పెట్టించి నందుకు హిజర్ ఖాన్ అనే వ్యక్తిని 2019 జులైలో అరెస్టు చేశారు.

## ఇస్లామిక్ తీవ్రవాదం

- మేవాట్ ప్రాంతంలో మహమ్మద్ ఇల్యాస్ అల్ –ఖంథ్లవీ 1926లో 'తబ్లీగీ జమాత్'ను ఏర్పాటు చేశాడు.
- ఇస్లాంలో నైతిక విలువల క్షీణత, అనేక అంశాల పట్ల నిర్లక్ష్యానికి స్పందనగా అభివృద్ధి చేసిన 'దేవబంద్' సంస్కరణవాద సంప్రదాయంలో జమాత్ మూలాలు కనిపిస్తాయి. ఇస్లాంలో ఆధ్యాత్మిక సంస్కరణ లక్ష్యంగా ఈ ఉద్యమం ప్రారంభమైనట్టు చెప్పుకుంటారు.
- తీవ్రవాద సంబంధ కార్యకలాపాల కారణంగా జమాత్ దేశీయ, అంతర్జాతీయ భద్రతా ఏజెన్సీల రాడార్‌పై ఉంది.

'యునైటెడ్ స్టేట్స్‌లో కూడా తబ్లీగీ జమాత్ గణనీయ స్థాయిలో ఉంది. ప్రస్తుతం, గతంలో కూడా రిక్రూట్‌మెంట్ కోసం అల్–ఖైదా వారిని ఉపయోగించుకుందని కనుగొన్నాం' అని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు చెందిన అంతర్జాతీయ తీవ్రవాద విభాగం డిప్యూటీ చీఫ్ మైకెల్ జె హీమ్‌బాక్ చెప్పినట్టు న్యూయార్క్ టైమ్స్ 2003లో పేర్కొంది.

నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) సెప్టెంబర్ 2018లో పాకిస్తాన్ నుంచి పనిచేసే తీవ్రవాద గ్రూపు లష్కర్– ఎ– తయిబా నడిపే సంస్థ అయిన ఫయా–ఎ– ఇన్సానియత్ ఫౌండేషన్‌తో సంబంధాలను కలిగి ఉన్నందుకు మహమ్మద్ సల్మాన్, మహమ్మద్ సలీ, సాజిద్ అబ్దుల్ వానీ అనే ముగ్గురు తీవ్రవాదులను అరెస్టు చేసింది. ఇందులో సల్మాన్ మేవాట్‌లోని ఒక గ్రామవాసి. ఇదే గ్రామంలో గల ఖులాఫా– ఎ– రషీదీన్ మసీదును లష్కర్–ఎ–తయిబా నుంచి అందుకున్న నిధులతో నిర్మించినట్టు అక్టోబర్ 2018లో వెల్లడైంది.

## 'దళితుల' మరుభూమి

'హరియాణాలోని మేవాట్ దళితులకు శ్మశానంలా మారుతోంది. పాకిస్తాన్‌కు, మేవాట్‌కూ మధ్య తేడా లేదు. మేవాట్‌లో మహిళలను బలవంతంగా ఎత్తుకుపోయి, అత్యాచారం జరిపిన వార్తలు అనేకం వస్తున్నాయి' అని మాజీ న్యాయమూర్తి పవన్ కుమార్ పేర్కొన్నట్టు విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సల్ విడుదల చేసిన పత్రికా ప్రకటన వెల్లడించింది.

మేవాట్‌లో దళితులపై జరుగుతున్న హింస, అత్యాచారాలను వెలుగులోకి తెచ్చేందుకు పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి పవన్ కుమార్ నాయకత్వంలో నలుగురు సభ్యుల దర్యాప్తు కమిటీని హర్యానాకు చెందిన శ్రీ వాల్మీకి మహాసభ ఏర్పాటు చేసింది. ఈ ప్రాంతంలో దళితులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లపై ఎటువంటి చర్యా తీసుకోవడం లేదని మహాసభ ఆరోపించింది.

## కమిటీ నివేదిక చేసిన ఆరోపణలు

- ఈ ప్రాంతంలో దళితులపై తరచుగా ముస్లింల దాడులు.
- పాఠశాలకు వెళ్లే ఆడపిల్లలు, మహిళను వేధిస్తున్న సంఘటనలు సర్వసాధారణంగా మారుతున్నాయి.
- నలుగురు ముస్లిం యువకులు 12 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. వారు అత్యాచారం చేసిన ఆ ఇల్లు ఒక ముస్లిం పోలీసుది. ఈ ఘటన జరిగి ఏడాది దాటుతున్నప్పటికీ, ఇంతవరకూ ఎటువంటి చర్య తీసుకోలేదు.
- ఫిరోజ్‌పూర్ నమక్‌లో తొమ్మిది మంది ముస్లింలు ఒక మహిళను బలవంతంగా ఎత్తుకునిపోయి రోజుల తరబడి మూకుమ్మడి అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితులే ఆ మహిళను హత్య చేశారు. కానీ ఇప్పటివరకూ ఎటువంటి చర్య తీసుకోలేదు.
- దాదాపు 200కుపైగా బలవంతపు మతాంతరీకరణలు జరిగినట్టు ఫిర్యాదులు వచ్చినప్పటికీ, పోలీసుల చర్య సున్నా. తత్ఫలితంగా, ఇప్పుడు కుటుంబ సభ్యులు కూడా మతం మార్చుకోవాలని వారిపై ఒత్తిడి పెరుగుతున్నది.

## జనసంఖ్యా సంబంధ మార్పు

- 2005 అనంతరం గుర్‌గావ్ నుంచి వేరుచేసి ఏర్పరచిన మేవాట్ జిల్లా జన సంఖ్య విషయంలో భారీ మార్పు కనిపిస్తుంది.
- సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ప్రకారం, జిల్లాలోని ముస్లిం జనాభా 1981లో గల 66.3 శాతం నుంచి 2011లో 79.2 శాతానికి పెరిగింది.
- ఈ మూడు దశాబ్దాలలో జిల్లాలోని ముస్లింలు 3.41 రెట్లు పెరిగి 2.53 నుంచి 8.62 లక్షలు కాగా, మిగిలిన జనాభా 1.76 రెట్లు మాత్రమే పెరిగి 1.29 నుంచి 2.27 లక్షలు అయ్యారు.
- ఇక్కడ ముస్లిం పిల్లలు 24.6 శాతం కాగా, హిందువుల పిల్లలు 15.9 శాతం మాత్రమే.





సిందిగా ట్రక్కు, డంపర్ డ్రైవర్లను కోరాడు.

✧ హింసాత్మక అల్లర్ల తర్వాత, ఆధారాలు దొరక కుండా తమ సోషల్ మీడియా పోస్టులను, వీడియోలను తొలగించవలసిందిగా పరస్పరం విజ్ఞప్తి చేసుకున్నారు.

**నూహ్‌లో హిందూ భక్తులపై దాడి ఎంత సమన్వయపూరితంగా జరిగిందో చెప్పేందుకు కొన్ని ఆధారాలు:**

జులై 31న యాత్ర సందర్భంగా కత్తులు, తుపాకులతో ముస్లిం మూకలు తమపై దాడి చేస్తారని హిందూ భక్తులు ఊహించలేదు. ఈ యాత్రలో మహిళలు, పిల్లలు, వృద్ధులు కూడా పాల్గొన్నారు. బజరంగ దళ్ కార్యకర్తలు అభిషేక్ రాజ్‌పుట్, ప్రదీప్ శర్మలను ఎంచుకుని మరీ దాడి చేశారు. ఓ మిఠాయి అమ్మకందారు అభిషేక్ తన దుకాణం కట్టేసి ఇంటికి తిరిగి వస్తుండగా అతడిని దారుణంగా హత్య చేశారు. అంతేకాదు, నీరజ్, గురుసేవక్ అనే ఇద్దరు హోంగార్డులను కూడా హత్యచేశారు. అధికారిక లెక్కల ప్రకారం మొత్తం మరణాల సంఖ్య ఐదుగురు హిందువులు సహా ఆరు అని చెప్తుండగా, ఆలయం ప్రాంతంలో దాదాపు 50 మంది భక్తులను హత్యచేసినట్టు ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. అయితే, వారి మృతదేహాలు ఇంకా దొరకలేదు. కొందరు వ్యక్తులు కనిపించడం లేదంటూ ఫిర్యాదులు అందగా, దర్యాప్తు కొనసాగుతోంది. ఈ దాడిలో 10 మంది పోలీసులు, ఒక డీసీపీ సహా 200 మంది గాయ పడగా, 300 వాహనాలను తగులబెట్టినట్టు తెలుస్తోంది.

**నూహ్ ప్రాముఖ్యం:**

మహాభారతంలో ప్రస్తావించిన మూడు శివలింగాలకు నూహ్ ప్రాంతం ప్రతీక. అలాగే కృష్ణ భగవానుడు తన గోవులను ఇక్కడ మేతకు తీసుకువచ్చేవాడని విశ్వాసం. సోహ్నా నుంచి మేవాట్‌లోకి యాత్ర ప్రవేశించే సమయంలో ఆచారం ప్రకారం నల్హర్ మహాదేవ్ ఆలయం వద్ద జలాభిషేకం చేస్తారు. ఆరావళి పర్వతాల నడుమ ఉన్న ఈ ప్రాచీన ఆలయం పాండవుల కాలం నాటిదని అంటారు. ఇది నూహ్ పట్టణానికి సమీపంలో ఉంటుంది. దీంతో పాటు నల్హర్ పాండవ్ రిజర్వాయర్ కూడా ఉంది. జలాభిషేకం తర్వాత భక్తులు ఝిరకేశ్వర్ మహాదేవ్ ఆలయం, పున్‌హన తహశీల్‌లోని శృంగార్ గ్రామంలో రాధాకృష్ణ ఆలయాన్ని సందర్శిస్తారు. ఆ తర్వాత వారు శృంగేశ్వర్ మహాదేవ్ ఆలయాన్ని సందర్శించి అక్కడ మరొకసారి జలాభిషేకం చేస్తారు.

**'మియోస్తాన్'ను కోరుకున్నవారు**

మేవాట్ ప్రాంతంగా మనం చెప్పుకునేది, హరియాణా దాటి రాజస్తాన్‌లోని మూడు జిల్లాలు, ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథుర జిల్లాకు విస్తరిస్తుంది. ఈ ప్రాంతం ఢిల్లీ, ఆగ్రా, జైపూర్‌ల మధ్య ఉన్న గోల్డెన్ ట్రయాంగిల్ పర్యాటక సర్క్యూట్ మధ్యలో గుండె కాయలా ఉంటుంది. కమ్యూనిస్టు మియో నాయకుడు కున్వర్ మహమ్మద్ అష్రఫ్, రాజ్ పుటాణాలో గల ముస్లిం లీగ్‌లోని ఒక వర్గం సంక్షుభిత 1946-47 కాలంలో ప్రత్యేక 'మియోస్తాన్' కోసం డిమాండ్ చేశారు.

పాకిస్తాన్‌కు పక్కగా మియోస్తాన్‌ను సాధించాలని వారి భావన. జిన్నా కోరుకున్నట్టుగా పంజాబ్ ప్రాంతం మొత్తం (నేటి హరియాణా, హిమాచల్ ప్రదేశ్) పాకిస్తాన్ వడిలో వాలుతుందను కున్నారు. స్వాతంత్ర్యం, విభజన అనంతరం మంటలు చల్లారినప్పటికీ, సరిహద్దులు దాటి పాకిస్తాన్‌కు వెళ్లిన మియోలను వెనక్కి తీసుకువచ్చే ప్రయత్నం నెహ్రూ ప్రభుత్వం చేసింది. ఈ విధానాలను నిరసిస్తూ, భరత్‌పూర్, ఆళ్వార్, గుర్గావ్‌కు చెందిన మియోలు ముస్లిం లీగ్ స్ఫూర్తితో ప్రత్యేక మియోస్తాన్‌ను డిమాండ్ చేయడమే కాక, స్వాతంత్ర్య సమయంలో తమ ఇరుగు పొరుగులపై తీవ్రమైన హింసకు, అల్లరకు పాల్పడ్డారని రాజ్యాంగ సభలో సర్దార్ భూపేందర్ సింగ్ పేర్కొనడం గమనార్హం.

'సడలింపు లతో కూడిన అనుమతి వ్యవస్థ కింద మియోలు తిరిగి వచ్చి తమ ఆస్తుల కోసం డిమాండ్ చేస్తున్నారు. ఒక వైపు, మన వద్ద ఆస్తులు తక్కువ ఉండగా, ఇంకోపక్క వారికి రాయితీల మీద రాయితీలు ఇస్తున్నారు. ఇది నిస్సందేహంగా సెక్యులరిజమే, కానీ ఏకపక్ష, అవాంఛనీయమైన పద్ధతి. ఇది సిక్కు, హిందూ శరణార్థులకు వ్యతిరేకమైన పక్షపాత ధోరణి. కొద్ది కాలం కిందటే భారత సమగ్రతను విస్పష్టంగా అగౌరవపరిచిన వారికి పౌరసత్వ హక్కులను ఇవ్వడం నాకు ఇష్టం లేదు' అని ఆయన అన్నారు. నేడు మనం ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు జరుపు కుంటున్న సమయంలో భారత్ తాను గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవలసి ఉంది. మనం చరిత్ర నుంచి నేర్చుకోకపోతే, చరిత్ర పునరావృతం అవుతుంది.

**'ఆర్గనైజర్' నుంచి**

**'కార్టూన్ పోటీ - 2023'లో ద్వితీయ బహుమతి పొందినది**



# సభ్యత లేదు..

**2024 లోక్‌సభ ఎన్నికలు ఇంకా ఎంతో దూరంలో లేవు. మరోవైపు, 'మూడ్ ఆఫ్ ది నేషన్'ను బట్టి చూసినా, వివిధ సంస్థలు నిర్వహించిన, నిర్వహిస్తున్న సర్వేలను బట్టి చూసినా, ముచ్చటగా మూడవసారి ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీఏ అధికారంలోకి రావడం ఖాయమనే విషయం 'సర్వ' జనులకు స్పష్టమైంది. సుస్థిర అభివృద్ధితో భారత ఆర్థిక వ్యవస్థను సమున్నత స్థాయికి చేర్చడంతో పాటు, దేశాన్ని ప్రపంచ పటంలో 'విశ్వగురువు'గా నిలిపే 'సంకల్ప' బలంతో ముందుకు సాగుతున్న మోదీ ప్రస్థానాన్ని అడ్డుకోవడం అయ్యే పనికాదని విపక్షాలు సహా ఏ ఒక్కరిలోనూ ఎలాంటి అనుమానం లేదు. అందుకే, మోదీకి సమఉజ్జీ లేరని విపక్ష కూటమి నేతలు మీడియా చర్చల్లో బహిరంగంగా అంగీకరిస్తున్నారు. మరో దారి లేకనే సిద్ధాంతాలకు 'తూచ్' చెప్పేసి, రాజకీయ విభేదాలను పక్కన పెట్టి అధికారం కోసం జట్టు కడుతున్నారు. అదే విషయాన్ని సిగ్గువిడిచి మరీ చెప్పుకోవడం విచిత్రం. ఎర్రకోట కోట నుంచి త్రివర్ణ పతాకం సాక్షిగా మళ్లీ అధికారం తమదేనని మోదీ విశ్వాసం ప్రకటిస్తే, విపక్షాలు పార్లమెంట్ నుంచి పలాయనం చిత్తగించాయి.**

మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తే సమీప భవిష్యత్‌లో మరో పార్టీ లేదా మరో కూటమి అధికారంలోకి రావడం అయ్యే పనికాదనే నిజాన్ని విపక్షాలు ముందుగానే పసిగట్టాయి. అదే జరిగితే, ఇక అక్కడితో తమ రాజకీయ భవిష్యత్‌కు తెర పడినట్లే అనే భయం విపక్ష నాయకులను వెంటాడుతోంది. ముఖ్యంగా, వరుసగా రెండుసార్లు 'చారిత్రక' ఓటమిని చవి చూసిన కాంగ్రెస్ పార్టీ 'హ్యాట్రిక్' పరాభవం నుంచి తప్పించుకునేందుకు ఇతర ప్రతిపక్షాలను కలుపుకునే క్రమంలో కాళ్ల బేరానికి సైతం సిద్ధమైంది. చివరకు కాంగ్రెస్ పార్టీని ఇటు ఢిల్లీలో అటు పంజాబ్‌లో నామరూపాలు లేకుండా చేసిన ఆమ్ ఆద్మీ పార్టీకి దాసోహమయ్యే స్థాయికి హస్తం పార్టీ చేరింది. అలాగే, అవినీతికి 'కేరాఫ్ అడ్రస్'గా మారిన ప్రాంతీయ, కుటుంబ పార్టీలు ఆత్మరక్షణలో పడిపోయాయి. మోదీని ఎదుర్కోవడం ఏ ఒక్కరి తోనూ అయ్యే పని కాదనే నిర్ణయానికి వచ్చాయి. అందుకే కురువృద్ధ కాంగ్రెస్ సహా బీజేపీ/ఎన్డీఏ వ్యతిరేక పార్టీలన్నీ ఒకటయ్యే ప్రయత్నం చేస్తున్నాయి. మంచిదే.. ఒంటరిగా కాకపోయినా మూకుమ్మడిగా అయినా, ప్రతిపక్షాలు ప్రస్తుత ప్రభుత్వ విధానాలలోని లోపాలను ఎత్తి చూపి, ప్రత్యామ్నాయ విధానాలు, ప్రణాళికతో ముందుకు వస్తే కాదనేది ఉండదు. రెండు పార్టీలు, రెండు కూటములు, రెండు విభిన్న రాజకీయ, ఆర్థిక విధానాలను బేరీజు వేసుకుని రెండింటిలో ఏది మంచిదో, ఏది చెడ్డదో ప్రజలు నిర్ణయించుకుంటారు. సమయం వచ్చినప్పుడు సరైన తీర్పునిస్తారు.

కానీ, అదేమి దౌర్భాగ్యమో ఈరోజు, ఐ.ఎన్.డి.ఐ.ఎ (ఇండియా)గా నామకరణం చేసుకున్న 26 పార్టీల కొత్త కూటమికి ప్రజల ముందుంచేందుకు ఒక ప్రత్యామ్నాయ ఎజెండా, ప్రణాళిక, కార్యక్రమం వంటివి లేవు. ఇక నాయకత్వం విషయమైతే చెప్పనే అక్కరలేదు. వీటన్నిటినీ మించి పరస్పర విశ్వాసం అసలే లేదు. 'నువ్వొకందుకు పోస్తే నేనొకందుకు తాగుతున్నాను..' అన్నట్లుగా వ్యవహారం సాగుతోంది. నిజానికి, పదేళ్లు దేశాన్ని పాలించిన యూపీఏకి, ప్రస్తుత ఇండియా కూటమికి ఒక్క పేరులో తప్ప మరో తేడా లేదు. యూపీఏ పేరును, ఆరు వంకర్లు, ఐదు మధ్య చుక్కలతో ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంట్ ఇంక్లూసివ్ అలయన్స్ (ఐ.ఎన్.డి.ఐ.ఎ– ఇండియా)గా మార్చుకున్నారు.

సరే.. విపక్షాల 'ఇండియా' ప్రహసనం చివరకు ఎలా ముగుస్తుందనే ప్రశ్నను కాసేపు పక్కన పెడితే ఈ ప్రహసనం సాగుతున్న క్రమంలో ప్రతిపక్షాల పెద్దలు పార్లమెంట్ లోపల, వెలుపల వ్యవహరిస్తున్న తీరు దేశ, విదేశాల్లో చేస్తున్న ప్రసంగాలు అనేక అనుమానాలకు ఆస్కారం ఇస్తున్నాయి. విపక్ష సభ్యులు సభ్యత, సంస్కారం మరచి ప్రవర్తిస్తున్న తీరు, చేస్తున్న ప్రసంగాలు వారి ప్రతిష్టనే కాదు, రాజకీయ సభామర్యాదలకు సైతం తలవంపులు తెచ్చేలా ఉంటున్నాయి. ముఖ్యంగా 'తుకడే తుకడే గ్యాంగ్'ను వెంటపెట్టుకుని 'భారత్ జోడో' యాత్ర సాగించిన రాహుల్ గాంధీ ప్రవర్తన, పలుకులు ఆయన రాజకీయ ప్రస్థానం ఎటు వైపు సాగుతోందనే విషయంలో పలు అనుమానాలకు తావిస్తోంది. నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్రలో ఆయన అహంకారాన్ని ఏ మేరకు తగ్గించుకున్నారో, ఈ దేశం



రాహుల్

అధీర రంజన్

రాఘవ చద్దా

# సంస్కారం అసలే కానరాదు!



రాజనాల బాలకృష్ణ

గురించి, మన సంస్కృతీ సంప్రదాయాల గురించి ఏమి తెలుసుకున్నారో, ఏమి నేర్చుకున్నారో కానీ పార్లమెంట్‌లో ఆయన ప్రవర్తన కన్ను గీటటాలు, కౌగిలింతల స్థాయి నుంచి మరో పది మెట్లు పతనమై 'ఫ్లైయింగ్ కిస్సులు' విసిరే స్థాయికి దిగజారింది. కాగా, అనర్హత వేటు నుంచి తాత్కాలిక ఉపశమనం పొంది లోక్‌సభలో అడుగు పెట్టిన రాహుల్.. విపక్షాల అవిశ్వాస తీర్మానంపై చేసిన ప్రసంగం గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది.

చాంతాడంత రాగం తీసి చివరకు అదేదో పాట పాడినట్లుగా ఆయన ప్రసంగం సాగింది. రాహుల్ గాంధీని దేశ్ కీ నేతగా చూపేందుకు ఏ మాత్రం సంకోచించకుండా గొంతును అరువిచ్చే రాజ్‌దీప్ సర్దేశాయ్ వంటి వారు కూడా అవిశ్వాస తీర్మానంపై రాహుల్ గాంధీ ప్రసంగం విషయంలో పెదవి విరిచారు. అంతేకాదు, 20 ఏళ్లకు పైగా పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న రాహుల్ గాంధీ.. ఈ రెండు దశాబ్దాల కాలంలో గొప్పగా చెప్పుకోదగిన ప్రసంగం ఒక్కటీ చేయలేదని విచారం వ్యక్తంచేశారు. అంటే, రాహుల్ ప్రసంగం ఆయన అభిమానులను సైతం ఎంతగా నిరాశకు గురిచేసిందో వేరే చెప్పనక్కరలేదు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో 'మణిపూర్‌లో భారతమాత.. హత్యకు గురైంద'నే.. దిగజారుడు వ్యాఖ్యలు చేసి, తన స్థాయిని మరింత దిగజార్చు కున్నారు. అందుకే రాహుల్‌ను తన మీడియా మిత్రులు కూడా ఛీ.. అనక తప్పలేదు.

నిజానికి, రాహుల్ గాంధీ మాత్రమే కాదు, అహంకారం, అజ్ఞానం, అసమర్థతలకు మారు పేరుగా నిలిచిన 'ఘమండియా' కూటమి నాయకులు, పార్లమెంట్ వర్షకాల సమావేశాల్లో ప్రవర్తించిన తీరు దేశానికే తలవంపులు తెచ్చేలా ఉందంటే ఎవరూ కాదన లేరు. ఇక్కడే ఒక ప్రధాన ప్రశ్న ముందుకు వస్తోంది. విపక్షాలు ఎందుకు ఇంతలా దిగజారి ప్రవర్తి స్తున్నాయి? ఎందుకు, తమ బలహీనతలను, భయాలను బయట పెట్టుకుంటున్నాయి? మూడోసారి మోదీ.. అనగానే ఎందుకు అంతలా ఉలిక్కిపడుతున్నాయి? అని అడిగితే ఇందుకు సమాధానం ఒక్కటే. ఆశించిన ఫలితాలు చేజారి పోయినప్పుడు, కాళ్ల కింద నేల కదిలిపోతున్నప్పుడు, ఇటు చూసినా.. అటు చూసినా.. ఎటు చూసినా.. అన్ని దిక్కులా అష్టమ దిక్కే దర్శనం ఇస్తున్నప్పుడు నిస్పృహకు గురికావడం సహజం. ప్రస్తుతం దేశంలో విపక్షాల పరిస్థితి అదే. కాబట్టి పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ఆ పార్టీల నాయకులు గీత దాటి ప్రవర్తిస్తున్నారు. ఒక విధంగా దురహంకారాన్ని చూపుతున్నారు. సభ ఆగ్రహానికి గురవుతున్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత అధీర్ రంజన్ చౌధురి చేసిన వ్యాఖ్యలు, ఆయన ప్రవర్తన సభాహక్కుల ఉల్లంఘనకు దారి తీశాయి. లోక్‌సభ స్పీకర్ సభ ఆమోదంతో ఆయన వ్యాఖ్యలను 'ప్రివిలేజ్' కమిటీకి పంపించారు. ప్రివిలేజ్ విచారణ పూర్తయ్యే వరకు స్పీకర్ ఆయన్ని సస్పెండ్ చేశారు. అలాగే, రాజ్యసభలో తప్పటడుగులు వేసిన ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా, అదుపు తప్పి ఆవేశం ప్రదర్శించిన తృణమూల్ పార్టీ రాజ్యసభ సభ్యుడు డెరెక్ ఒబ్రెయిన్ కూడా 'సస్పెన్షన్'కు గురయ్యారు.

అధీర్ రంజన్ చౌధురి అన్నట్లుగా గతంలో ఎప్పుడూ ప్రధాన ప్రతిపక్ష నేతను సస్పెండ్ చేసిన సందర్భం చరిత్రలో లేకపోవచ్చు. ఇదే తొలిసారి కావచ్చు. ఆ 'గౌరవం' పొందిన వ్యక్తి నేత అధీర్ రంజనే కావచ్చు. కానీ, ఆ పరిస్థితి ఎందుకు వచ్చింది? అని ఆలోచిస్తే ఆత్మపరిశీలన చేసుకుంటే తాను చేసిన తప్పేమిటో ఆయనకే తెలిసి వస్తుంది. కానీ, ఆయన ఆ పని చేయలేదు. నిజానికి, ప్రధానమంత్రి, ఇతర మంత్రులు ప్రసంగించే సమయంలో, సభలో చర్చలు జరుగుతున్నప్పుడు.. అసందర్భ వ్యాఖ్యలు, విమర్శలు చేయడాన్ని అధీర్ రంజన్ అలవాటుగా మార్చుకున్నారు. 'మణిపూర్' విషయంపై మాట్లాడుతూ.. ప్రధాని మోదీకి, నీరవ్ మోదీకి ముడి పెడుతూ నిరాధారమైన ఆరోపణలు చేశారు. ఈ ఒక్కటే కాదు, గతంలోనూ అధీర్ రంజన్ ప్రధాన మంత్రిని, పార్లమెంట్‌ను, దేశాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పినట్లుగా నిరాధార ఆరోపణలు చేయడం, నిందలు మోపడం ఒకరకంగా చూస్తే ఆయనకు అలవాటుగా మారిపోయింది. అలాగే, స్పీకర్ అవకాశం ఇచ్చినా తమ తప్పుడు ఆరోపణలను ఉపసంహరించుకుని, క్షమాపణ చెప్పకపోవడం వల్లనే అనివార్య పరిస్థితిలో స్పీకర్ చర్యలు తీసుకోక తప్పలేదు. గతంలోనూ అధీర్ రంజన్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును 'రాష్ట్రపత్ని' అంటూ సంబోధించి అవమానపరిచారు. అయితే, పొరపాటున నోరుజారానని, అందుకు చింతిస్తున్నానని పేర్కొంటూ చివరకు క్షమాపణలు చెప్పారు.

ఇక ఆప్ రాజ్యసభ సభ్యుడు రాఘవ చద్దా విషయానికి వస్తే.. ఆయన ఏకంగా సభలో ఉన్న ఎంపీల సంతకాలను ఫోర్జరీ చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. రాజ్యసభలో ఢిల్లీ సర్వీసెస్ బిల్లుపై చర్చలో పాల్గొన్న ఈ యువ ఎంపీ, ఈ బిల్లుపై హౌస్ కమిటీ వేయాలని కోరారు. అంతవరకు బానే ఉంది. కమిటీలో ఉండే సభ్యుల పేర్లనూ ఆయనే సూచించారు. అది కూడా కొంతవరకు అంగీకరించవచ్చు. కానీ, సభ్యుల అనుమతి లేకుండా, అదీ అధికార కూటమికి చెందిన సభ్యుల పేర్లను కమిటీకి సూచించడంతో వివాదానికి తెర లేచింది.

ఎన్డీఏకి చెందిన సస్మిత్ పాత్ర, ఎన్. ఫాంగ్నాన్ కొన్యాక్, ఎం. తంబిదురై, నరహరి అమీన్‌లు తమ అనుమతి లేకుండా తమ పేర్లను చేర్చారని, తమ సంతకాలను ఫోర్జరీ చేశారని ఫిర్యాదు చేయడంతో రాజ్యసభ చైర్మన్ వారి ఫిర్యాదులను ప్రివిలేజ్ కమిటీ విచారణకు ఆదేశించారు. విచారణ పూర్తయ్యే వరకు చద్దాను సస్పెండ్ చేశారు. ఇక తృణమూల్ సీనియర్ సభ్యుడు డెరెక్ ఒబ్రెయిన్ ఒకటికి పదిమార్లు సభా కార్యక్రమాలకు అడ్డుతగలడంతో పాటుగా నేరుగా, సభాధ్యక్షునితో పలుమార్లు వివాదానికి దిగి 'సస్పెన్షన్'ను కొని తెచ్చుకున్నారు. డెరెక్ ఒబ్రెయిన్ ప్రవర్తన విషయంలో చైర్మన్ పలుమార్లు హెచ్చరించినా ఆయనలో మార్పు రాలేదు. అందుకే ఆయనను సస్పెండ్ చేయవలసి వచ్చిందనే విషయం సభా కార్యక్రమాలను చూసిన ఎవరైనా అంగీకరిస్తారు. అయితే, రాహుల్ మొదలు రాఘవ చద్దా వరకు విపక్షాల సభ్యులు, నాయకులు ఎందుకు మర్యాద మరుస్తున్నారన్నది ఇప్పుడు భేతాళ ప్రశ్నగా మారింది.



డెరెక్ ఒబ్రెయిన్

వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్

# రాముని మెప్పించిన సులోచన



సులోచన ఆదిశేషుని కుమార్తె. ఇంద్రజిత్తు (మేఘనాథుడు) భార్య. మహాపతివ్రత. మామగారు రావణుడు మహాపరాక్రమవంతుడు. ఆయన కుమారుడు బలపరాక్రమాలలో తండ్రికి ఏమాత్రం తీసిపోనివాడని తెలిసి, ఆయనను వరించి వివాహ మాడుతుంది. దుష్టబుద్ధిలో కూడా భర్త, మామగారికి ఏ మాత్రం తీసిపోనివాడని తర్వాత తెలుస్తుందామెకు. అయినా, దుఃఖాన్ని బలవంతంగా దిగమింగుకుని భర్త దుర్మార్గాలను ఓపిగ్గా భరిస్తుంటుంది. అసలు సులోచనకు కష్టమంతా ఎక్కడ వచ్చిందంటే, ఆమె పరమ విష్ణుభక్తురాలు. భర్త, మామ విష్ణుద్వేషులు, శివభక్తులు. దాంతో తానిక విష్ణుపూజ చేసుకోవ డానికి వీలుండదని అర్థమైంది. 'శివాయ విష్ణు రూపాయ శివరూపాయ విష్ణవే శివస్య హృదయం విష్ణుర్విష్ణోశ్చ హృదయగ్ం శివః' అన్న శ్లోకాన్ని మననం చేసుకుని శివుడిలోనే కేశవుడిని చూస్తూ తన పూజలను ఇరువురికీ అందించడం ఆరంభిం చింది. అంతేకానీ, 'విష్ణువునే పూజిస్తాను, శివుడిని పూజించను' అనలేదు. 'ఆమె ఎంతటి సహనశీలి, ఇంకెంతటి అణకువ గలది' అనే విషయం అక్కడే తెలుస్తోంది .

సీతామహాసాధ్విని అపహరించడం ద్వారా మామగారు తనకు చేటు తెచ్చుకోవడమేగాక, తన సంతానానికి, బంధుమిత్రులకు కూడా చేటు తెచ్చి పెట్టాడని భావించేది. భర్త మేఘనాథుడు ఎంత బలశాలి అయినా, దేవతల అనుగ్రహానికి బదులు ఆగ్రహం ఉంటే వినాశనం తప్పదనీ ఆమెకు తెలుసు. అందుకే నిత్యం భర్త, మామగార్ల క్షేమం కోసం అమ్మవారిని ఆరాధిస్తుండేది సులోచన.

పద్నాలుగేళ్లపాటు తిండి, నిద్ర లేకుండా, భార్య ఉండీ బ్రహ్మచర్యాన్ని పాటించే వ్యక్తి చేతిలో తప్ప మరెవరి చేతిలోనూ మరణం లేకుండా ఉండేలా బ్రహ్మదేవుడి నుంచి వరం పొందాడు ఇంద్రజిత్తు. అసలు అటువంటి వారు అవనిలోనే ఉండరన్న నమ్మకం, అతి విశ్వాసం అతనిది. కానీ, తానొకటి తలిస్తే దైవమొకటి తలచిందన్నట్టుగా, సరిగ్గా ఇంద్ర జిత్తును సంహరించడం కోసమే నా అన్నట్టు లక్ష్మణుడు ఆ లక్షణాలు కలిగి ఉన్నాడు. ఇంద్రజిత్తుకు బ్రహ్మ ఇచ్చిన వరం అలా భంగమైంది. లక్ష్మణుడి చేతిలో వీరమరణం పొందాడు.

ఆ సమాచారం తెలిసిన సులోచన అమిత దుఃఖంతో మూర్ఛపోయింది. కొంతసేపటికి తేరుకుని మామగారు రావణుని అంతఃపురానికి వెళ్లింది. "ప్రభూ! మరణించిన భర్తతో భార్య సహగమనం చేయడం పతివ్రతా ధర్మం కాబట్టి దయచేసి భటులను పంపి నా భర్త కళేబరాన్ని తెప్పించండి" అని వేడు కొంది.

కోడలు విన్నపానికి రావణుడు దుఃఖి స్తూనే. "అమ్మా! నేను వెళ్లి రణరంగం మధ్యలో పడి ఉన్న నా కుమారుడి దేహాన్ని ఇమ్మని అడిగితే వారిస్తారా తల్లీ! అది నాకు చేతనైన పని కాదు. నీకు తోచినట్లుగా చెయ్యి" అని తన నిస్సహాయతను వెల్లడించాడు.

"భర్తలేని భార్యలు బాహ్యకర్మలకై అగ్నితో వెడ లటం ధర్మమే. నా భర్త కళేబరాన్ని నేనే తెచ్చు కుంటాను. అనుమతించండి" అని మామగారికి

ఆధ్యాత్మికం

# ఔషధ గుణాలు మెండు వాక్కాయల్లో ఉండు

❋ 'మొక్క'బడి ❋

కొండ ప్రాంతాలలో మాత్రమే కనిపించే కొన్ని రకాల చెట్లల్లో వాక చెట్టు ఒకటి. ఈ చెట్లు చిట్టడువులలో, కొండ ప్రాంతాలలో సహజ సిద్ధంగా పెరుగుతాయి. వీటి కాయలు పుల్లని రుచిని కలిగి ఉంటాయికనుక వీటిని పచ్చళ్ళ, పులిహోర తయారీలో కూడా ఉపయోగిస్తారు. వీటిని కూర గాయలుగా, సుగంధ ద్రవ్యాలుగా కూడా ఉపయో గిస్తారు. వాక్కాయలు కేవలం వానా కాలంలో మాత్రమే లభిస్తాయి. ఈ పండ్లు ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. మూత్ర నాళాలను శుభ్రపరిచి మూత్రం సాఫీగా వచ్చేలా చేయ డంలో ఈ చెట్టు ఎంతగానో ఉపయోగపడు తుంది.

వాక్కాయ చెట్లను కొందరు రైతులు పంటగా కూడా సాగు చేస్తున్నారు. ఇవి పెరగ డానికి నీటి అవసరం అంతగా ఉండదు. ఎంతటి అనావృష్టి పరిస్థితులనైనా ఎదుర్కొని పెరుగుతాయి. ఈ చెట్లు ముళ్లను కలిగిఉంటాయి కనుక వీటిని పంట పొలాలకు కంచెలుగా కూడా పెంచుకుంటారు. ఈ పండ్లలోని గింజలను నాటడం వల్ల కొత్త మొక్కలు వస్తాయి. ఈ పండ్లు చూడడానికి కాన్ బెర్రీస్‌లా ఉంటాయి. కనుక వీటిని ఇండియన్ కాన్ బెర్రీస్ అని కూడా అంటారు. ఇవి పరిమాణంలో ద్రాక్ష పండ్ల లాగా ఉంటాయి.

వాక్కాయలు గుత్తులు గుత్తులుగా కాస్తాయి. పచ్చిగా ఉన్నప్పుడు ఆకుపచ్చరంగులో ఉండి. పండే కొద్దీ ముదురు ఎరుపు రంగులో, పూర్తిగా పండిన తరువాత నలుపు రంగులోకి మారతాయి. పండే కొద్దీ వగరు రుచి తగ్గుతూ పూర్తిగా పండిన తరువాత తీపి రుచి కలిగి తినడానికి వీలుగా ఉంటాయి. కాయలను చెట్టు నుంచి కోసేటప్పుడు వాటి నుండి పాలు కారుతాయి. పండ్లకు గనక పాలు అంటుకుంటే వాటిని కడిగిన తరువాతే తినాలి. ఈ పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చు.

వీటిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది.

దోర్బల పూర్ణిమాస్వాతి

నమస్కరించి, అనుమతి తీసుకుని యుద్ధరంగానికి వెళ్లింది. ఆమె రథం యుద్ధభూమిలో అడుగుపెడు తుండగా దూరం నుంచి ఆంజనేయుడు, అంగదుడు తదితర వానరవీరులు ఎంతో ఆశ్చర్యంతో చూస్తు న్నారు. ఇంతలో ఆమె తటాలున రథం దిగి, అడుగులు తడబడుతుండగా, అశ్రువులు జారు తుండగా, వంచిన తలతోనే రాముడికి నమస్కరించి నిలచింది.

వినయంతో తన ముందు నిలుచున్న ఆమెను చూసి రాముడు "అమ్మా! నీవెవరివి? నీ రాకకు కారణమేమిటి? నీ భర్త ఎవరు? నీ తండ్రి ఎవరు? నీకు మా నుంచి ఏమి కావాలి?" అని అడిగాడు.

"నా పేరు సులోచన. ఆదిశేషుడు నా తండ్రి. రావణసుతుడు మేఘనాథుడు నా భర్త. యుద్ధంలో లక్ష్మణుని చేతిలో వీరమరణం పొందాడు. మీరు దయతో నా భర్త కళేబరాన్ని ఇప్పిస్తే నేను ఆ దేహంతోపాటు సహగమనం చేస్తాను'' అని పలికింది.

అంతటి సౌశీల్యవతి, సౌందర్యవతి అయిన స్త్రీకి వైధవ్యం కలిగించినందుకు బాధపడుతూనే రాముడు ఎంతో దయతో అందుకు వెంటనే అనుమతించాడు.

సులోచన పతి కళేబరాన్ని తీసుకుని రావణ మందిరానికి వెళ్లి, దాన్ని ఉంచవలసిన స్థలంలో ఉంచి, పుత్రులను పిలిచి, "నాయనలారా! మీ ముద్దు ముచ్చట్లు చూసే భాగ్యం నాకు ఇక లేదు. మీరు తాతగారైన ఆదిశేషుని ఇంటికి వెళ్లి, అక్కడే నిర్భయంగా ఉండండి"అని చెప్పి, భర్త పార్థివదేహానికి స్నానాది వేదోక్త విధులను పూర్తి చేసి, భర్తతో సహ గమనం చేసింది. దేవలోకం నుంచి దివ్య విమానం వచ్చి ఆమెను సగౌరవంగా స్వర్గానికి తోడుకొని పోయింది.

ఆదిశేషుని కుమార్తె, ఇంద్రజిత్తు భార్య, రావణుడి కోడలూ అయిన సులోచన భర్త పార్థివదేహాన్ని రణరంగం నుంచి తెప్పించడానికి రావణుడంతటి వాడు నిస్సహాయతను వ్యక్తం చేయగా, తానే రాముని దర్శించి, ఆ ధర్మమూర్తిని స్తుతించి, మెప్పించి తన ధర్మాన్ని నిర్వర్తించిన సులోచన గురించి గోన బుద్ధారెడ్డి తన 'రంగనాథ రామాయణం' అద్భుతంగా వర్ణించాడు.

మరో కథనం ప్రకారం ఆదిశేషువును ఇంద్రజిత్తు ఎంతో ఘోరంగా అవమానించి సంహరిస్తాడు. అందుకు ప్రతీకారం తీర్చుకోవడం కోసమే ఆది శేషువు లక్ష్మణుడిగా జన్మించి, తగిన అవకాశం కోసం ఎదురు చూసి, అతడిని సంహరించి పగ తీర్చుకున్నా డన్నమాట.

సాక్షాత్తూ అఖండ సంపదలకు అధిపతి అయిన ఆదిశేషువు కుమార్తె అయినప్పటికీ, వలచి వచ్చిన వాడిని వివాహం చేసుకున్న తర్వాత తన చావో బతుకో అతనితోనే అనుకుంది. భర్త అడుగుజాడల్లోనే నడుచుకుంది. భర్త ప్రాణాలతో ఉంటే చాలనుకుంది. ఆతని ఆయుష్షుకోసం పూజలెన్నో చేసింది. వ్రతాలు, నోములు నోచింది. ఆఖరికి మామగారు చేసిన పని మూలంగా తన పతి ప్రాణాలు పోగొట్టుకున్నాడని తెలిసినా, ఎవరినీ పల్లెత్తుమాట అనలేదు. అన్నింటినీ మౌనంగా భరించింది. సహనంతో స్వీకరించింది.

ఒంటరిగా అంతఃపురం దాటి ఎరుగని ఆమె భర్త కళేబరం కోసం తానుగా శత్రువుల శిబిరం వైపుగా రథంపై వెళ్లింది. తన మాటలతో రాముడిని మెప్పించింది. లక్ష్మణుడితో కంట తడి పెట్టించింది. అంతటి సౌశీల్యవతి సులోచన రామాయణ మహా కావ్యంలో చిరస్మరణీయమైన పాత్ర. ★

వీటిని తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరిగి రోగాల బారినపడకుండా ఉంటారు. మధుమేహం తగ్గుతుంది. వీటిని తినడం వల్ల ఇన్‌ఫెక్షన్‌ల బారిన పడకుండా ఉంటామని, ఈ పండ్ల రసాన్ని తాగడం వల్ల గుండె సంబంధిత సమస్యలు తక్కువగా వస్తాయని నిపుణులు చెబుతున్నారు. రక్త ప్రసరణ సాఫీగా సాగేలా చేయ డంతో పాటు గుండెను, మెదడును ఆరోగ్యంగా ఉంచడంలోనూ ఈ పండ్లు ఎంతగానో ఉప యోగ పడతాయి. ఈ పండ్లను జామ్, జెల్లి వంటి వాటి తయారీలో కూడా ఉపయోగిస్తారు. ★



❊ తాత్విక 'కత' ❊

# నైవేద్యం కాదు నిశ్చల భక్తి ప్రధానం

పూర్వం ఒక గ్రామంలో విష్ణు భక్తుడు ఉండేవాడు. ఎంత పేదరికంలో ఉన్నా భగ వంతుడిపై అపారమైన నమ్మకం కలిగి, నిరంతరం హరి నామస్మరణ చేస్తూ ధార్మిక జీవనం సాగించే వాడు. మహా విష్ణువు అతడి భక్తికి మెచ్చి ఒకనాడు ప్రత్యక్షమయ్యాడు. స్వామి దివ్యమంగళ స్వరూపం చూసి తన్మయంతో స్తోత్రాలు చేశాడు భక్తుడు. స్వామికి ఏదైనా నివేదించాలని అనుకున్నాడు. ఇల్లంతా వెతకగా.. ఒక అరటి పండు కనిపించింది. దానిని స్వామికి నివేదించాడు. అరటిపండు ఒలిచి పండు పడవేసి భక్తి పారవశ్యంలో.. తొక్కను స్వామి నోటికి అందించాడు. భక్త వత్సలుడైన విష్ణుమూర్తి తొక్కను స్వీకరించి అంతర్ధానమయ్యాడు. తర్వాత తన తప్పును తెలుసుకుని ఎంతో చింతించాడు.

స్వామి పట్ల అపరాధం చేశానని కుమిలి పోయాడు. మళ్లీ స్వామి తనకు ప్రత్యక్షమైనప్పుడు ఇలాంటి తప్పు జరకుండా చూసుకోవాలని నిశ్చయించుకున్నాడు. కష్టపడి పని చేయడం మొదలుపెట్టాడు. డబ్బులు సంపాదించి ప్రతి రోజూ ఒక డజను అరటిపళ్లు స్వామి విగ్రహానికి నివేదిస్తూ వచ్చాడు. ఎన్ని రోజులైనా విష్ణుమూర్తి ప్రత్యక్షం కాలేదు. బాధతో.. 'తండ్రీ.. అపరాధి అయిన ఈ భక్తుడిని కరుణించి దర్శనం ఇవ్వమ'ని వేడుకున్నాడు. విష్ణుమూర్తి మళ్లీ ప్రత్యక్షమయ్యాడు. సంతోషంతో స్వామికి అరటి పళ్లు నివేదించాడు. గతంలో చేసిన పొరపాటు గుర్తు తెచ్చుకుని తొక్క పడవేసి పండు స్వామికి అందించాడు. కానీ, విష్ణుమూర్తి పండు తినడానికి ఇష్టపడలేదు. ఎంత బ్రతిమాలినా ఫలితం లేదు. భక్తుడు ఆవేదనతో.. 'నా భక్తిలో ఏదైనా లోపం ఉందా స్వామి.. గతంలో తొక్క పెట్టినా తిన్నారు కదా.. ఇప్పుడు ఇలా ఏమీ స్వీకరించటం లేదు..' అని ప్రశ్నించాడు.

విష్ణుమూర్తి చిన్నగా నవ్వి.. 'నాయనా.. ఇంతకు ముందు వచ్చినప్పుడు నీ మనస్సు నాపై లగ్నంచేసి తొక్క నివేదించినా స్వీకరించాను. ఇప్పుడు నీ మనసు అరటి పండుపై లగ్నమై ఉంది. వస్తువు మంచిదైనా.. భక్తి రసహీనం కావడం వల్ల అది విషతుల్యంగా మారింది. అందుకే పండు స్వీకరించలేక పోతున్నాను' అని సమాధానమిచ్చాడు. స్వామి మాటలకు భక్తుడికి జ్ఞానోదయం అయింది. ★

"ఇవన్నీ నేను మాట్లాడాలనుకోలేదు. పుట్టిన రోజు శుభాకాంక్షలు మాత్రం చెప్పాలనుకున్నాను. అమ్మ ప్రసక్తి తీసుకువచ్చావు. అందుకని ఇంతసేపు మాట్లాడాను. మనుషులు ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకుంటే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయి అమ్మమ్మా...! నీకు చెప్పే వయసు కాదు నాది".

"అయినా చెబుతున్నావు కదా!"

"ఎవరో ఒకరు మాట్లాడాలి అమ్మమ్మా".

"ఎలా చదువుతున్నావు?"

"ఇప్పటిదాకా శారీరకంగా, వంశపారంపర్యంగా వస్తున్న వ్యాధుల గురించి తెలుసుకుంటున్నాను. ఇప్పుడిప్పుడు నాకు అర్థం అవుతోంది. నేను పరిశోధించాల్సింది మానసిక వ్యాధుల గురించి అని. ఆ ప్రయత్నంలో ఉన్నాను".

తులసి మాట్లాడలేదు.

"ఇవన్నీ మరిచిపో అమ్మమ్మా... బీ హాపీ"

"నాకు నిన్ను చూడాలని ఉంది" అంది మెల్లగా.

"నేనే ఎప్పుడో వస్తాను".

"ఇంకెప్పుడు పెళ్లి చేసుకుంటావు?"

"నన్ను అర్థం చేసుకునే మనిషి దొరికినప్పుడు. ఎప్పుడూ అహానికి లోనుకాని మనిషి కావాలి. నన్ను గాఢంగా ప్రేమించకపోయినా ఫర్వాలేదు. నాతో భిన్నాభిప్రాయం కలిగితే నాకు చెప్పాలి. మేం ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకోగలగాలి. సమస్యలు పరిష్కరించుకోవాలి. అంతకు మించిన సంపదలు నాకు అవసరం లేదు అమ్మమ్మా...."

దిగ్భ్రాంతితో వింటోంది.

"మేం నిరంతరం పేషెంట్ల మధ్య వుంటాం. మా దగ్గరకు మల్టీ మిలియనీర్స్ వస్తారు. గొప్పగొప్ప కళాకారులు వస్తారు. అప్పుడు వారితో మాట్లాడటానికి మనుషులుండరు. ఐ.సి.యు. బయట ఆస్తుల గురించి, వారసత్వాల గురించి మంతనాలు జరుగుతుంటాయి. ప్రతి పేషెంట్ వెనక ఓ కథ ఉంటుంది అమ్మమ్మా... కొంతవరకే మాకు చెప్పగలరు. వీటి మధ్య నాలాంటి వారికి జీవితం ఏమిటి అన్న ప్రశ్నలు వస్తుంటాయి. ఇవన్నీ మెదడు కల్పించే అనేక భావనలు. మెదడు ఇన్ని ఆవేశాలకు, అహంకారాలకు ఎందుకు లోనవుతుందో అని పరిశోధన చేయాలనుంది".

"నీ మాటలు నాకు అర్థం కావటం లేదు. నిజంగానే" అంది తులసి.

"డబ్బుకి, అధికారానికి, కుట్రలకి మనసు అతీతంగా వుండాలి. మనం చేసే అన్ని పనులకి మెదడు...చిన్న మెదడు కారణం అని తెలుస్తున్నప్పుడు మాత్రం నేను ఆశ్చర్యపోతుంటాను. మనం కొన్ని నమ్ముతాం. బ్రహ్మ అన్నీ మన నుదుట రాసి భూమ్మీదకి పంపిస్తాడు అని. ఇదంతా ముందే రాసి ఉంటే మనం నిమిత్త మాత్రులం కాదా! ఇందులో మన పొరపాట్లు ఉండవు. మారాల్సింది ఉండదు కదా!"

నిశ్శబ్దం.

"ఇంక మాట్లాడను. నాకు తాతయ్య గుర్తుకు వస్తున్నాడు" అని ఫోన్ కట్ చేసింది. తులసి ఫోన్‌ని అలా చూస్తుండిపోయింది.

* * *

ఆమె వేదిక మీదకు వచ్చింది.

అప్పటికే కొంతమంది గుసగుసలాడుకోవటాన్ని ఆద్య గమనించింది.

"ఇప్పుడు నేను ఫ్యామిలీ గురించి మాట్లాడాలనుకుంటున్నాను. యస్. ఈ ప్రపంచంలో చాలా సమస్యలు వున్నాయి. వాటన్నిటి గురించి ఇప్పటిదాకా అనేక మంది మాట్లాడారు. పేపర్స్ సబ్మిట్ చేసారు. వాటి మీద ఇక్కడకు వచ్చిన వాళ్లందరం మన స్వంత ఇళ్లకు చేరాక ఆలోచిస్తాం. చర్చిస్తాం.

మీ అందరికీ తెలుసు. ఇంగ్లీష్‌లో 'హౌస్'కి 'హోమ్'కి మధ్య తేడా వుంది. మనలో చాలా మందికి 'హౌస్'లు వున్నాయి. హోమ్స్ లేవు. ఇప్పుడు మిగతా పనులన్నీ వాయిదా వేసి ఓ ఫ్యామిలీని తిరిగి నిర్మించాలి అని మన పెద్దలు చాలామంది ఇంతకు ముందు హెచ్చరించారు. మనం అనేక విషయాలను వాయిదా వేస్తుంటాం. మనకున్న చిన్న అనుభవంతో ప్రపంచం గురించి వ్యాఖ్యానం చేస్తుంటాం. సమస్య లోతుల్లోకి వెళ్లటం ఉండదు".

"ఏదో ఒక ఆసరా లేని ఆడవారూ-మగవారు ఉండరు. అనాథలకు కూడా ఆశ్రమాల్లో, రోడ్లో వుంటాయి. మనం సెక్యూర్డ్ లైఫ్స్ అనుభవిస్తూ ప్రీచ్ చేస్తుంటాం. నేను ఇక్కడున్న ఫ్రెండ్స్‌ని అడుగుతున్నాను. మీకు మీ ఫ్యామిలీస్‌లో సమస్యలు లేవా? మీ పిల్లలతో లేవా? మీ పొరుగువారితో లేవా?" అని ఆగింది.

గుసగుసల నుండి ఒక్కసారిగా నిశ్శబ్దం.

"నాకున్నాయి. అందుకే నాకు ఫ్యామిలీ విలువ తెలుసు. నేను కుటుంబం అనే వేదిక మీద మాట్లాడుతున్నాను. అది బలహీనంగా ఉందని తెలుసు. నేను నా ఇంటి జీవితాన్ని, సమస్యల్ని, అక్కడి ఘర్షణని వదిలేసి, ముఖం మీద చిరునవ్వుని పులుముకుని మీ ముందు నిలబడలేదు. నేను ఇంకేమాత్రం రెండు రకాల బతుకుని బతకదలుచుకోలేదు.

ఇంతకు ముందు నేను ఎక్కువ ప్రీచ్ చేసాను. ఐడెంటీ కోసం తాపత్రయ పడ్డాను. విదేశాలు వెళ్లటానికి, అవార్డులకీ లాబీయింగ్ చేసాను. వెనక్కి తిరిగి చూసుకుంటే నాకు-నా కుటుంబానికి మధ్య వైరుధ్యం కనిపించింది. ఇక్కడున్న అందరం క్రియేటివ్ పీపుల్. మన సమస్యలను అర్థం చేసుకోవటానికి సిద్ధాంతాలు అవసరం లేదు. మనం ఎందుకిలా తయారయ్యాం అనేది తెలుసుకోవటానికి మాత్రం అవన్నీ అవసరం. దౌర్జన్యం-హేళన-స్వార్థం-జెలసీ - ఇగో ఇవన్నీ- కుటుంబం నుండి మొదలు అవుతున్నాయి. ఒకప్పుడు అక్కడ త్యాగం ఉంది. సో... ది నీడ్ ఆఫ్ ది అవర్ ఈజ్ విహేవ్ టు బిల్డ్ ఎ ఫ్యామిలీ" అని దిగి వస్తుంటే ఎవరో నవ్వారు.

అక్కడికి వెళ్లి "థ్యాంక్స్ ఫర్ యువర్ లాఫ్" అందామె.

అప్పుడు చప్పట్లు హోరుతో ఆ ప్రదేశం దద్ద



ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

15




రిల్లింది. ఆద్య చప్పట్లు కొడుతూనే వుంది.

* * *

జూలీ, ఆద్య తిరుగు ప్రయాణంలో ఉన్నారు.

ఆద్యను జూలీ గమనిస్తూనే ఉంది. ఆద్య ముఖంలో సంతోషం... ఇక్కడికి వచ్చాక మొదటి సారిగా అంత ఆనందం చూస్తోంది.

"నీ సంతోషాన్ని నీ ముఖంలో చూస్తున్నాను" అంది జూలీ.

"నాలాంటి వారు ఇంకొంతమంది ఉన్నారు అనుకున్నప్పుడు కలిగిన ఆనందం అది".

అప్పుడు ఆద్య ఫోన్ రింగ్ అయింది.

"ఎలా వున్నావు శ్వేతా?" అంది ఆనందంగా.

"నీ కోసం ఎన్నిసార్లు ప్రయత్నం చేసానో... ఎందుకు ఫోన్ కట్టేసావు?"

"నేను జైపూర్ లిటరరీ ఫెస్ట్‌కి వచ్చి తిరిగి వెళ్తున్నాను".

"రియల్లీ... మంచి పని చేసావు. అక్కడ నుంచి కొత్త అనుభవాన్ని తెచ్చు కుంటున్నావా?"

"ఖచ్చితంగా".

"నేను కూడా వస్తే బాగుండేది".

"నిజంగానే... అందులోనూ నీకు ఇలాంటివి అవసరం. నేను ఇంటికి వెళ్లాక అన్నీ వివరంగా చెబుతాను".

"బుక్స్ కొన్నావా?"

"కొన్నాను. అవన్నీ నీకు మెయిల్ చేస్తాను. నేను ఈ మధ్య ఓ పుస్తకం చదువుతున్నాను. అది పూర్తి అయ్యాక నీకు పంపిస్తాను".

"అది ఏ విషయం మీద రాసింది?"

"జర్నీ... ది జర్నీ ఆఫ్ ఎ గ్రాండ్ ఫాదర్... విత్..." అని ఆగి చెప్పింది.

"ఇద్దరు మనవరాళ్లతో ఓ తాతగారి ప్రయాణం".

"తెలుగు పుస్తకమా!"

"అవును. నువ్వు చదివి తీరాలి" అంది.

"అలాగే... మనం మళ్లీ మాట్లాడుకుందాం".

"ఎవరీ శ్వేత?"

"మై కజిన్. నాకు అక్క. మా పెద్దమ్మగారి అమ్మాయి".

"జాబ్ చేస్తోందా?"

"ఐ.ఏ.ఎస్.కి ప్రిపేర్ అవుతోంది"

జూలీ పాటలు వినటం మొదలు పెట్టింది.

ఆద్య ఆలోచిస్తోంది. ఇంటి దగ్గర ఓ మహా



పి. చంద్రశేఖర ఆజాద్
9246573575



యుద్ధం జరగనుందని తెలుసు. శ్వేతకి జైపూర్ ప్రయాణం గురించి తెలిసి ఉండలేదంటే బహుశా పెద్దమ్మకి కూడా అమ్మ చెప్పి ఉండదు అనుకుంది.

* * *

తులసి గదిలో వుంది. రసజ్ఞ మాట్లాడిన దగ్గర్నుండి ఆమెలో ఓ కదలిక మొదలయింది. అది ఆమెను ప్రశాంతంగా కూర్చోనీయటం లేదు. తన జీవితం ఆమె ముందు కనిపిస్తోంది. ఒకప్పటి ఆనందాలన్నీ గుర్తు వస్తున్నాయి. ఎవరో మంత్రం వేసినట్లు ఆ రోజులన్నీ కరిగిపోయాయి.

ఎంతకాలం తను బతికి ఉంటుందో తెలియదు.

"ఇది జీవితమేనా?" అని చాలా రోజుల తర్వాత అనుకుంది. సరయూ గుర్తొచ్చింది. అంతలో రసజ్ఞ పక్కన నిలబడినట్లు అనిపించింది. నన్ను అర్థం చేసుకునే మనిషికి మించి సంపదలు అవసరం లేదు అంటోంది ఓ మనవరాలు.

ఫ్యాక్టరీలో సరుకులు తయారయినట్లుగా డిజైనర్ బేబీని తయారు చేయిస్తాను. అది ఇంకెవరో కని నాకు ఇస్తారు. డబ్బులు పారేస్తే ఏదయినా కొనుక్కోవచ్చు అంటోంది సరయూ...

ఇప్పటికే వసుంధర-భువనేశ్వరి మధ్య ఓ యుద్ధం జరుగుతోంది. రేపటి నుండి సరయూ-రసజ్ఞల మధ్య అది కొనసాగుతుందా?

ఇందులో తన పాత్ర ఏమిటి?

ఇప్పటివరకు నేను నా దృష్టి నుండి ఆలోచిస్తున్నానా? ఇంకొకరిని అర్థం చేసుకునేంత పని ఎందుకు చేయలేదు!

రసజ్ఞ 'నాకు తాతయ్య గుర్తొస్తున్నాడు' అంది.

"అంటే...మాఅమ్మ నీకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదన్నావు. ఎప్పుడయినా నీకు తాత గుర్తు వచ్చాడా? అనేగా అడిగింది. ఇన్ని సంవత్సరాల మీ ఇద్దరి ప్రయాణాన్ని ఎలా మరిచిపోయావు. అంత ద్వేషం మీకు ఎందుకు? ఇంత దూరం మీకు ఎందుకు పెరిగింది? మీ ఇద్దరూ కలిసి బతికినప్పుడు ఒక్క మంచి జ్ఞాపకం అయినా మిగల్లేదా?"

రసజ్ఞ మాటల్లో ఎన్ని ప్రశ్నలున్నాయి.

ఓ కుటుంబాన్ని నిర్మించింది ఇద్దరే... దాన్ని విచ్ఛిన్నం చేసింది కూడా ఇద్దరే. ఇది పరిష్కరించుకోలేనంత శాశ్వత్వమా అంటోంది. చిన్న మనవరాలు సరయూ ఎప్పుడూ తాత గురించి మాట్లాడదు. తన మనసులో ఏముందో తెలియదు. ఏదో ఒక రోజు సరయూ కూడా ప్రశ్నలు అడగటం మొదలు అవుతుంది.

అందరూ మనసుల్లో భావాలు దాచుకుని బతుకుతున్న వారే. సమయం కోసం చూస్తుంటారా?

అలాంటి సమయం తుఫానులా దూసుకు వస్తోందా?

తులసి విలవిలలాడుతోంది. ఇంతకు ముందు కూడా ఇలాంటి ఘర్షణ జరిగింది. అప్పుడు ఇన్ని సంవత్సరాల బంధాన్ని కాదు అనుకుని వసుంధర దగ్గరికి వచ్చింది. ఇన్ని రోజులూ ఆ ఆవేశంతో బతికింది. ఆ కోపాన్ని సజీవం చేసుకుంది. అదే తనని నడిపిస్తోంది.

ఇంకా అలానే ఆ పంతాలతోనే బతుకుకొనసాగించాలా? నాకేనా ఈ ఆలోచనలు. ఆయనకు రావా? తను పలకరించకూడదా? ఇది మగవాడి తత్వం కాదా?

తులసిలోని మరో మనిషి నిద్ర లేచింది.

"అమ్మా... అంత డిస్టర్బ్‌గా ఉన్నావేంటి" అని వసుంధర అడుగుతుంటే ఆలోచనలు తెగిపోయాయి.

"ఏం లేదు వసూ..."

"మనం డిన్నర్‌కి బయటకు వెళ్తున్నాం. నువ్వు తయారవ్వమ్మా".

"నాకు బయటకి రావాలని లేదు వసూ..."

"నిన్ను గమనించాకే డిన్నర్ అనుకున్నాం. ఈ మధ్య కాలంలో నువ్వు ఇంటి నుంచి బయటకు కదలటం లేదు. రిలాక్స్‌గా వుంటుంది".

"ఇంకో రోజు వెళ్దాం. ఈ రోజుకి నన్ను వదిలేయ్ వసూ" అంది తులసి.

కొద్ది క్షణాలు చూసి వసుంధర "నీ ఇష్టం అమ్మా" అని ఆమె గది నుండి వెళ్ళిపోయింది.

"వసుంధరకి కోపం వచ్చిందా?" అనుకుందామె.

వసుంధర జయమ్మ దగ్గరికి వెళ్లింది.

"అమ్మకి ఫోన్ వచ్చిందా ఈ మధ్య" క్యాజువల్‌గా అడిగింది.

"పుట్టినరోజు నాడు నువ్వు బిజీగా ఉన్నావు. అప్పుడు చిన్నమ్మాయి గారు చేసారు. అందుకని పెద్దమ్మగారికి ఫోన్ యిచ్చాను. ఎందుకమ్మా అడుగుతున్నారు?" అంది జయమ్మ.

"చిన్నమ్మాయి చేస్తే నన్నూ అడిగేది కదా. అమ్మయినా పిలిచేది. నేను బిజీగా ఉన్నాను. అమ్మ కూడా ఈ విషయం మరిచిపోయింది. అందుకని అడిగాన్లే పెద్ద విశేషం కాదు" అంది వసుంధర.

రమేష్ దగ్గరికి వెళ్లింది. అతను తయారవుతున్నాడు.

"అమ్మ డిన్నర్‌కి రానంటోంది రమేష్".

"అదేంటి?"

"రసజ్ఞ ఫోన్ చేసిందంట!"

"దానికీ డిన్నర్‌కీ సంబంధం ఏమిటి?"

"తను ఏం మాట్లాడిందో..."

నిలువుటద్దం ముందు నుండి వెనక్కి తిరిగాడు.

"నాకు భువన మీద అనుమానం. కూతురితో ఈ ఆట ఆడిస్తుందేమో అని"

"అత్తయ్యని ఫోన్‌లో ఏం మాట్లాడిందో అని అడగకపోయావా?"

"అది ఫోన్ చేసిందని అమ్మ చెప్పలేదు. నేను ఎందుకు అడగాలి?" అతనికి అర్థం అయింది.

"అయినా అమ్మమ్మా మనవరాలు ఏదో మాట్లాడుకుంటారు. మీ చెల్లి మీ అమ్మకి ఫోన్ చేయలేదు గదా. ఒకవేళ చేసినా మనం ఎందుకు కంగారు పడాలి" అన్నాడు.

"మీరు కొన్ని విషయాలను సీరియస్‌గా తీసుకోరు".

"సరే... మనం డిన్నర్ కి వెళ్దాం".

"నాకు డిన్నర్‌కి రావటం ఇష్టం లేదు రమేష్" అంది.

అతను అంతటితో ఆ విషయాన్ని వదిలేసాడు.

* * *

ఆద్య ఇంటిలోపలకి అడుగు పెట్టింది.

తన కోసమే ఎదురు చూస్తున్నట్లుగా అఖిల వుంది. అప్పుడే ఆదర్శ్ గది నుండి బయటకు వచ్చాడు. **(సశేషం)**

**'కార్టూన్ ఫోటీ - 2023'లో ప్రోత్సాహక బహుమతి పొందినది**





'సెక్యులరిజం' అన్న పదం పుట్టిన దేశంలో, అది ఏమిటో, ఎలా ఉంటుందో సోదాహరణంగా చూపారు బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్. భారత స్వాతంత్ర్య దినోత్సవం రోజున కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఆధ్యాత్మిక గురువు మొరారీ బాపూ రామాయణ పఠన కార్యక్రమానికి భారత సంతతికి చెందిన తొలి బ్రిటన్ ప్రధానిగా సునాక్ హాజరయ్యారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యపు పగ్గాలను భారత సంతతికి చెందిన ఒక వ్యక్తి చేపట్టడమే ఒక విశేషమైతే, ఆ వ్యక్తి భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించు కుని, హిందూ ధర్మానికి సంబంధించిన కార్యక్రమానికి హాజరుకావడం, తాను హిందువునని సగర్వంగా ప్రకటించుకోవడం మనకు అత్యంత హర్షణీయమైన విషయం. మనం ఎంతో నేర్చుకోవలసిన విషయం.

# 'నేను హిందువుని, శ్రీరాముడే ఆదర్శం'

రాముడు పుట్టిన దేశంలోనే రాజకీయ నాయకులు సరే, ప్రజా జీవితంలో ఉన్నవారు ఎవరైనా హిందూ మతాన్ని బహిరంగంగా సమర్ధించినా, జైశ్రీరామ్ వంటి నినదాలు చేసినా మతతత్త్వవాద ముద్ర వేయించుకుంటామనే భయంతో సెక్యులర్ ముసుగు వేసుకుని తిరుగుతుండడం మనకు రోజూ కనిపించే విషయం. భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ తన మత విశ్వాసాన్ని ప్రకటించుకోవడం పట్ల తీవ్రవిమర్శలను ఎదుర్కొనవలసి వచ్చింది, వస్తోంది కూడా. అయితే, క్రైస్తవ మెజారిటీ దేశానికి ప్రధానిగా ఉన్న ఒక వ్యక్తి తాను హిందువునని, తనకు శ్రీరాముడు ఆదర్శనీయమని చెప్పుకోవడం భారతీయులుగా మనం గర్వించవలసిన విషయం. ఇక్కడలా, అక్కడివారు ఆ మాటలు అన్నందుకు సునాక్‌ను విమర్శల వర్షంలో ముంచెత్తలేదు.

వాస్తవానికి సునాక్ బ్రిటన్ ప్రధానమంత్రి కాక ముందు నుంచే తన హిందూ మూలాలను, తన ఆచార సంప్రదాయాలను బహిరంగంగా పాటిస్తూ వచ్చారు. దీపావళికి ఇంటి ముందు దీపాలు వెలిగించడం నుంచి గో సేవ చేయడం వరకూ సునాక్ ప్రతి హిందూ సంప్రదాయాన్నీ, పండుగనూ పాటిస్తుంటారు. అయితే, ఈ విషయంలో ఆయన రెండు ముఖాలతో వ్యవహరించకుండా, తన ధర్మం పట్ల గౌరవాన్ని, ఆ ధర్మ విశిష్టతను సగర్వంగా ప్రదర్శిస్తుంటారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో జరిగిన రామకథ కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగించిన సునాక్ తన ఉపన్యాసాన్ని 'జై సియా రామ్' అన్న అభివాదం, పలకరింపుతో ప్రారంభించడం విశేషం. మర్యాదా పురుషుడు శ్రీరామచంద్రుడు జన్మించిన భూమిలో కూడా 'సెక్యులర్‌వాదులు' ఉచ్ఛరించడానికి సందేహించే 'జై శ్రీరామ్ లేదా సియా రామ్' అన్న మాటలను సునాక్ అలవోకగా, బహిరంగంగా పలకడం నుంచి మనం నేర్చుకోవలసినది ఎంతో ఉంది. అంతేనా? జీవితంలో సవాళ్లను సాహసంతో ఎదుర్కొనేందుకు, వినయపూర్వకంగా పాలించేందుకు, నిస్వార్థంగా పని చేసేందుకు తనకు శ్రీ రామచంద్రుడు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమైన వ్యక్తిగా నిలుస్తాడని సునాక్ చెప్పడం మన ఉదారవాదులకు 'బర్నాల్' రాసుకోవలసిన అవసరాన్ని కల్పించింది.

ఒక సాధారణ వ్యక్తిగా మన వద్దకు రుషిగారు వచ్చారు, మీకు స్వాగతం, ఆ ఆంజనేయుడి ఆశీస్సులు, మీపైన, బ్రిటిష్ ప్రజలపై ఉండుగాక అంటూ ఆధ్యాత్మిక గురువు మొరారీ బాపూ సునాక్‌కు ఆహ్వానం పలికారు. తాను ఇక్కడకు యునైటెడ్ కింగ్డమ్ ప్రధానమంత్రిగా రాలేదని, ఒక హిందువుగా గురువుగారి ఆశీస్సులు పొందేందుకు వచ్చానని రిషీ సునాక్ చెప్పారు. భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున కేంబ్రిడ్జి యూనివర్సిటీలో జరుగుతున్న మొరారీ బాపూ రామకథకు హాజరుకావడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. హిందూ ధర్మం పట్ల తనకు గల విశ్వాసం గురించి వివరిస్తూ, తన ధర్మం తనకు జీవితంలోని అన్ని అంశాలలోనూ మార్గదర్శనం చేయడమే కాక, బ్రిటన్ ప్రధాన మంత్రిగా ఉత్తమ స్థాయిలో పని చేసే ధైర్యాన్ని ఇస్తుందని సునాక్ అన్నారు.

తనకు మత విశ్వాసం అనేది చాలా వ్యక్తిగతమైన విషయమని, ఆ విశ్వాసమే జీవితంలోని ప్రతి విషయానికీ మార్గదర్శకంగా ఉంటుందని సునాక్ అన్నారు. బ్రిటన్ ప్రధానిగా ఉండటం గొప్ప గౌరవమే కానీ, అది అంత తేలికైన విషయం కాదని చెప్పారు. క్లిష్టమైన నిర్ణయాలు తీసుకోవలసి వస్తుందని, కఠినమైన ఎంపికలు ఎదురవుతాయని, ఇటువంటి సందర్భంలో దేశానికి తాను చేయగలిగినదంతా చేసేందుకు శక్తిని, స్థైర్యాన్ని మన ధర్మం ఇస్తుందని సునాక్ చెప్పారు. మొరారీ బాపూ రామకథ వేదికపై నేపథ్యంగా ఉంచిన హనుమంతుడి భారీ బంగారు చిత్రాన్ని చూపిస్తూ, 10 డౌనింగ్ స్ట్రీట్‌లో తన డెస్క్‌పై ఉల్లాసంగా కూర్చుని ఉండే బంగారు గణేశుడుని అది గుర్తు చేస్తోందని, తను పని చేసే బల్లపై కూడా విఘ్నాలు రాకుండా గణేశుడిని పెట్టుకున్న విషయాన్ని చెప్పకనే చెప్పారు. "ఏ అంశంలోనైనా చర్య తీసుకునే ముందు శ్రద్ధతో విషయాలను వినడం, ఆలో చించడం ఎంత ముఖ్యమో అది నాకు నిరంతరం జ్ఞాపకం చేస్తుంటుందని" ఆయన చెప్పారు.

సౌథాంప్టన్‌లో తన బాల్యపు రోజులను గుర్తు చేసుకుంటూ, కుటుంబంతో కలిసి తాము తరచుగా పొరుగున ఉండే ఆలయానికి ఎలా వెళ్లే వారో తెలిపారు. పెరుగుతున్న వయసులో సౌథాంప్టన్‌లోని స్థానిక మందిరానికి హాజరవడం గురించిన తీపి జ్ఞాపకాలు అనేకం ఉన్నాయని సునాక్ వాటిని గుర్తు చేసుకున్నారు. తన తల్లిదండ్రులు, కుటుంబం హవనాలు, పూజలు, హారతులను నిర్వహించే వారని, తర్వాత తను తన సోదరుడు, సోదరి, కజిన్స్‌తో కలిసి భోజనాన్ని, ప్రసాదాన్ని వడ్డించడంలో సాయం చేసేవాళ్లమని సునాక్ వివరించారు.

మన విలువలు – బాపూ నిత్యం తన జీవితంలో చేసే కార్యాలు, నిస్వార్ధ సేవ, భక్తి, ధర్మం పట్ల విశ్వాసం కలిగి ఉండటానికి సంబంధించిన విలువలని అన్నారు. కానీ, మనకు తెలిసిన అతి గొప్ప విలువ కర్తవ్యం లేదా సేవ అని నొక్కి చెప్పారు. తన కుటుంబ వలస చరిత్రను ప్రస్తావిస్తూ, ఇక్కడ కథ కోసం కూర్చున్న వందలమందిలో ఎంతమంది తల్లిదండ్రులు, తాతలు భారత్, తూర్పు ఆఫ్రికా నుంచి పెద్దగా డబ్బు లేకుండా వచ్చి, తమ తరానికి గొప్ప జీవితాన్ని, అవకాశాలను కల్పించేందుకు ఎంతో కష్టపడ్డారని సునాక్ చెప్పారు. బాపూ ఇవాళ చెప్పే 'రామాయణాన్ని' మాత్రమే కాక 'భగవద్గీత', 'హనుమాన్ చాలీసా'లను మననం చేసుకుంటూ తిరిగి వెడతానని సునాక్ అన్నారు. విదేశాలకు వెళ్లి డిగ్రీలు చదవగానే, మాతృభాషను, మాతృభూమిని, తన ఆచార వ్యవహారాలను, ధర్మ సంస్కారాలను మరిచిపోయే తరం ఉన్న కాలంలో విదేశాలలో పుట్టి పెరగడమే కాదు, మరొక మతానికి చెందిన ఆ దేశానికి నాయకత్వం వహిస్తూ తన ధర్మాన్ని నిలుపుకోవడం అన్నది సాధారణ విషయం కాదు. కానీ, బ్రిటన్ ప్రధానిగా ఉన్న రిషీ సునాక్ ఆ పని చేయడం అంత కష్టం కాదని నిరూపించారు. ★

# ధర్మ దీక్షా

**ప్రతి ఒక్కరూ తమ జీవన సమరంలో నిమగ్నమై సాగిపోతున్నపుడు ఆశయ విస్మరణ జరుగకుండా మన ధర్మ, సంస్కృతులకు ఆధారమైన విద్యను, విజ్ఞానాన్ని గుర్తుచేసేదే రక్షాబంధన్ ఉత్సవం. సంస్కృతి, సంప్రదాయాలకు నష్టం వాటిల్లినపుడు, మనందరం ఐక్యంగా దానికి రక్షకులమై నిలబడాలని గుర్తుచేస్తూ 'ధర్మరక్షణలోనే నా రక్షణ కూడా ఉంద'ని కర్తవ్య బోధ చేసేదే ఈ పండుగ.**

ఎవరైనా ధార్మిక క్రతువు చేస్తున్నప్పుడు తమ ముంజేతికి ఎర్రటి కంకణం కట్టుకోవడం సనాతన హిందూ ఆచారం. ఇది దీక్షాధారణ. ఈ ఎర్రటి కంకణాన్ని ధరించడం వలన ఆ వ్యక్తిలో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు అన్నిరకాల దుష్ప్ర భావాలు దరిచేరకుండా కాపాడుతుందని భావిస్తారు. ఈ కంకణ ధారణ ప్రాచీన కాలం నుంచీ ఉన్నట్లు పురాణాల కథనం. బలిచక్రవర్తికి చిరంజీవత్వాన్ని ప్రసాదిస్తూ వామనుడు ఈ పవిత్ర కంకణాన్ని (రక్షను) కట్టినట్లు ప్రతీతి. రక్షను ధరించిన వ్యక్తికి తన కర్తవ్యం పదే పదే గుర్తుకు వస్తుంది.

ఇంతటి ప్రాశస్త్యం కలిగిన రక్షాబంధన్ పండుగ మైత్రీ భావానికి గొప్ప ప్రతీక. పాశ్చాత్య దేశాల్లో సోదర భావనను ప్రబోధిస్తారు. అయితే మన దేశంలో ఇంకాస్త ముందుకెళ్లి అందరిలో ఒకే ఆత్మను దర్శించమని చెప్పారు మన పూర్వులు. భగవద్గీత కూడా 'నీ పక్కవాడిని కూడా నీ వలె చూసుకో **(ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యో౭ర్జున సుఖం వా యది వా దుఃఖ స యోగీ పరమో మతః॥, 6:32)** అని బోధించింది. సోదర భావంలోనైనా కించిత్ మాత్రం కలహాలు రావచ్చు. అందరిలో ఆత్మ ఒకటే అని గ్రహిస్తే ఈర్ష్యాద్వేషాలకు తావు లేదు. అలాంటి ఆత్మౌపమ్య స్థితిని ఈ పండుగ మనకు అలవాటు చేస్తున్నది. ఇదే ఈ పండుగ సందేశం.

వ్యక్తుల మధ్య అన్యోన్యభావం ఏర్పడినప్పుడు ఆ సమాజంలో ఐకమత్యం, సమష్టి భావన వెల్లివిరుస్తుంది. విదేశీ పాలన కింద నలిగిన మనం కాలక్రమంలో ఈ భావాన్ని మరిచాం. నేను, నీవు వేరు కాదు అనే భావన మరచి ఆ స్థానంలో నేను, నా సంపాదనే ముఖ్యమైంది. అందరితో కలిసి నేను ఎందుకుండాలి? అనే వ్యక్తివాదం పెరిగింది. ఇక అక్కడి నుండి మన సమాజంలో వికృతులు ఏర్పడి వాటి ఫలితాలను చవిచూడాల్సి వస్తున్నది. స్వాతంత్ర్యం లభించి 76 సంవత్సరాలు దాటినా దేశంలో అందరికీ ఒకే చట్టాన్ని (యూసీసీ) అమలు చేసుకోలేని దుస్థితి తయారైంది. మత విశ్వాసాల చుట్టూ తిరుగుతూ ఉండే సమస్యలను పరిష్కరించాలంటే రాజకీయ సంకల్పం ఉండాలి. అవసరమైతే పార్లమెంటులో చట్టాలు చేయాలి. రాజ్యాంగాన్ని సవరించాలి. అదీ కాకుంటే కోర్టులు ఇచ్చిన ఆదేశాలను శిరసావహించాలి. మొత్తానికి పరిష్కారమైతే చూడాలి. అదృష్టవశాత్తు ఇప్పుడు జరుగుతున్నది అదే. వందేళ్లకు పైగా న్యాయస్థానాలలోనే ఉండిపోయిన అయోధ్యలో వివాదాస్పద కట్టడం, స్థల వివాదం మీద నవంబర్ 9, 2019న సుప్రీంకోర్టు తన తుది తీర్పును ప్రకటించింది. తీర్పు తమ వైపు వచ్చిందన్న భావనను గాని, అందుకు సంబరాలు చేసుకోవడం గాని హిందువులు చేయలేదు. తమకు అయోధ్య పట్ల అత్యంత బలమైన మత విశ్వాసం ఉన్నప్పటికీ ఒక సివిల్ దావాలో గెలుపుగానే వారు భావించారు. జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని అదుపు చేయడం భారత్‌కు సాధ్యం కాదనుకునే పరిస్థితులు తలెత్తిన సమయంలో ఆగస్ట్ 5, 2019న కేంద్ర ప్రభుత్వం 370 అధికరణాన్ని రద్దు చేసింది. ఈ అధికరణమే రద్దయితే దేశం బూడిద అయిపో తుందని బెదిరించిన వారు కూడా ఉన్నారు. కానీ దాని రద్దుతో కశ్మీర్ శాంతించింది. ప్రజలు ఆనందించారు. టీవీ చర్చలలో ముల్లాలు, హిందూ ఉదారవాదులు చెప్పినట్టు అగ్నికీలలు ఎగిసిపడలేదు, సరికదా ముస్లిం మహిళలు మిఠాయిలు పంచుకుని హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. సాధారణ ముస్లిం దీనిని స్వాగతించాడని చెప్పడానికి రుజువు – ఆ అన్ని సందర్భాలలోను దేశం ప్రశాంతంగా ఉంది. ఇదే తరహాలో రాజ్యాంగానికి పునాది, సుప్రీంకోర్టు కూడా ఇదివరకే అమలు చేయాలని ఆదేశించిన ఉమ్మడి పౌరస్మృతిని కూడా అమలులోకి తీసుకు రావాలని భారత ప్రభుత్వం సంకల్పించింది.

డాక్టర్ అంబేద్కర్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, జస్టిస్ కృష్ణయ్యర్, వైవీ చంద్రచూడ్, జస్టిస్ చిన్నపరెడ్డి వంటి ఎందరో ఉమ్మడి పౌరస్మృతి తక్షణావసరమని నిర్ద్వంద్వంగా వెల్లడించారు. అయినా క్షమార్హం కానంత జాప్యం జరిగింది. ఇంకా జాప్యం చేయించే ప్రయత్నం నిరంతరాయంగా జరుగుతున్నది. బీజేపీ ఏం చేసినా మతం పేరుతో అడ్డుకోవాలన్న కుట్ర ఇందులోకి వచ్చి చేరింది. కానీ యూసీసీలో కేవలం మతాన్ని చూపించడం విజ్ఞత కాదు. పైగా ఉద్దండ న్యాయనిపుణులు చెప్పిన మాట – అది స్త్రీలకు న్యాయం చేస్తుందనే. దేశ సమైక్యతను బలోపేతం చేస్తుందనే. అందరికీ సమాన హక్కులు అన్న రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేదేననే. ఇది చరిత్రాత్మక సందర్భం. సుప్రీంకోర్టు ఆశయానికి గండి కొట్టకూడదు. ఇది ఇవాళ్టి మనందరి కర్తవ్యం కూడా.

ఒకే చట్టం పరిధిలో ఉండేలా సమాజ మనస్తత్వం రూపొందాలి. సమాన పౌరచట్టం గురించి చర్చించడం మొదలు పెట్టగానే కొందరిలో అసహనం మొదలవుతుంది. దీనిని హిందూ, ముస్లిం విభేదంగా చిత్రీకరిస్తారు. అందరికీ ఒకే చట్టాన్ని ఆమోదిస్తే అన్ని పరంపరల్లోనూ కొంతలో కొంత మార్పులు వస్తాయి. హిందువుల పరంపరల్లోనూ మార్పులు సంభవిస్తాయి. దీన్నంతటినీ దృష్టిలో పెట్టుకుని ఏదో ఒక చట్టం కోసం సమాజంలో మానసిక సంసిద్ధత తెచ్చేందుకు ప్రయత్నం జరగాలి. వాస్తవంగా దేశ ఏకాత్మతకు ఉమ్మడి పౌరచట్టం బలాన్నిస్తుంది, అది కూడా ఏకత్వం కోసమే. దానిని అమలు చేయడం ద్వారా సమాజంలో మేము వేరే వర్గం అనే భావన బలం పుంజుకోలేదు. ఈ విషయాలను మన రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు ఏనాడో పేర్కొన్నాయి. దాన్ని ప్రభుత్వం ఆ దిశలో అమలు చేయాలి, చేస్తున్నది కూడా.

ఇక మణిపూర్ విషయానికి వస్తే.. మణిపూర్ వివాదంలో విదేశీ శక్తులు తల దూర్చాయన్నది స్పష్టమవుతోంది. కొందరు విదేశీ మిషనరీలు ఇక్కడికి వచ్చి సమస్యను మరింత పెంచడానికి ప్రయత్నించారు. కానీ ప్రభుత్వంవారి ప్రయత్నాలను తిప్పికొట్టింది. దాంతోవాళ్లు భారత్‌లో క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయంటూ ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం మొదలుపెట్టారు. కుకీ క్రైస్తవులపై మాత్రమే దాడులు జరుగుతున్న మాట వాస్తవమైతే మెయితీలకు చెందిన



# ధారణే రాఖీ



చర్చిలపై కుకీలు ఎందుకు దాడులు చేస్తు న్నారు? అలాగే మెయితీ క్రైస్తవులు కుకీ చర్చిలను తగుల బెట్టారు. దీనిని బట్టి ఇది రెండు తెగల మధ్య ఘర్షణే అని, హిందువులు,క్రైస్తవుల మధ్య గొడవ కాదని స్పష్టమవుతోంది కదా! వేర్పాటువాద సంస్థల జోక్యం ఇరువైపులా పెరిగిపోవడంతో ఘర్షణ పెరిగింది. సాధారణ ప్రజానీకం, ముఖ్యంగా మణిపూర్ ప్రజలు, శాంతియుతంగానే జీవిస్తారు. వేర్పాటువాద సంస్థలు, కొన్ని విదేశీ శక్తుల జోక్యం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. చైనా వంటి దేశాల హస్తం కూడా ఇందులో ఉందని వార్తలు వస్తూనే ఉన్నాయి.

ఈ గొడవలకూ, ఆర్ఎస్ఎస్‌కు సంబంధం లేదని క్రైస్తవ కుకీ నాయకులు కూడా వివిధ ఇంటర్వ్యూలలో స్పష్టం చేశారు. కరణ్ థాపర్ వంటి జర్నలిస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో కుకీ నాయకులు ఈ విషయం చెప్పారు. ఇది రెండు తెగల మధ్య గొడవ అని, దీనికి ఆర్ఎస్ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదని అటు కుకీలు, ఇటు మెయితీలు కూడా చెబుతున్నారు. అయితే కొందరు పనిగట్టుకొని మీడియాలో అలాంటి ప్రచారం చేస్తున్నారు. కానీ స్థానికులలో ఎవరూ ఈ ఆరోపణ చేయడం లేదు. పైగా ఆ రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల పట్ల కుకీలతో పాటు మెయితీలు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మణిపూర్‌లో ఉద్రిక్తతలను శాంతపరచడానికి ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలైన వనవాసీ కల్యాణ పరిషత్, సేవాభారతి వంటివి అనేక చోట్ల శరణార్థ శిబిరాలను నిర్వహిస్తు న్నాయి. 270 సహాయ కేంద్రాల్లో మొత్తం 70 వేల మంది తల దాచుకుంటున్నారు. అంతేకాదు, ఈ సంస్థల ప్రతినిధులు శాంతియుతంగా సమస్య లను పరిష్కరించుకోవాలని ఇరు వర్గాలకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

**ఆర్ఎస్ఎస్ గత 98 సంవత్సరాలుగా సమాజంలో మనమందరం ఒకటే అనే ఆత్మీయ భావనతో పనిచేస్తున్నది. ఈ కారణంగా విదేశీ పాలన ద్వారా మన సమాజంలో ఏర్పడిన వికృతులను క్రమేపీ ఒక్కొక్క దానినీ తొలగించుకుంటూ హిందూ సమాజ ఉన్నతితో పాటు ప్రపంచ శాంతికి బాటలు వేసే దిశగా సంస్థ ప్రయాణం సాగుతున్నది.**



యూసీసీ, మణిపూర్ వంటి సమస్యలే కాదు. దేశంలో ఇంకా ఇలాంటివి ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఇవి ఒకరోజు ఉద్యమం చేస్తేనో, ఘర్షణ లకు దిగితేనో పరిష్కారం కావు. ప్రజలలో ఒకరి పట్ల మరొకరికి ఆత్మీయతా అనురాగాలను పెంచి తద్వారా సమస్యలకు పరిష్కారం గురించి అవగాహన కల్పించి వాటిని దూరం చేయవచ్చు.

**హిందూ సమాజ ఉన్నతికి ఆర్ఎస్ఎస్ బాటలు**

ఆర్ఎస్ఎస్ గత 98 సంవత్సరాలుగా సమాజంలో మనమందరం ఒకటే అనే ఆత్మీయ భావన (ఆత్మవత్ సర్వభూతేషు)తో పనిచేస్తున్నది. ఈ కారణంగా విదేశీ పాలన ద్వారా మన సమాజంలో ఏర్పడిన వికృతులను క్రమేపీ ఒక్కొక్క దానినీ తొలగించుకుంటూ హిందూ సమాజ ఉన్నతితో పాటు ప్రపంచశాంతికి బాటలు వేసే దిశగా సంస్థ ప్రయాణంసాగుతున్నది. చంద్రగుప్త చాణక్యులు, మహారాణా ప్రతాప్, భామాషాప్‌లు, శివాజీ, రామ దాసు, హరిహర విద్యారణ్యులు వంటివారు హిందూ ధర్మరక్షణ కోసం, మన ధర్మాన్ని వికసింపజేయడం కోసం పడిన కష్టాలు, వారి పోరాటాలు మనలో ఎంతో చైతన్యాన్ని కలిగిస్తాయి. ఆర్ఎస్ఎస్ కూడా వారి బాటలోనే పయనిస్తోంది.

ఈ మహాపరంపరలో ఒక ఆత్మీయభావం ఏర్పడుతుంది. 'ఈ దేశం నాది,ఈ ధర్మం నాది, ఈ చరిత్ర నాది, ప్రజలంతా నా సోదరులు' అనే దివ్యానుభూతి కలుగుతుంది. దీని రక్షణ, పోషణ భారం, వికాస కార్యం నా పైనే ఉన్నాయనే భావన స్ఫురించి, మనల్ని కర్తవ్యోన్ముఖుల్ని చేస్తుంది. ఆ భావన స్ఫురించిననాడు ఈ మహాదీక్షలో కలిసి ప్రయాణం చేస్తున్న వాళ్లంతా నా వాళ్లు అనే భావన సహజంగా జనిస్తుంది. మనం ఒకటే. ఒకే అనుభూతులు గల సమూహం మనది. మన హృదయ స్పందన ఒకటే. మన ఐక్యతలోనే మన వికాసం ఉన్నదనే భావనే మనలో అమృతాన్నినింపి, మనం సమాజానికి సంజీవనిగా పని చేయగల శక్తినిస్తుంది. అదే భావనతో 'నీవు నాకు రక్ష, నీకు నేను రక్ష, మనం ఈ సమాజానికి, ధర్మానికీ రక్ష. ఈ సమాజం, ధర్మం మనకు రక్ష' అనే గొప్ప విషయాన్ని ఈ రాఖీ పూర్ణిమనాడు మననం చేసుకోవలసిన అవసరం ఉంది.

రాష్ట్రీయ స్వయంసేవక సంఘం రాఖీ పండుగను సమాజంలో సౌభ్రాత్ర భావనను, ఐక్యతను, ఏకీకృత శక్తిని తిరిగి పెంపొందించడానికి ఆచరింపచేస్తున్నది. ఈ పండుగ మనలో ఐక్యతను మరింత పెంపొందించాలని, సమాజాభివృద్ధికి బాటలు వేయాలని ఆశిద్దాం. ★

# సర్వ శుభప్రదం

**శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణం పేరిట ఏర్పడిన శ్రావణ మాసంలోని పౌర్ణమికి ఎన్నో విశిష్టతలు. 'వాగీశ్వరుడు' హయగ్రీవుడు అవతరించిన తిథి. వేదాధ్యాయనం ఆరంభించే రోజు. చేపట్టిన పనులలో విజయం సాధించాలని కంకణబద్ధులయ్యేది,**

## విజ్ఞానప్రదాత హయగ్రీవుడు

**'జ్ఞానానందమయం దేవం నిర్మల స్ఫటికాకృతిం**
**ఆధారం సర్వ విద్యానాం హయగ్రీవ ముపాస్మహే'**

విద్యారంభం శ్లోకం, 'సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ....' శ్లోకమంతటి ప్రాధాన్యం కలది. హయగ్రీవ అవతారం గురించి ఎన్నో గాథలు ఉన్నాయి. వేదోద్ధరణ కోసం శ్రీమహావిష్ణువు హయగ్రీవుడిగా అవతరించాడన్నది ప్రధాన పురాణ కథనం. ఆయన జ్ఞానానందయయుడు, వాగీశ్వరుడు కాగా సరస్వతీ వాగ్దేవి.

వైకుంఠనాథుని అన్ని అవతారాలలో హయగ్రీవ అవతారం మొట్టమొదటిదని, ఇది సృష్టికి ముందున్నది.. కాలానికి అందనిదిగా చెబుతారు. ఇది



జ్ఞానావతారం. నిర్మలమైన స్ఫటికం వంటి ఆకృతి కలవాడు. సర్వ విద్యలకు ఆధారభూతుడు. గుర్రపు తల, మానవదేహంతో నాలుగు భుజాలలో శంఖం, చక్రం, పుస్తకం, చిన్ముద్రలను కలిగి ఉంటాడు. సృష్టి కార్యానికి అవసరమైన జ్ఞాన ప్రదాతలైన వేదాల సంరక్షణలో శ్రీ మహావిష్ణువు జాగరూకులై ఉంటాడట. గుర్రం సకిలించే ధ్వనిని 'హేష' అంటారు. ఆ ధ్వనిని బీజాక్షరాలకు ప్రతీకగా చెబుతారు.

విధాత నుంచి వేదాలను అపహరించి సముద్రంలో దాగిన మధుకైటభులు అనే రాక్షసులను శ్రీహరి హయగ్రీవ స్వరూపంతో సంహరిస్తాడు. వేదోద్ధరణకు శ్రావణ పూర్ణిమ నాడు యజ్ఞగుండం నుంచి హయగ్రీవుడిగా ఆవిర్భవించారు. వేదాలను కాపాడిన స్వామి, బ్రహ్మకు వేదాధిపత్యాన్ని, సరస్వతికి సకల విద్యాధిపత్యాన్ని అప్పగించాడు. సరస్వతీమాత హయగ్రీవునికి విగ్రహ రూపం కల్పించి ఆరాధించిందని పురాణగాథ. ఆమె కాశ్మీరంలో రామానుజాచార్యులకు సాక్షాత్కరించి శ్రీలక్ష్మీ సమేత హయగ్రీవ మూర్తిని ప్రసాదించగా, అది రామానుజుల నుంచి వారి శిష్యులు పిళ్లైయాచార్యులు, వారి నుంచి వేదాంత దేశికులకు.. ఇలా గురుశిష్య క్రమంలో సంక్రమించింది. ఆ మూర్తి మైసూరులోని శ్రీ బ్రహ్మతంత్ర స్వతంత్ర పరకాల మఠంలో అర్చనలు అందుకుంటోంది. కలియుగంలో మానవ ఉద్ధరణకు ఉపాయం చెప్పాలని అగస్త్యముని విన్నవించగా, హయగ్రీవుడు రుషి రూపంలో కాంచీపురంలో ఆయనకు శ్రీలలితా రహస్య నామాలను, శ్రీవిద్యను ఉపదేశించారు.

పరాశక్తి గురించి తపస్సు చేసిన హయగ్రీవాసురుడు మరణం లేకుండా వరం కోరాడు. 'పుట్టుట గిట్టుట కొరకే...' అన్నట్లు మృత్యువు అనివార్యమైనప్పుడు అమరత్వం ఎలా సాధ్యమని జగన్మాత ప్రశ్నించిందట. దానికి సమాధానంగా 'తనలాంటి రూపం కలవారి చేతిలోనే మరణం ఉండేలా' వరం కోరాడని పురాణ గాథ. మానవ శరీరానికి గుర్రపు తల గల తనలాంటివాడు సృష్టిలో ఉండబోడనే విశ్వాసంతో, తనకెదురే లేదనే ధీమాతో పెచ్చరిల్లిపోయాడు. అంతులేని

## విశ్వప్రేమకు చిహ్నం 'రక్షాబంధన్'

ఒకప్పుడు దుష్టశక్తులను పారదోలడానికి, చేపట్టిన కార్యాలు విజయవంతంగా ముగించి డానికి ఉద్దేశించిన 'రక్షాబంధన్' అనంతర కాలంలో సోదరసోదరీ ప్రేమకు ప్రతీకగా మారింది. ఈ పండుగ కుటుంబ విలువలను, మానవ సంబంధాలను పరిపుష్టం చేస్తుంది. భవిష్యోత్తర, విష్ణు, కూర్మ పురాణాలు రక్షాబంధన్ గురించి చెబుతున్నాయి. యుద్ధవీరులకు పట్టుదల, ఆత్మ స్థయిర్యం కలిగేందుకు రక్ష కట్టేవారు. కాలక్రమంలో ప్రబలిన పాలకుల దుర్నీతి, అరాచకాల బారిన పడుతున్న మహిళల రక్షణ కోసం రక్షాబంధన్ (రాఖీ) సంప్రదాయం వచ్చిందని చెబుతారు. పురాణ చారిత్రక ఆధారాలను పరిశీలిస్తే.. దానవులతో జరిగిన యుద్ధంలో ఓడిన ఇంద్రుడికి ఆయన పత్ని శచీదేవి, ముంజేతికి రక్ష కట్టి ప్రోత్సహించడంతో విజయం సాధించాడట. ధ్రువుడు తపస్సుకు వెళుతున్నప్పుడు తల్లి సునీతి (సూనృత), కుమారుడు భరతుడికి శత్రుభయం ఉండకూడదని శకుంతల, బలిచక్రవర్తి సర్వస్వాన్ని వామనుడికి ధారపోసినప్పుడు ఆయన భార్య వింధ్యావళి, సోదరుల విజయాన్ని కాంక్షిస్తూ ధర్మరాజు రక్ష కట్టారని గాథలు. బలి చక్రవర్తి కోరిక మేరకు శ్రీహరి ఆయన రాజ్యానికి రక్షకుడిగా ఉండగా పతిని (హరి) వైకుంఠానికి రప్పించుకోవాలనే ప్రయత్నంలో లక్ష్మీదేవి బ్రాహ్మణ స్త్రీ రూపంలో బలి వద్ద ఆశ్రయం పొంది శ్రావణ పూర్ణిమనాడు ఆతనికి రక్ష కట్టి తన గురించి వెల్లడిస్తుంది. ఆమె మంచితనానికి, తెలివికి సంతసించిన దానవేంద్రుడు, విష్ణువును వైకుంఠానికి వెళ్లవలసిందిగా వేడుకుంటాడు. ఇలా సోదర ప్రేమకు ఉదాహరణగా చెబుతారు. భారత స్వాతంత్ర్య సమర సమయంలో యోధులకు కట్టిన రాఖీని 'వీరకంకణం'గా భావించి



# శ్రావణ పున్నమి

సోదరసోదరీ ప్రేమకు ప్రతీకగా రక్షాబంధన్ వంటివి ఈ తిథి ప్రత్యేకతలలో కొన్ని. మరాఠీయులు, కన్నడిగులు ఈ రోజున సాగరపూజ చేసి కొబ్బరికాయలు సమర్పిస్తారు. దీనిని నారికేళ పౌర్ణమి, నార్లీ పూర్ణిమ అంటారు. పంటలు బాగా పండాలని కోరుతూ ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వాసులు కజరీ (గోధుమ) పౌర్ణమిగా జరుపుకుంటారు. ఇలా మన సంస్కృతీ సంప్రదాయాల బలిమి, ఘనమైన వారసత్వ కలిమి శ్రావణ పౌర్ణమి.

ఆతని ఆగడాలకు భీతావహులైన బ్రహ్మాది దేవతలు, మునులు శ్రీమహా విష్ణువును శరణువేడగా, ఆయన శ్రావణ పూర్ణిమ నాడు హయవదనుడిగా ఉద్భవించి దానవ సంహారం చేశాడు. సృష్టి యజ్ఞంలో విరాడ్రూపు నుంచి అశ్వం మొదట ఉద్భవించింది. 'తస్మాదశ్వా అజాయంత' అని వేదం (పురుష సూక్తం)పేర్కొంటోంది.

హైదరాబాద్ శివారు మేడిపల్లి వద్ద హయగ్రీవుడు శ్రీలక్ష్మీ వేంకటేశ్వర సమేతంగా కొలువై ఉన్నాడు. మైసూరులోని పరకాల మఠం తరహాలోనే ఇక్కడి ఆలయంలోనూ హయగ్రీవ జయంతితో పాటు ప్రతి నెల స్వామివారి తిరునక్షత్రం (శ్రీనివాసుడి నక్షత్రమూ అదే) శ్రవణం నాడు అభిషేకం, హోమాది క్రతువులు నిర్వహిస్తారు. ఇతర పండుగలను ఘనంగా జరుపుతారు. ★



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

ఉద్యమించారు. ఛత్రపతి శివాజీ ఇదే రోజున తుల్జాభవానీ సమక్షంలో రక్షాబంధన్ ఉత్సవం నిర్వహించి, తాను ధర్మరక్షణకు పునరంకితమవుతున్నట్టు ప్రతిజ్ఞ చేసేవాడట. ఆ స్ఫూర్తితోనే మరాఠా ప్రాంతంలో నేటికీ ఈ రోజును 'ధర్మ దివస్'గా పాటిస్తారు.

రక్షకట్టే మహిళలు, కట్టించుకునేవారు ఏకోదరులు కాక పోయినా 'నీకు రక్ష కడుతున్న నేను ఈ (మీ) కుటుంబానికి చెందిన వ్యక్తినే. నా రక్షణ బాధ్యత నీపై ఉంది' అనే సందేశం ఇమిడి ఉంది. తనకు రక్షణను ఆశించడంతో పాటు సోదరుని, సోదర సమానుడి ఉన్నతిని కోరుతూ రక్షాబంధన్‌కు వేసేల మూడు ముడులు ఆరోగ్యం, సంపద, ఆయుష్షులకు సూచికలు. విద్య ఉద్యోగాలు లాంటి కారణాలతో వివిధ ప్రాంతాలలో ఉంటున్న వారు ఏడాదికి ఒకసారైనా కలుసుకునేందుకు ఈ రాఖీ పండుగ దోహదపడుతోంది. స్థూలంగా పరిశీలిస్తే, అంతటా శాంతి సౌభాగ్యాలు వెల్లి విరుస్తూ, అందరు సుభిక్షంగా ఉండాలనే విశాల భావన ఈ పండుగ సందేశంగా కనిపిస్తుంది. సమాజాన్ని, సనాతన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ, విశ్వమానవ కల్యాణానికి అనువైన వాతావరణాన్ని ఈ పండుగ కల్పిస్తుంది. విశ్వశాంతికి, అభ్యుదయానికి ఆలంబనగా నిలుస్తోంది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ రక్షాబంధన్ పండుగను సామాజిక ఉత్సవంగా నిర్వహిస్తోంది. ★

# 'యజ్ఞోపవీతం పరమం పవిత్రం...'



శ్రావణ పూర్ణిమ నాడు ద్విజులు నూతన యజ్ఞోపవీతాన్ని ధరిస్తారు. జపహోమ ధ్యానాదుల నిమిత్తం దీక్షా సూచికగా నూతన యజ్ఞపవీతం ధరించాలని శాస్త్రవచనం. గడచిన సంవత్సరంలో తెలిసీ తెలియకుండా ఏమైనా దోషాలు చోటుచేసుకుంటే వాటి పరిహారార్థం కూడా నూతన యజ్ఞోపవీతధారణ చేయాలని చెబుతారు. పాల్కురికి సోమన 'పండితారాధ్యచరిత్ర'లో ఈ జంధ్యాల పూర్ణిమను 'నూలు'పండుగ అని పేర్కొన్నారు.

యజ్ఞోపవీతం విశిష్టతను మననం చేసుకుంటే... దానికి ఉండే మూడు పోగులు దేవ పిత్రు రుషి రుణాలకు సూచికలుగా పేర్కొంటారు. ఆ పోగులకు ఉండే మూడు ముళ్లు ఆరోగ్యం, సంపద, తేజస్సుకు సంకేతాలని చెబుతారు. శ్రౌత కర్మానుష్ఠాన, మంత్రానుష్ఠాన యోగ్యత కోసం మొదటి పోగు, గృహస్థాశ్రమ ధర్మ నిర్వహణ కోసం రెండవది, వైదిక కర్మానుష్ఠాన యోగ్యత కోసం మూడవ పోగు ధరించాలన్నది నియమం. అత్యవసర వినియోగార్థం అయిదు పోగులు ధరించాలంటారు పెద్దలు. పాముకాటు లాంటి వాటికి అత్యవసర చికిత్సగా కట్టు కట్టేందుకు నాలుగవది,ఎక్కడైనా యజ్ఞోపవీతం జీర్ణమైన బ్రహ్మచారులు / తారసిల్లితే వారికి ఆపద్ధర్మంగా ధరింప(దానం) చేయడానికి ఐదవ పోగు ధరించాలని అంటారు.

జాత, మృత అశౌచ్యాదుల శుద్ధి సందర్భాలలో నూతన యజ్ఞోపవీత ధారణకు, శ్రావణ పూర్ణిమ నాటి ప్రక్రియకు వ్యత్యాసం ఉంది. శ్రావణ పూర్ణిమనాడు నూతన యజ్ఞోపవీత ధారణతో ద్విజాతులు నాలుగైదు మాసాలు వేదాధ్యయనం చేయాలని మన సంస్కృతి చెబుతోంది. ఉత్తరాయణంలో ఉపనయం అయిన వారికి దక్షిణాయనంలో వచ్చే శ్రావణ పూర్ణిమ నాడు ఉపాకర్మ చేస్తారు. అంటే ఉపనయనం వేళ యజ్ఞోపవీతంలో కట్టే 'మౌంజి'ని ఉపాకర్మ సమయంలో తొలగించి నూతన యజ్ఞోపవీతాన్ని ధరింపచేస్తారు. వేదాభ్యాసకులకు మాత్రం ఏటా ఈ పౌర్ణమి నాడు ఉపాకర్మ నిర్వహిస్తారు. అలాగే వేద విద్యాభ్యాసం ఈ ప్రక్రియతో ప్రారంభమవుతుంది.

విద్యారంభం, వేద పునశ్చరణకు ఇదే సరైన సమయం అనడానికి కారణాలు ఏమిటి? అనే కొందరి సందేహాలకు, 'వర్షరుతువు నుంచి చాతుర్మాస్యం ప్రారంభమవుతుంది. వానల వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి అవకాశం ఉండదు. ఏరువాక సాగి మళ్లలో మొలకలు తలెత్తుతుంటాయి. తీరికా ఉంటుంది. 'ఓషధీనాం ప్రాదుర్భావే..' ఓషధులు మొలకెత్తిన తరువాత, శ్రవణ నక్షత్ర యుక్త శ్రావణ పూర్ణిమ నాడు కాని, హస్త నక్షత్రం గల రోజున కానీ వేదాధ్యయనం ఆరంభించాలి' అని ధర్మశాస్త్రకారులు పేర్కొన్నారు.

శ్రవణ నక్షత్ర యుక్త శ్రావణ పూర్ణిమనాడు కాని, హస్త నక్షత్రం గల రోజున కానీ వేదాధ్యయనం ఆరంభించాలని ధర్మశాస్త్రకారులు పేర్కొన్నారు. కొత్తగా వేదాధ్యయనం మొదలు పెట్టడానికి, అధ్యయనం చేసిన దానిని జ్ఞాపకం ఉంచుకునేం దుకు ఆవృత్తి చేయడం, వల్లె వేయడానికి కూడా ఈ రోజునే నిర్ణయించారు. ★




# వారికి

**తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ పార్టీగా రెండుసార్లు విజయబావుటా ఎగరేసిన తెలంగాణ రాష్ట్ర సమితి.. తన పేరు మార్చుకున్న తర్వాత భారత రాష్ట్ర సమితి పేరుతో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగబోతోంది. ఈ క్రమంలోనే తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థుల జాబితాను కూడా ప్రకటించేసింది. గత ఎన్నికల సమయంలోనూ ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా పోటీచేసే బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను ప్రకటించిన కేసీఆర్.. ప్రతిపక్షాలకు కనీసం గుక్కతిప్పుకునే అవకాశం కూడా ఇవ్వకుండా అసెంబ్లీని రద్దు చేసేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లి ప్రభుత్వ పీఠాన్ని అధిష్టించారు. ఇప్పుడు అదే ఊపుతో హ్యాట్రిక్ మీద కన్నేశారు.**

వాస్తవానికి గత కొన్నాళ్లుగా నెలకొన్న పరిస్థితులు, పలుమార్లు ఎమ్మెల్యేల వ్యవహార శైలిపై కేసీఆర్ బాహాటంగానే క్లాస్ పీకడం వంటి పరిణామాలు చూసి ఈసారి దాదాపు సగం మంది ఎమ్మెల్యేలకు కేసీఆర్ మొండిచేయి చూపిస్తారని రాజకీయ విశ్లేషకులు కూడా భావించారు. కానీ, అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. మరోసారి సిట్టింగ్‌లకే పెద్దపీట వేశారు కేసీఆర్. దీంతో, కొన్నాళ్లుగా పార్టీ టికెట్ కోసం బెంగపెట్టుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ ఊహించలేని ఊరటను కల్పించారు. కానీ, ఈ పరిణామం తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. కేసీఆర్ వెన్నులో భయం మొదలైందన్న వాదనలకూ బలం చేకూరుస్తోంది.

కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థుల విషయంపై ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా జోరుగా చర్చ జరుగుతోంది. కారణం, ఈ లిస్టులో సగానికి పైగా అగ్రకులాలు వారే ఉండటం. 'నా బీసీలు, దళితులు' అని చెప్పుకునే కేసీఆర్.. వారిని సీట్ల విషయంలో మాత్రం పక్కన పెట్టారు. దీనిపై ప్రతిపక్షాలకు విమర్శల అస్త్రం దొరికినట్లైంది. సామాజిక వర్గాల నుంచి మొదలు కొని.. అభ్యర్థుల అవినీతి, అక్రమాల ఆరోపణలను కూడా లెక్కలోకి తీసుకోనితనం కేసీఆర్ లోపల దాగి ఉన్న భయానికి నిదర్శనమన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అందుకే, అగ్రకులాలకు, డబ్బులు ఎక్కువగా ఖర్చు చేసేవాళ్లకే ఈసారి కూడా టికెట్లు కేటాయించారన్న వాదనలు బలంగా వస్తున్నాయి.

**మెరుపులేం లేవు, అన్నీ మరకలే**

భారత రాష్ట్ర సమితి తరపున పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో మెరుపులేం లేవు. కానీ మరకలు పడిన నేతలందరికీ జాబితాలో చోటు దొరికింది. ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఉందని ఐ ప్యాక్ టీం సర్వేలు చేసినప్పుడు పార్టీ అంతర్గత సమావేశాల్లో చెప్పుకున్నారు. యాభై మందిని మారుస్తారని లీకులు వచ్చాయి. చివరికి ఏడుగురి విషయంలోనే నిర్ణయం తీసుకున్నారు. నిజానికి వీరు తిరగబడేవారు కాదు.. కనీసం బలమైన వాళ్లు కాదు. వారిని మార్చినా మార్చకపోయినా పోయేదేం లేదు. మరి తీవ్ర వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యేల విషయంలో కేసీఆర్ ఎందుకు కఠిన నిర్ణయాలు తీసుకోలేకపోయారు. సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో పలువురు రెండుసార్లు గెలిచిన వారుండగా, మరికొందరు మూడుసార్లు గెలుపొందిన వారు కూడా ఉన్నారు. దీంతో వారిపై ప్రజల్లో కొంత వ్యతిరేకత ఏర్పడటంతో పాటు రాజకీయంగానూ సొంత పార్టీలోనే అసంతృప్తులు, అసమ్మతులు పెరిగిపోయాయి. 2018లోనే చాలా నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలకు ప్రజా వ్యతిరేకత ఎదురయింది. చివరికి దళితబంధు నిధుల్లోనూ ఎమ్మెల్యేలు వాటాలు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకరు.. ఇద్దరు కాదు.. దాదాపు అందరు ఎమ్మెల్యేలు ఇలాంటి దందాలు లెక్కలేనన్ని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అయినా.. ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లోనూ పెద్దసంఖ్యలో సిట్టింగ్‌ల వైపే కేసీఆర్ మొగ్గు చూపారు. అందరినీ మార్చలేక.. కొందర్ని మార్చితే ఎదురయ్యే సమస్యలను తట్టుకోలేక కేసీఆర్.. మార్చామని చెప్పుకోవడానికన్నట్లుగా ఏడుగుర్ని మార్చినట్లుగా రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తంగా చూస్తే కేసీఆర్ లిస్టులో ఆత్మరక్షణ ధోరణి ప్రస్ఫుటమవుతోంది కానీ.. ఏ మాత్రం కాన్ఫిడెన్స్ కనిపించడం లేదన్నది ఎక్కువ మంది అంటున్న మాట. ఇక అభ్యర్థులని ప్రకటించి దూకుడుగా ఉన్న కేసీఆర్.. ఈసారి 95–105 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవడం అంత తేలికగా కనిపించడం లేదు.

**అగ్రకులాలకే అధిక ప్రాధాన్యం**

115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్ వారిలో 58 మంది అగ్రకులాలకు చెందిన వారికే అవకాశం కల్పించారు. ఇందులో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు 40 మంది ఉండగా, కేసీఆర్ పోటీ చేయనున్న రెండు నియోజక వర్గాలు (కామారెడ్డి, గజ్వేల్) కలిపి.. ఆయన సామాజిక వర్గమైన వెలమలు 12 మంది ఉన్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు ఆరుగురు, బ్రాహ్మణులు, వైశ్యులు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు.

**బీసీల నినాదానికి పాతర**

ఇక రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న బీసీల నుంచి 23 మందికి మాత్రమే సీట్లు కేటాయించడం గమనార్హం. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు కలిపి 28 సీట్లు కేటాయించారు. మొత్తంగా చూసుకుంటే బీసీలు, దళితులకు కలిపి 51 సీట్లు మాత్రమే ఇచ్చారు. అంటే అగ్రకులాల కంటే తక్కువ అన్న మాట. ఇప్పుడు ఈ అంశాలనే విపక్షాలు అస్త్రంగా మలుచుకుంటున్నాయి. ఈ క్రమంలోనే, టికెట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం జరగడంపై బీసీ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. తెలంగాణలో 60 శాతం ఉన్న బీసీలకు 20 శాతం టికెట్లు మాత్రమే ఇచ్చారని మండిపడుతున్నారు. 5 శాతం ఉన్న రెడ్లకు 33 శాతం, అరశాతం ఉన్న వెలమలకు 16 శాతం టికెట్లు ఎలా కేటాయిస్తారని నిలదీస్తున్నారు.

**అక్కడలా.. ఇక్కడిలా...**

మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో నిరసనలు చేపట్టి, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలూ కదిలేలా చేసినా.. బీఆర్ఎస్ తాజా జాబితాలో మాత్రం కేవలం ఏడుగురు మహిళలకే స్థానం కల్పించి 6 శాతానికే పరిమితం చేశారు. ఇక మునుగోడు ఉపఎన్నిక సమయంలో వామపక్షాల సహకారం పొందిన కేసీఆర్.. సాధారణ ఎన్నికల్లో వారితో పొత్తు ఉంటుందని నాడు ప్రకటించినా తాజాగా కమ్యూనిస్టులకు మొండిచేయి చూపారు.

**రెండు చోట్ల కేసీఆర్ పోటీ బలహీనతకు సంకేతమా?**

ఈసారి కేసీఆర్ కామారెడ్డి, గజ్వేల్ నియోజక



# మళ్లీ మొండిచెయ్యే!

సుజాత గోపగోని, 6302164068

వర్గాల నుంచి బరిలోకి దిగనున్నారు. అయితే ఈ నిర్ణయంతో కేసీఆర్‌లో భయం మొదలైందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. గజ్వేల్‌లో పోటీ చేస్తానని బీజేపీ నేత ఈటల రాజేందర్ చెబుతున్నారు. ఈ మేరకు ఆయన తరచూ ఆ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు కూడా. బీజేపీ ఏమైనా చేయగలదు అనేందుకు మమతా బెనర్జీ ఉదంతాన్ని కేసీఆర్ దృష్టిలో పెట్టుకుని ఉండవచ్చు. పశ్చిమ బెంగాల్లో మమత పార్టీ గెలిచింది కానీ మమతా బెనర్జీ ఓడిపోయారు. కేసీఆర్ తనకు అలాంటి పరిస్థితి రాకుండా రెండు చోట్ల పోటీ చేయాలనుకుంటున్నట్లు వినిపి స్తోంది. కామారెడ్డి ప్రాంతం తన పూర్వికులది కావడంతోనే అక్కడి నుంచి బరిలోకి దిగాలని ఆయన నిర్ణయించుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతు న్నాయి. అంతేకాకుండా.. కేసీఆర్ కుమారుడు కేటీఆర్ పోటీ చేసే సిరిసిల్ల నియోజక వర్గానికి కామా రెడ్డి సరిహద్దుగా ఉంది. మరోవైపు కుమార్తె కవిత ఎంపీగా పోటీ చేసే నిజామాబాద్ లోక్‌సభ స్థానం పైనా కొంత ప్రభావం చూపే అవకాశం ఉందన్న అంచనాతో కేసీఆర్ ఉన్నారని చెబుతున్నారు.

**బీఆర్ఎస్ నేతల్లో ఆగ్రహ జ్వాలలు**

అభ్యర్థుల జాబితా కొన్ని చోట్ల ఆశావహుల్లో ఆగ్రహజ్వాలను రగిల్చింది. టికెట్ల విషయంలో అసంతృప్తులు, అలకలు రాకుండా వారం రోజుల నుంచి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కసరత్తు చేసినా.. జాబితా ప్రకటించాక అసంతృప్తులు బాహాటంగానే బయటికొచ్చారు. ఇప్పటికే ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ అధిష్టానంపై తిరుగు బావుటా ఎగురవేశారు. ఈ క్రమంలోనే రేఖానాయక్ భర్త శ్యామ్ నాయక్ కేసీఆర్ టికెట్లు ప్రకటించిన రోజు రాత్రే రేవంత్ రెడ్డి, ఠాక్రే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రేఖానాయక్ ఖానాపూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ అధిష్టానం కూడా ఆమెకు ఓకే చెప్పింది. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కూడా బీఆర్ఎస్ పార్టీ అధిష్టానంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. కొందరు నేతలు పార్టీకి రాజీనామా చేశారు. మరికొందరు సోషల్ మీడియాలో తమ అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. పెద్దపల్లి నుంచి టికెట్ ఆశించిన నల్ల మనోహర్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి మరోసారి టికెట్ ఇవ్వకపోవడం పట్ల పార్టీ కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు టికెట్ ఇవ్వడం పట్ల పార్టీ అధిష్టానం పునరాలోచించాలని, లేదంటే ఆయన కోసం పని చేయబోమని.. అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ నేతలు అల్టిమేటం జారీచేశారు. మహేశ్వరం నుంచి టికెట్ ఆశించిన తీగల కృష్ణారెడ్డి, పరిగి నుంచి టికెట్ ఆశించిన డీసీసీబీ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి కూడా అసంతృప్తి బాటలో ఉన్నారు.

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు మంత్రి హరీశ్‌రావుపై చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపుతున్నాయి. కేసీఆర్ అభ్యర్థుల జాబితాను ప్రకటించానికి సరిగ్గా రెండున్నర గంటల ముందు.. ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. తనకు తిరిగి మల్కాజ్‌గిరి నుంచి సీటు, అదనంగా తన కుమారుడికి మెదక్ నుంచి కూడా సీటిస్తే సరి.. లేకుంటే మాత్రం తడాఖా చూపిస్తా అన్న రీతిలో వ్యాఖ్యానాలు చేశారు. కాగా, మల్కాజ్ గిరి అభ్యర్థిగా మైనంపల్లికే మళ్లీ అవకాశం కల్పించారు. మెదక్ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డికే తిరిగి అవకాశం ఇచ్చారు. కాగా, పెద్ద సంఖ్యలో అభ్యర్థులతో తొలి జాబితాను స్వయంగా ప్రకటించిన కేసీఆర్.. అవసరమైతే ఒకరిద్దరిని మారుస్తామని కూడా చెప్పడం గమనార్హం.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**





# 'ఇసుకాసురుల స్వైర

**రాష్ట్రంలో ఇసుకను విచ్చలవిడిగా తరలించుకుపోతున్నారు. ఇసుకను సరఫరా చేసేందుకు జేపీ వెంచర్స్ సంస్థ ప్రభుత్వంతో చేసుకున్న రెండేళ్ల ఒప్పందం ఈ ఏడాది మే 13తో ముగిసింది. జేపీ సంస్థ జీఎస్టీ నంబర్‌ను కూడా సస్పెండ్ అయినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. అంటే జీఎస్టీ కూడా కట్టడం లేదు. ఆ సంస్థ ఒప్పందం గడువు పెంచుకోలేదు. అయినా నదుల్లో, వాగుల్లో ఇసుకను తవ్వేసి జేపీ సంస్థ పేరుతో ఉన్న వే బిల్లులతో తరలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు ఇసుక తవ్వుకుని అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.**

దాదాపు మూడు నెలలుగా సాగుతున్న ఈ వ్యవహారంపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్నా గనుల శాఖ నుంచి ఎలాంటి ప్రతిస్పందన లేదు. నెలకు రూ. వెయ్యి కోట్లు చేతులు మారుతున్న ఈ వ్యవహారంలో అధికారులు, పాలక పక్షం పెద్దలు భాగస్వాములుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

వైసీపీ 2019లో అధికారంలోకి వచ్చాక కొత్త ఇసుక పాలసీ పేరిట ఇసుకను అమ్మకం సరుకుగా మార్చేసింది. ఆ తర్వాత పలుమార్లు కొత్త పాలసీలను ప్రకటించినా సమస్యలు తీరలేదు. ధరలు అందుబాటులోకి రాలేదు. ఇసుక బ్లాక్ మార్కెట్‌లో విచ్చలవిడిగా లభిస్తూనే ఉంది. దీనిని సాకుగా చూపి మే13, 2021న జేపీ వెంచర్స్ సంస్థతో రాష్ట్ర గనుల శాఖ ఇసుక అమ్మకాలపై ఒప్పందం చేసుకుంది. రెండేళ్లపాటు ఇసుక అమ్మకం కాంట్రాక్టు దక్కించుకున్న జేపీ వెంచర్స్ టర్న్‌కీ అనే సంస్థకు ఉప కాంట్రాక్టు ఇచ్చింది. నిబంధనల ప్రకారం ఏపీలోనే ఇసుక సరఫరా చేయాల్సి ఉండగా ఇతర రాష్ట్రాలకు నిరాటంకగా సరఫరా అయింది. అధికార పక్ష నేతల ఒత్తిళ్లు, బెదిరింపులు భరించలేక టర్న్‌కీ కూడా గత సెప్టెంబరులోనే వ్యాపారానికి దండం పెట్టి తప్పుకొందంటున్నారు. అయితే జేపీ వెంచర్స్–టర్న్‌కీ పేరిటే ఈ ఏడాది మే 12 వరకు ఇసుక వ్యాపారం సాగింది. టెండర్ ఒప్పంద కాలపరిమితి మే 13 నాటికి ముగిసిపోయింది. ఒప్పందం మేరకు ఇసుక అమ్మకాల నుంచి జేపీ గ్రూప్ తప్పుకోవాలి. జేపీ వెంచర్స్ జీఎస్టీ నంబర్ జూన్ 6న సస్పెండ్ అవడంతో ఆ సంస్థ ప్రభుత్వానికి జీఎస్టీ కట్టదు. ప్రభుత్వం జీఎస్టీ వసూలు చేయదు. కాని ఇసుక ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన డబ్బంతా ఎక్కడికో చేరిపోతోందనేది ప్రశ్నార్థకం.

### నెలకు వెయ్యి కోట్లు

ఇసుక అక్రమసరఫరా వెనుక వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు అధికార యంత్రాంగం సహకరిస్తోంది. ఈ వ్యవహారం ఇప్పటిది కాదు. జేపీ వెంచర్స్ కాంట్రాక్టు ఉన్నప్పుడు కూడా తీర ప్రాంతాల్లో ఇసుకను యధేచ్ఛగా తరలించుకు పోయారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఇసుక అక్రమ సరఫరాను నిలదీసిన వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులపై దాడులు, నిర్బంధాలు, అక్రమ కేసులతో తీవ్రంగా హింసించిన సందర్భాలు అనేకం. ఇసుకాసురుల చేతిలో దాడులకు గురికాని ప్రతిపక్షాల కార్యకర్తలు లేరంటే అతిశయోక్తి కాదు. ఈ అక్రమ వ్యవహారానికి ప్రభుత్వం సహకారం పూర్తిగా ఉందని విమర్శలు ఉన్నాయి.

ఇక ఇసుక అక్రమ తవ్వకాల వల్ల పర్యావరణ ముప్పు ఏర్పడటంతో కొత్తగా అనుమతులు ఇచ్చేదాకా తవ్వకాలు చేపట్టవద్దని ఎన్‌జీటీ ఆదేశించింది. సుప్రీంకోర్టు కూడా విచ్చలవిడి ఇసుక తవ్వకాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అయినా ఇసుకాసురులు ఇవేమీ లెక్కచేయడం లేదు. ఇసుకను మరింత యధేచ్ఛగా భారీ క్రేన్లతో తవ్వి వందల కొద్దీ లారీల్లో తరలిస్తున్నారు. ఈ వ్యవహారంలో ప్రతి నెల కనీసం రూ. వేయి కోట్లు వెనకేసుకుంటున్నారనేది విపక్షాల ఆరోపణ. ప్రభుత్వానికి రావాల్సిన సొమ్మునంతటిని తమ జేబుల్లోకి నెట్టేసుకుంటున్నారు. ఇసుకను కళ్ల ముందే తరలించుకుపోతున్నా గనుల శాఖలో ఏ మాత్రం స్పందన లేదు. ఏమీ తెలియనట్లుగా, కనిపించనట్లుగా ఉంటోంది. 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' వంటి కార్యక్రమాల్లో అక్రమ ఇసుక తవ్వకాలపై భారీగా ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోవడంలేదు. ఈ దందా వెనుక ప్రభుత్వ పెద్దలు ఉండటమే అందుకు కారణం అంటున్నారు. పైగా... ఇసుకను తవ్వుకుంటున్న నేతలను ఇబ్బంది పెట్ట వద్దని 'పై నుంచి' ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

### మూసుకున్న కళ్లు

ఈ అక్రమ ఇసుక తవ్వకాలు, సరఫరా మొత్తం ప్రభుత్వ పెద్దల కనుసన్నుల లోనే జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పాత ఒప్పందం ముగిశాక ప్రభుత్వం కొత్త ఏజెన్సీని ఎంపిక చేయాలి. లేదా కొత్త పాలసీని ప్రకటించాలి. కానీ, ఇవేవీ చేయలేదు. జిల్లాల వారీగా ఇసుక తవ్వి అమ్ముకునేందుకు అక్రమ ఒప్పందాలు జరిగిపోయాయంటున్నారు. ఇసుక రీచ్‌లు ఎక్కువగా ఉన్న కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార, నాగావళి తదితర నదులున్న చోట నెలకు రూ. 20 కోట్ల చొప్పున చెల్లించేలా ఇసుక కాంట్రాక్టు ఇచ్చేశారని, ఒక నెల అడ్వాన్స్ చెల్లించాలన్నది కీలకమైన షరతుగా విధించారని కూడా ప్రచారం జరుగుతోంది. ఎంత తవ్వుకున్నా, ఎక్కడ అమ్ముకున్నా ప్రశ్నించే ప్రసక్తి లేదని తమకు మాత్రం ప్రతినెలా రూ.20 కోట్లు ఇస్తే చాలు అని ఒప్పదం జరిగి పోయిందట. జిల్లాల వారీగా వైసీపీ నేతలు పోటీలు




పడి మరీ ఇసుకపై ప్రభుత్వ పెద్దలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారంటున్నారు. ఒప్పందం చేసుకున్న స్థానిక నేతలు చెలరేగిపోయారు. యంత్రాలతో ఇసుక తవ్వొద్దన్న నిబంధనకు పాతరేశారు. చివరికి... నదీ గర్భంలో డ్రెడ్జింగ్ ద్వారా కూడా ఇసుకను తోడేస్తున్నారనేది ఆరోపణ. గత వంద రోజులుగా రీచ్‌ల్లో తవ్వకాలు, అమ్మకాలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. జేపీ సంస్థ పేరిటే రహదారి (వే) బిల్లులు ఇస్తున్నారు. దానిపై టర్న్‌కీ సంస్థ లోగో, బార్‌కోడ్ ఉండటం, దీనిపై విపక్షాల విమర్శలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి సమాధానం రాకపోవడంతో ప్రభుత్వ తీరుపై అనుమానాలు తీవ్రం అయ్యాయి.

**10 కోట్ల లన్నుల తవ్వకాలు?**

జేపీ వెంచర్స్ పేరుతో రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలు పెద్ద అవినీతి వ్యవహారంగా మారాయి. ఆ సంస్థ ప్రభుత్వంతో కుదుర్చుకొన్న ఒప్పందం ప్రకారం రాష్ట్రంలోని ఇసుక రేవుల్లో ఏడాదికి రెండు కోట్ల టన్నులు తవ్వి తీయాలి. కానీ 10 కోట్ల టన్నుల ఇసుక అక్రమంగా తవ్వి తీసి విక్రయించి జేబులు నింపుకొంటున్నారు అని విపక్షాల ఆరోపణ. అధికారం ఉంటే రాష్ట్రం మొత్తం తమకే రాసిచ్చేసినట్లు వైసీపీ భావిస్తోందంటు న్నారు. జేపీ వెంచర్స్ పేరుతో రాష్ట్రంలోని ఇసుక రేవులన్నింటిని అధికారపక్షం తన గుప్పిట్లో పెట్టుకుంది. ఎంత తవ్వుతున్నారో...ఎంత అమ్ము తున్నారో అంతా మాయగా కనిపిస్తోంది. ఆన్‌లైన్‌లో ఆన్‌లైన్లో ఇసుక బుకింగ్, చెల్లింపులు లేవు. రవాణా వాహనాలకు సరైన అనుమతులు, బిల్లులు లేవు. ఒప్పందం కాల పరిమితి ముగిసినా ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేస్తున్నారు. చిత్తు కాగితాల వంటి బిల్లులు చేతిలో పెట్టి పంపిస్తున్నారు. టన్ను ఇసుక ధర రూ.470 అని పత్రికల్లో ప్రకటనలు ఇస్తున్నారు. ఆ ధరకు ఇసుక ఎక్కడైనా దొరుకుతోందా? బిల్లులు లేకుండా తమ రాష్ట్రంలోకి వస్తున్న ఇసుక లారీలను తెలంగాణ ప్రభుత్వ అధికారులు సీజ్ చేస్తే ఏపీ ప్రభుత్వం కిక్కురుమనలేదు. ఇసుక దోపిడీ సొమ్మంతా తాడేపల్లికే చేరుతోందని ప్రజలు అనుకొంటున్నారు. దీనికి సీఎం సమాధానం చెప్పాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం నోరు మెదపడం లేదు.

**జోరుగా తవ్వకం - అక్రమ రవాణా**

రాజమహేంద్రవరం పరిధిలోని గోదావరి ర్యాంపుల్లో ఇష్టానుసారం ఇసుక తవ్వేస్తున్నట్టు సమాచారం. గోదావరిలో నీరు ఉండటంతో డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక తీస్తున్నారని అభియోగం. లారీల సైజులో ఉండే డ్రెడ్జింగ్ పడవలను తెచ్చి రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము 3 గంటల వరకూ ఇసుక తవ్వి గోదావరి ర్యాంపుల్లో గుట్టలుగా పెడుతున్నారు. వాటిని పగటి పూట అమ్మేస్తున్నారు. స్టాక్ పాయింట్ల పేరిట ఇసుక నిల్వలు పెట్టి టన్ను రూ.700 నుంచి రూ.800 వరకూ విక్రయిస్తున్నారట. కృష్ణా, మున్నేరు నదుల్లో వైసీపీ నాయకులు యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో లారీలను తెలంగాణ ప్రాంతాలకు పంపుతున్నారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ మండలం పాతఇడ్లంక వద్ద కృష్ణానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇసుక, బుసకను తరలిస్తూ కోట్లు దండుకుంటున్నారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రేపల్లె పెనుమూడి, ఓలేరులో ఇసుకను కృష్ణానది నుంచి ఇసుకను డ్రెజ్జర్లతో తోడి మర పడవల్లో తెచ్చి వందలకొద్దీ ట్రాక్టర్లతో తరలిస్తున్నారని ఆరోపణ. గుంటూరు పెదకూరపాడులో కృష్ణానది నుంచి, వినుకొండ మండలం ఇమ్మడివరంలో గుండ్లకమ్మ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారు.

నెల్లూరు జిల్లా పెన్నానదిలోని 12 రీచ్‌ల నుంచి, భగత్‌సింగ్ కాలనీ, సంగం వద్ద, ఎఎస్‌పేట గుంపర్లపాడు మండలంలో, పెన్న, స్వర్ణముఖి, కాళంగి, పంబలేరు, బీరాపేరు, మామిడికాలువల నుంచి ఇసుకను తోడేస్తున్నారంటున్నారు. తుంగభద్ర నది ఇసుక తవ్వకాలకు సి.బెళగల్ మండలం కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె వద్ద నాలుగు డిసిల్టేషన్ రీచులు (నది నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు), కౌతాళం మండలం



వల్లూరు జయప్రకాష్ నారాయణ

గుడికంబాలి-1,2,3, మరళి-1,2 కలిపి ఐదు ఓపెన్ ఇసుక రీచులు, నందవరం మండలం నాగులదిన్నె వద్ద ఓపెన్ రీచుల్లో ఇసుకను తోడేస్తున్నారని ఆరోపణ. ఆలూరు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో హంద్రీ, వేదవతి నదుల్లో నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇక ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిత్రావతి, వేదవతి నదుల నుంచి ఇసుకను తవ్వేసి అమ్ముకుంటున్నారంటున్నారు.

డి. హీరేహాళ్ మండలం తిమ్మలాపురం సమీపంలో వేదవతి నది నుంచి, పుట్టపర్తి సమీపంలో చిత్రావతి నది నుంచి ఇసుకను ట్రాక్టర్లలో నింపుకొని సొమ్ము చేసుకుంటు న్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. డెంకాడ మండలం కేంద్రం సమీపంలో చంపావతి నదిలో 10 నుంచి 12 అడుగుల లోతు వరకు ఇసుకను తోడేస్తున్నారని ఆరోపణ. పగలంతా నది నుంచి ఇసుకను ఒడ్డుకు చేర్చి చీకటి పడ్డాక ట్రాక్టర్ల ద్వారా విజయనగరం కార్పొరేషన్, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం, తగరపువలస, విశాఖపట్నం ప్రాంతా లకు తరలిస్తున్నారట. రేగిడి మండల కేంద్రం, బొడ్డవలస ప్రాంతాల్లో నాగావళి నది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గోస్తని నది నుంచి గంట్యాడ మండలం, ఎస్.కోట, జామి మండలాల్లో భారీగా ఇసుకను తరలిస్తున్నారు. కడప జిల్లా చెన్నూరులో పెన్నా నుంచి ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారు.

కమలాపురంలో వీఎన్‌పల్లె మండలం సంగమేశ్వర ఆలయ సమీపంలో జోరుగా తవ్వకాలు జరుపుతున్నారు. సంగమేశ్వరస్వామి గుడి దగ్గర నదిలో, పెండ్లిమర్రి మండలం కొత్త గంగిరెడ్డిపల్లెతో పాటు పెన్నా, పాపాఘ్ని నదుల్లో ఎక్కడపడితే అక్కడ తవ్వేస్తున్నారు. అన్నమయ్య జిల్లా వీటీఎం మండలంలో పాపాఘ్ని, బాహుదా, పింఛా, చెయ్యేరు, మాండవ్య నదులలోనూ ఇసుకను తవ్వేస్తున్నారు. ఇవేకాకుండా.. స్థానికంగా ఉండే వాగులు, వంకలు, కుంటల్లో సైతం ఇసుకను అక్రమంగా తీసుకెళ్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

**వ్యాసకర్త: ఛైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ.**

శ్రీలంక ఎప్పుడూ భారత్‌తో యుద్ధం చేయలేదు. ఆక్రమణకు కూడా దిగలేదు. అయినా మన దేశమే వారికో భూభాగాన్ని అప్పనంగా ఇచ్చేసింది. ఇటీవల తన ప్రభుత్వం మీద వచ్చిన అవిశ్వాస తీర్మానానికి సమాధానంగా ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటులో చేసిన ప్రసంగంతో కచ్చతీవు మరోసారి చర్చకు వచ్చింది. ఇందిరాగాంధీ శ్రీలంకకు కచ్చతీవును అప్పగిస్తే, అంతకు పూర్వం ఆమె తండ్రి జవాహర్‌లాల్ నెహ్రూ కోకోదీవులను బర్మాకు సమర్పించుకున్నారు. ఈ చారిత్రక తప్పిదాల ఫలితం- నేడు చైనా తిష్ట వేసినది ఆ దీవుల్లోనే. ఈ ఇద్దరి ముద్దుల వారసుడు రాహుల్ మాత్రం 'ఉల్టాచోర్ కొత్వాల్‌కో మారా' అన్నట్లుగా మోదీ వైఫల్యంతో చైనా మన దేశ భూభాగాన్ని ఆక్రమించిందని అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు.




# కచ్చతీవు, కోకోదీవులను

లోక్‌సభలో విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై రెండు రోజుల చర్చ తర్వాత కాంగ్రెస్ పార్టీకి దీటైన సమాధానం ఇచ్చారు ప్రధాని నరేంద్ర మోదీ. సభ నుంచి బయటకు వెళ్లిన వారిని ఒక్కసారి అడగండి.. 'కచ్చతీవు' అంటే ఏమిటి? అది ఎక్కడ ఉంది? అని.. విషయం ఏంటంటే, ఈ ద్వీపాన్ని శ్రీలంక ఏ యుద్ధంలోనూ గెలవలేదు, బలవంతంగా స్వాధీనం చేసుకోలేదు. మరి 1974లో ఈ ద్వీపాన్ని శ్రీలంకకు బహుమతిగా ఎవరిచ్చారంటూ ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాల కోసం 'మా భారతి' (తల్లి భారతి)ని మూడు ముక్కలు చేసిందని అన్నారు మోదీ.

కచ్చతీవును తిరిగి భారత్‌లో కలపాలని డీఎంకే నేతలు నాకు లేఖలు రాస్తున్నారు. 'బయటకు వెళ్లిన వారిని అడగండి, ఈ కచ్చతీవు ద్వీపం ఏంటి? మరి ఈ కచ్చతీవు ఎక్కడుంది? వాళ్లను ప్రశ్నించండి.. ఇలాంటి పెద్ద పెద్ద మాటలు మాట్లాడి దేశాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.. అంటూ ఆయన విరుచుకుపడ్డారు.

**ఇంతకీ ఏమిటీ ఈ కచ్చతీవు?**

భారత్, శ్రీలంక దేశాల మధ్య హిందూ మహా సముద్రంలో చిన్న ద్వీపం కచ్చతీవు. రామేశ్వరానికి ఈశాన్యంగా 11 నాటికల్ మైళ్ల దూరంలో, తలైమన్నార్‌కు ఆగ్నేయంగా 18 నాటికల్ మైళ్ల దూరంలో ఈ దీవి ఉంది. 285 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కచ్చతీవు. రామనాథపురం రాజు 1902లో బ్రిటిష్ ప్రభుత్వం నుండి పొందారు. అంతకు ముందు 1880లో మహమ్మద్ అబ్దుల్ కదిర్ మరైకెర్, ముత్తుచామి పిళ్లై, రామనాథపురం జిల్లా డిప్యూటీ కలెక్టర్ ఎడ్వర్డ్ టర్నర్ మధ్య ఒక లీజు ఒప్పందం జరిగింది. ఈ లీజుకింద 70గ్రామాలు, 11దీవులలో రంగుల తయారీకి అవసరమైన ముడి సరుకును సేకరించుకునేందుకు అధికారం పొందారు. ఆ 11 దీవుల్లో కచ్చతీవు కూడా ఒకటి. 1885లో కూడా ఇదే తరహాలో మరొక లీజు జరిగింది.

1913లో రామనాథపురం రాజు, భారత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మధ్య ఒప్పందం కుదిరింది. ఈ లీజులో కచ్చతీవు పేరు కూడా చేర్చారు. భారత్, శ్రీలంక దేశాలను పాలించిన బ్రిటిష్ ప్రభుత్వం, కచ్చతీవును భారత్‌లో భాగంగానే గుర్తించింది తప్ప శ్రీలంక ప్రాంతంగా ఎప్పుడూ పేర్కొనలేదు. బ్రిటిష్ పాలనలో ఈ ద్వీపం మద్రాసు ప్రెసిడెన్సీ అధీనంలోకి వచ్చింది. అంటే ఇది బ్రిటిష్ వారి అధీనంలోకి వచ్చింది. 1947లో మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు తయారైన ప్రభుత్వ పత్రాలలో ఇది మన దేశంలో భాగమని స్పష్టంగా ఉంది.

మనుషులు ఉండని ఈ దీవిలో సెయింట్ ఆంటోనీ చర్చ్ ఉంది. ప్రతి సంవత్సరం వారంరోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. అప్పుడు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. మిగతా సమయంలో జన సంచారం ఉండదు. 20 శతాబ్దం ఆరంభంలో రామనాథపురానికి చెందిన సీనికుప్పన్ పడయాచి అనే వ్యక్తి ఇక్కడ ఒక ఆలయాన్ని నిర్మించాడని 'ది గెజిటీర్' చెబుతోంది. తంగాచి మఠానికి చెందిన ఒక పూజారి ఈ ఆలయంలో పూజలు నిర్వహించే వారు. కచ్చతీవును భారత్‌తో పాటు అటు శ్రీలంక మత్స్యకారులు ఉపయోగించుకునేవారు. ఈ కారణంగా ఇది రెండు దేశాల మధ్య సమస్యగా మారింది. అనేక సందర్భాల్లో శ్రీలంక ఈ దీవి మీద తన హక్కును చాటుతూ వచ్చింది

**లంకకు అప్పగించిన ఇందిర**

కచ్చతీవు సమస్య పరిష్కారం దిశగా భారత్-శ్రీలంకల మధ్య పలుమార్లు చర్చలు జరిగాయి. 1974లో భారత ప్రధాని ఇందిరాగాంధీ, శ్రీలంక అధ్యక్షురాలు సిరిమావో బండరునాయకెల మధ్య రెండు ముఖ్యమైన సమావేశాలు జరిగాయి. ఒకటి జూన్ 26న కొలంబోలో, మరొకటి జూన్ 28న ఢిల్లీలో. ఈ చర్చల్లో కచ్చతీవును శ్రీలంకకు ఇవ్వాలని నాటి ఇందిరాగాంధీ నిర్ణయించారు. ఈ ఒప్పందంపై వీరిద్దరూ సంతకాలు చేశారు. దీంతో కచ్చతీవు శాశ్వతంగా శ్రీలంక ఆధీనంలోకి వెళ్లింది. ఈ ఒప్పందంలో కొన్ని షరతులు పెట్టారు. భారతీయ మత్స్యకారులు తమ వలలను ఆరబెట్టడానికి ఈ ద్వీపానికి వెళ్లవచ్చు. ద్వీపంలో చర్చిని వీసా లేకుండా సందర్శించవచ్చు.

కచ్చతీవును లంకకు అప్పగిస్తూ ఇందిరాగాంధీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నాటి తమిళనాడు సీఎం కరుణానిధి తీవ్రంగానే వ్యతిరేకించారు. శ్రీలంక నుంచి కచ్చతీవును వెనక్కి తీసుకోవాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేసింది.

ఈ వ్యవహారం ఇంతటితో ఆగిపోలేదు. 1976లో భారతదేశం, శ్రీలంక మధ్య సముద్ర సరిహద్దుకు సంబంధించి మరొక ఒప్పందం తెర మీదికి వచ్చింది. ఈ ఒప్పందంలో కచ్చతీవులోని చర్చిలో ఉత్సవ సమయంలో తప్ప మిగతా రోజుల్లో భారత మత్స్యకారులు, చేపల పడవలు శ్రీలంక స్పెషల్ ఫైనాన్స్ జోన్‌లోకి ప్రవేశించరాదని పేర్కొన్నారు. ఈ ఒప్పందం కచ్చతీవు వివాదానికి ఆజ్యం పోసింది. దీనిపై తమిళనాడు మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీలంకలో తమిళులకు ప్రత్యేక దేశం 'ఈలం' కోసం ఎల్‌టీటీఈ సంస్థ చేపట్టిన వేర్పాటువాద యుద్ధం ఈ సమస్యను మరింత జటిలంగా మార్చింది. లంక నౌకాదళం సముద్రంపై గట్టి నిఘా పెట్టింది. తమ సముద్ర సరిహద్దుల్లో పొరపాటున ప్రవేశించే భారతీయ పడవలను శ్రీలంక నౌకాదళం




# ఎలా కోల్పోయాం?

స్వాధీనం చేసుకుంటోంది. మన మత్స్యకారులను బందీలుగా పట్టుకొని హింసించేవారు.

2010లో ఎల్‌టీటీఈ పరాజయం తర్వాత సముద్రంపై తమ ఉనికిని మరింత బలంగా చాటుకోవడం ప్రారంభించింది శ్రీలంక. దీంతో తమిళనాడు జాలర్ల కష్టాలు మరింతగా పెరిగాయి.

**కేంద్రంపై తమిళనాడు వత్తిడి**

1991లో తమిళనాడు శాసన సభ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టి, కచ్చతీవును భారత్‌లో తిరిగి చేర్చాలని డిమాండ్ చేసింది. కేవలం తీర్మానాలతోనే ఆగకుండా 2008లో నాటి ముఖ్యమంత్రి జయలలిత సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ వేశారు. కచ్చతీవును శ్రీలంకకు బహుమతిగా ఇస్తూ భారత్ ఆ దేశంతో కుదుర్చుకున్న రెండు ఒప్పందాలనూ రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని సుప్రీంకోర్టును కోరింది. రాజ్యాంగ సవరణ లేకుండా దేశంలోని భూమిని మరే ఇతర దేశానికీ ఇవ్వరాదని వాదించారు. 2011లో జయలలిత సీఎం అయ్యాక అసెంబ్లీలో తీర్మానం కూడా చేశారు.

కచ్చతీవు శ్రీలంకదేనని 2010 ఆగస్టులో నాటి భారత విదేశాంగ మంత్రి ఎస్ఎం కృష్ణ ప్రకటించారు. ఒకసారి ధారాదత్తం చేస్తే ఇక మనది కాదనీ, అక్కడకు వెళ్లే తమిళ జాలర్లకు రక్షణ కల్పించలేమనీ కూడా వెల్లడించారు.

2014లో కచ్చతీవు అంశంపై కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ మాట్లాడుతూ.. ఒప్పందం ప్రకారం కచ్చతీవు దీవిని శ్రీలంకకు ఇచ్చారని.. ఇప్పుడు అది అంతర్జాతీయ సరిహద్దులో భాగమని తెలిపారు. మనం కచ్చతీవు ద్వీపాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలంటే ఓ యుద్ధం చేయవలసి ఉంటుందన్నారు ఆయన.

**కోకో దీవులదీ అదే కథ**

కోకో దీవులు బంగాళాఖాతం ఈశాన్య భాగంలో ఉన్న దీవులతో కూడిన చిన్న సమూహం. అండమాన్ –నికోబార్ దీవులకు ఎగువ భాగంలో కనిపిస్తాయి. దక్షిణాసియాలోని అతి ముఖ్యమైన ద్వీపాలలో ఇదొకటి. కోల్‌కతాకు ఆగ్నేయంగా 1255 కి.మీ దూరంలో కోకో దీవులుంటాయి. ఇవి గ్రేట్ కోకో ఐలాండ్, లిటిల్ కోకో ఐలాండ్ అని రెండు భాగాలు. ఈ దీవులను మొదట పోర్చుగీస్ నావికులు కనుగొన్నారు. కొబ్బరి చెట్లు ఎక్కువగా ఉన్నందున వారు దీనికి కోకో ద్వీపం అని పేరు పెట్టారు

ఇవి వాస్తవానికి అండమాన్ నికోబార్ ద్వీప సమూహంలో భాగం. తర్వాత కాలంలో ఇవి బ్రిటిష్ వారి నియంత్రణలోకి వచ్చాయి. భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధులను, రాజకీయ ఖైదీలను నిర్బంధించేందుకు బ్రిటిష్‌వారు అండమాన్‌లో జైలును నిర్మించడం తెలిసిందే. ఈ జైలులోకి ఖైదీలకు ఆహారం పండించేందుకు కోకోదీవులను ఉపయోగించుకున్నారు.

బ్రిటీష్ ప్రభుత్వం బర్మా (ఇప్పుడు మయన్మార్)కు


సిరిమావోతో ఇందిరా..

చెందిన జాద్వెట్ కుటుంబానికి కోకో దీవులు లీజుకు ఇచ్చింది. భారత దేశానికి స్వాతంత్ర్యం తర్వాత ఈ దీవులు సహజంగా భారత్‌కు దక్కాలి. కానీ కోకో దీవుల నియంత్రణ కోసం బ్రిటీష్‌పై వత్తిడి చేయకూడదని భారత తొలి ప్రధానమంత్రి నెహ్రూ తీసుకున్న నిర్ణయం మరో చారిత్రక తప్పిదంగా మారింది. ఒక రకంగా బర్మాకు ఈ దీవులను విరాళంగా ఇచ్చేసినట్లయింది. బ్రిటిష్ ప్రభుత్వంలో చర్చలు జరపాలని నాటి హోంమంత్రి సర్దార్‌పటేల్ సూచించినా నెహ్రూ పట్టించుకోలేదు. అదృష్టవశాత్తు లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులను కూడా వదులుకోకపోవడం స్వతంత్ర భారత దేశానికి పెద్ద ఊరట.

**చైనా వలలో కోకో, కచ్చతీవు**

హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం, అరేబియా సముద్రాలతో చైనాకు ఎలాంటి సంబంధం లేదు. ఆ దేశ తీరాలకు దగ్గరగా కూడా ఈ సాగరాలు లేవు. అయినా ఈ సముద్రాలపై చైనా కన్నేసింది. మయన్మార్ అధీనంలో ఉన్న కోకో దీవులు చైనా నియంత్రణలోకి వెళ్లాయి. మయన్మార్ వారికి ఈ దీవులను లీజుకు ఇచ్చేసింది. దీంతో చైనా మన దేశంపై నిరంతర గూఢచర్యం కోసం కోకో దీవులను ఉపయోగించుకుంటోంది. అండమాన్, నికోబార్ దీవులకు సమీపంలో ఉన్న కోకోదీవుల్లో చైనా ఇప్పటికే ఎయిర్‌స్ట్రిప్, రాడార్ స్టేషన్‌ను నిర్మించింది.

మరోవైపు మన దేశం నుంచి శ్రీలంక సాధించుకున్న కచ్చతీవుపై కూడా చైనా పాగా వేసినట్లు తెలుస్తోంది. సముద్రాలపై ఆధిపత్యం కోసం చైనా చేపట్టిన పెర్ల్ గార్లెండ్ (ముత్యాలహారం) ప్రాజెక్టు కోసం గ్వాదర్ (పాకిస్తాన్), హింగ్ హి (మయన్మార్), మాల్దీవులు, అంబన్‌థొట్టా (శ్రీలంక) లలో స్థావరాలు ఏర్పాటు చేసుకుంది. ఇప్పుడు కచ్చాతీవులో చైనా తిష్ట వేసినట్లు ఆధారాలు లభించాయి.

కోకో దీవులు, కచ్చతీవు భారత భూభాగంలోనే ఉన్నట్లయితే మన దేశ ప్రాదేశిక భౌగోళిక సరిహద్దులు మరింత పటిష్టంగా ఉండేవి. వీటిపై పట్టుకోల్పోవడంతో మన దేశ భద్రతకు ముప్పు పొంచి ఉంది. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఇప్పుడు మూడు సముద్రాల్లో స్వేచ్ఛగా విహరిస్తూ భారత దేశాన్ని సవాలు చేస్తోంది. కోకో దీవులు, కచ్చతీవులను సైనిక చర్య ద్వారా స్వాధీనం చేసుకోవడం భారత దేశానికి చాలా సులభం. కానీ ఇలా చేస్తే అంతర్జాతీయంగా మన దేశ ప్రతిష్ట మసకబారుతుంది.

నెహ్రూ, ఇందిరల చారిత్రిక, వ్యూహాత్మక తప్పిదాలకు కోట్లాది మంది భారతీయులు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనినే నరేంద్ర మోదీ గుర్తు చేశారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# వాగ్గేయకారుని వదలని




ఏ కళారూపమైనా అణచివేత మీద ప్రజలలో స్పృహ కలిగించగలదు. నాటకం, బుర్రకథ, హరికథ, నృత్య ప్రదర్శన ఆ పని చేయగలవు. భక్తిరసమే ప్రధానంగా ఉండే హరికథ కూడా అలాంటి పాత్రను నిర్వహించింది. హరికథ అనే ఆ ప్రక్రియ ద్వారా నిజాం రాజ్యవాసులలో చైతన్యం నింపిన కవి చందాల కేశవదాసు. హరికథలు చెప్పేటప్పుడు తెలంగాణలో విసునూరి దేశ్‌ముఖ్, రజాకారులకు వ్యతిరేకంగా సందర్భానుసారంగా వ్యాఖ్యానిస్తూ వారి కంట్లో నలుసుగా మారారు. ఫలితంగా ఆస్తిపాస్తులు కోల్పోయారు. అటు సాహితీవేత్తగా, ఇటు తొలినాళ్ల టాకీల రచయితగా ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించారు. వృత్తిరీత్యా వైద్యులైనా వచ్చే అంతంత మాత్రం సంపాదనలో అత్యధిక భాగం ఆధ్యాత్మిక, గుప్తదానాలకే వినియోగించారు, చందాలవారు.

*'పరితాప భారంబు భరియింప తరమా*
*కటకట నేవిధి గడువంగ జాలుదు*
*పతి ఆజ్ఞను దాటగలనా*
*పుత్రుని కాపాడగలనా ॥పరి॥*
*ఈ విషము నేనెటులను*
*తనయుని ద్రావింపగలను?*
*ధర్మమును కాపాడుదునా?*
*తనయుని కావగగలనా - ॥పరి॥*
***(చందాల కేశవదాసు)***

చందాల కేశవదాసు అష్టమూర్తి. ఎనిమిది రకాలుగా ప్రజ్ఞాశాలి. కవి, రచయిత, అష్టావధాని, హరికథ భాగవతార్, భాగవత సప్తాహ నిర్వాహకులు, రంగస్థల నటులు, నాటక దర్శకుడు, సినీ, నాటక రచయిత, ఆయుర్వేద వైద్యుడు. అన్నింటికీ మించి గొప్ప మానవతావాది. ఒకసారి పోలంపల్లి గ్రామంలో 'కనకతార' నాటకం ప్రదర్శింపజేసి, అలా వచ్చిన ఆరు వేల రూపాయలను ఆ ఊరిలో గ్రంథాలయ నిర్మాణానికి విరాళంగా ఇచ్చిన వదాన్యుడు.




**కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు


తెలుగులో తొలి టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద'కు పాటలు రాశారు. తెలంగాణాలోని ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం, జక్కేపల్లిలో జూన్ 20,1876న చందాల లక్ష్మీనారాయణ పాపయ్యమ్మల ద్వితీయ సంతానంగా కేశవదాసు జన్మించారు. లక్ష్మీనారాయణ దంపతుల మొదటి కుమారుడు వెంకట రామయ్య బ్రహ్మచారిగా జీవించారు. సాహిత్యం, కళాభిరుచిగల కేశవదాసు, 'భక్తప్రహ్లాద, కనకతార','శ్రీకృష్ణ తులాభారం' చిత్రాలకు మాటలు, పాటలు రాశారు. 'భలేమంచి చౌక బేరమున్ పోయిన దొరకదు' పాట 'శ్రీకృష్ణ తులాభారం' సినిమాకే వన్నె తెచ్చింది. అలాగే నాటకారంభంలో ఆలపించే సుప్రసిద్ధ కీర్తన..

***'పరాబ్రహ్మ పరమేశ్వర పురుషోత్తమ సదానంద***
***పరంజ్యోతి పరాత్పర పతిత పావన స్వప్రకాశ***
***॥ పరా॥***
***వరదాయక సకలలోక వాంఛిత ఫల నాప్రమేయ***
***పాహీ***
***పాహీ-మాం -పాహీ - ॥పరా॥'*** రాశారు.

సుప్రసిద్ధ వాగ్గేయకారుడు పాపట్ల కాంతయ్య వద్ద కేశవదాసు సంగీతంలోని మెలకువలు నేర్చుకున్నారు. గేయరచన, సంగీత కూర్పు, హరికథా గానంలో ఆరితేరారు. ఆయన 1930-33 మధ్య రాసిన జాతీయ గీతాలను నాటి ప్రముఖ సినీ గాయకుడు ఎస్.రాజేశ్వరరావు, ఆకుల నరసింహరావు పాడగా బెంగళూరులో రికార్డు చేశారు. హరికథా గానంతో వచ్చిన డబ్బుతో భద్రాచలంలో భక్తుల సౌకర్యార్థం బావి తవ్వించి, తిరువూరులో భోజన, విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. కోదాడ మండలం తమ్మరలోని సీతారామచంద్రస్వామి ఆలయానికి గాలి గోపురం నిర్మించారు. కేశవదాసు సినిమాలకు రచన చేయడంతో పాటు కేశవ శతకం, బలి బంధనం, సీతా కల్యాణం, రుక్మాంగద, మేలుకొలుపు, జోలపాటలు మొదలైన రచనలు చేశారు. ఆయన ఆధ్వర్యంలో బాలభారత్ సమాజం కనకతార, లంకాదహనం వంటి నాటకాలను ప్రదర్శించింది. ఆ తరువాత వాటిని సినిమాలుగా తీశారు.

'శ్రీకృష్ణ తులాభారం' సినిమాను అనేకసార్లు తీశారు. ఏ తరం వారైనా కేశవదాసు రాసిన పాటలనే వాడుకున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ నిర్మాత డి.రామానాయుడు తీసిన (1966) సినిమాలో కేశవదాసు పాటలు వాడుకున్నారు కానీ పేరు వేయలేదు. దీనిపై కేశవదాసు కుమారుడు కృష్ణమూర్తి కాపీరైట్ కింద ఖమ్మం జిల్లా న్యాయస్థానంలో దావా వేయగా శ్రీశ్రీ, దాశరథి,ఆరుద్ర సాక్ష్యం చెప్పారు. "భలే మంచి చౌక బేరము" "మునివరా తుదకిట్లు" "కొట్టు కొట్టండిరా" పాటలు, పద్యాలు కేశవదాసు రాసినవేనంటూ ఫిబ్రవరి 17, 1971న తీర్పు చెప్పింది.

కేశవదాసును గుప్త దాతగా చెబుతారు. తన ఇంటి నిర్మాణం కోసం దాచిన కలపను సీతారామచంద్రస్వామి రథం తయారీకి వాడారట. సినిమా పూర్తి అయిన తరువాత కలకత్తా నుండి వస్తూండగా ఆ చిత్ర నిర్మాత కేశవ దాసు చేతిలో ఆరు వందల రూపాయలు పెట్టారట. ఆ వెంటనే తమ్మరలోని శ్రీరామునికి రెండు చామరాలు (విసన కర్రలు), గొడుగు కొనుగోలు చేసి సమర్పించారట. ఒంటిమిట్టలోని కోదండ రామస్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించారట. ఇలా గొప్ప రామభక్తునిగా కనిపిస్తారు.

కోదాడ దగ్గర గల తమ్మర గ్రామంలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో సప్తాహాలు ప్రారంభించి (1907లో) 108 సప్తాహాలు నిర్వహించారు. ఈ దేవాలయాన్ని తొలిసారి దర్శించినప్పుడు ఆశు కవితతో స్వామిని స్తుతించారు. ఆ దేవాలయ అర్చకుడు నరసింహాచార్యులుతో మైత్రి కుదిరింది. అక్కడే వైష్ణవ తత్వాన్ని నేర్చుకున్నారు. ఆయన్నే గురువుగా భావించి అవధానంతోపాటు అనేక సాహిత్య ప్రక్రియలు నేర్చుకున్నారు.

దేవాలయాలలో ఉత్సవాలప్పుడు ఉత్సవ విగ్రహాలను దేవాలయం నుండి బయటకు తీసుకు వచ్చి గ్రామంలో ఊరేగించి తిరిగి దేవాలయంలో ప్రవేశపెట్టడాన్ని "వేంచేపు" అంటారు. ఈ సందర్భంలో దేవాలయ అర్చకులు స్తోత్ర పాఠాలతో పాటు హెచ్చరిక పేరుతో పాటగా ఆలపిస్తారు. కేశవదాసు ఈ ప్రక్రియను సంప్రదాయ పద్ధతిలో రాశారు.

హెచ్చరికా హెచ్చరికా / హెచ్చరికా రామ
సచ్చరితా ముని జన సం / వార హెచ్చరికా

1. *సీతామణి హృచ్చోరా / శ్రిత జన మందారా*
   *వాతాత్మజనుత నామా / వరదా హెచ్చరికా*
2. *శాశ్వత జగదేక వీర / శాంత మయాకారా*
   *విశ్వంభర భారభరణ / విభవా హెచ్చరికా*
3. *గాధేయ సవనరక్షకా / ఖండిత శివచాపా*
   *వేదాది నిఖిల సురగన / వినుతా హెచ్చరికా*
4. *జనకరాజామాతా / జనక వాక్యపాలా*
   *వననిధి బంధన సారస / వదనా హెచ్చరికా*


చందాల కేశవదాసు


ద్వారం వెంకటస్వామి




తమ్మర, కోదాడ, హుజూర్‌నగర్, బూరగడ్డ, సూర్యాపేట, దేవాలయాల ఉత్సవాల్లో ఈనాటికీ గానం చేస్తున్నట్లు తెలుస్తున్నది.

సామాజిక భావాలు అధికంగాగల కేశవదాసు దేశంలోని స్వాతంత్ర్యోద్యమ పరిస్థితులను బాగా

# రజాకారులు

ఆకళింపు చేసుకున్నారు. అందుకు తగినట్లుగానే తన మేధాశక్తితో ఉద్యమాన్ని కొన్ని దశలుగా విభజించి అహింసా పద్ధతులలో పోరాటం జరుపుతున్న వారిని తన రచనలలో ప్రశంసించారు. 'జయతు జై' అంటూ పాట రాసి, దానిని ఆకుల నరసింహారావు, ఎస్.రాజేశ్వరరావుతో పాడించి బెంగళూరులో సొంత ఖర్చులతో రికార్డు చేయించి విడుదల చేశారు. అనేక స్థానిక పోరాటాలలో స్వయంగా పాల్గొని ప్రజలను ఉత్తేజితులను చేశారు. తన నాటకాల్లో పాత్రలతో దేశభక్తిని బోధించే సంభాషణలు చెప్పించేవాడు.

"దేశమాత దిగులేల" అనే దేశభక్తి గీతం (అలభ్యం) రాశారు. జక్కేపల్లి దగ్గరగల రాజుపేటలో వెంకయ్య అనే దళితుడికి దాసుగారి హరికథలంటే అమిత ఇష్టం. అందుకోసం తిండిలేకపోయినా దూర ప్రాంతాలకైనా నడిచి వెళ్లేవాడట. ఆ విషయం తెలిసి తన ఇంటికి పిలిపించుకుని భోజనం పెట్టి ఆయన తినే వరకూ విసనకర్ర విసిరారట.

హరిదాసుగా నాటి తెలుగు సమాజంలో కేశవదాసుకు ఒక ప్రత్యేకస్థానం ఉండేది. పోలంపల్లి, దుబ్బాకపల్లి, ఖమ్మం, జక్కేపల్లి, కోదాడ, తమ్మర, జగ్గయ్యపేటలలో ఈయన హరికథకు జనాలు విపరీతంగా వచ్చేవారు. జగ్గయ్యపేటలో హరికథా గానానికి ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామినాయుడు వాద్య సహకారం అందించారు.

విసునూరి దేశ్‌ముఖుల గ్రామమైన కడివెండికి శివారు పల్లె సీతారాంపురం. ఇక్కడ ఆకుల వెంకయ్య గంపనెత్తిన పెట్టుకుని ఇంటింటికి తిరిగి కూరగాయలు అమ్ముకునేవాడు.అలా వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని విసునూరి దొరకు, ఆయన గుమస్తాలకు ఇవ్వవలసి వచ్చేది. విసునూరి దేశ్‌ముఖ్ తెలంగాణలో పరమ క్రూరుడనీ, దుర్మార్గుడనీ పేరు. అతనికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచాలని నిర్ణయించారు. ఆంధ్ర మహాసభవారు అందుకు హరికథా విశారదుడు కేశవదాసు ఏ కథ చెప్పినా మధ్యలో తెలంగాణలో జరుగుతున్న దోపిడీ విధానాన్ని, దానిని ఎదుర్కొనే మార్గాలు వివరించి ప్రజలను బాగా ఉత్తేజ పరిచేవారు. ఈ విషయం విసునూరి దేశ్‌ముఖ్‌కు తెలిసింది. అప్పటికే దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి మనుషులు దొడ్డి కొమరయ్యను చంపారు. సాయుధ పోరాటం మొదలైంది. మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ ఇత్తెహాద్–ఉల్–ముస్లిమీన్ నాయకుడు కాశీం రజ్వీకి అనధికార హక్కులను ఇచ్చాడు. వారు గ్రామాలపై పడి దోపిడీలు, మానభంగాలు, గృహ దహనాలకు యథేచ్ఛగా పాల్పడుతున్నారు. ఆంధ్ర మహాసభ సమైక్యంగా సత్యాగ్రహ పోరాటాలకు పిలుపు నిచ్చాయి. దాసు దానిలో భాగస్వాములయ్యారు.

కేశవదాసు 'నరకాసుర వధ'ను హరికథగా చెప్ప నిశ్చయించుకున్నారు. నరకాసురుడు ఒక పెద్ద రాక్షసుడు, అతి భయంకరుడు. అయినా స్త్రీ శక్తి సమాయత్తమైతే, ప్రణాళిక ప్రకారం ఎదురు తిరిగి నిలబడి పోరాడితే ఎలాంటి వాడైనా ఓడిపోతాడు. ఈ కథ చెప్తూ స్త్రీశక్తి, వారి సహజ ఆలోచనా ధోరణి, సమైక్య పోరాటంతో రజాకారులపై తిరగబడితే తప్పక వారు కాలికి బుద్ధి చెపుతారని ఉద్బోధిస్తున్నారు. అలా ప్రతీ ఊరిలోనూ నరకాసుర వధ కథ చెబుతున్నారు. ఏదో కిటుకుందని పోలీసు నిఘా పెట్టింది. ఆయన వాక్ శుద్ధి ముందు ప్రజలు సమ్మోహితులయ్యేవారు. పోలీసులు కూడా శ్రద్ధగా వినేవారట. ఆయన రజాకారుల గురించి చెబుతున్నారనే విషయాన్ని చివరిగా గ్రహించారట. అప్పుడు చర్యలు తీసుకున్నారట.

రజాకారులు మరింత సైన్యాన్ని సమకూర్చుకుని ముమ్మరంగా దాడులు చేయడం ప్రారంభించారు. అందులో భాగంగానే 1948 జూలైలో జక్కేపల్లిలో బీభత్సం సృష్టించారు. కేశవదాసు ఇంటిని దోచుకున్నారు. ఆయన రచనా సంపద, వస్తు సామాగ్రి, ధనధాన్యాలు దోపిడీకి గురి అయ్యాయి. కట్టుబట్టలు తప్ప ఏమీ మిగల్లేదు. ఆ సంవత్సరం చివరిలో కేశవదాసు తన కుటుంబాన్ని జక్కేపల్లి నుండి ఖమ్మం మార్చారు. ఉన్న కొద్దిపాటి భూమిని నమ్మకస్తులకు అప్పజెప్పారు. అయితే ఖమ్మంలో తమ వైద్యవృత్తికి పెద్దగా అవసరం ఉందదని, ప్రజాసేవపైగల మక్కువతో ఖమ్మం దగ్గర్లో గల నాయకన్ గూడెంలో 1950లో కాపురం పెట్టారు. ప్రజాసేవ చేస్తూ అదే గ్రామంలో 1956 మే 14న ఆయన పరమపదించారు. ★

రజాకారులు మరింత సైన్యాన్ని సమకూర్చుకుని ముమ్మరంగా దాడులు చేయడం ప్రారంభించారు. అందులో భాగంగానే 1948 జూలైలో జక్కేపల్లిలో బీభత్సం సృష్టించారు. కేశవదాసు ఇంటిని దోచుకున్నారు. ఆయన రచనా సంపద, వస్తు సామాగ్రి, ధనధాన్యాలు దోపిడీకి గురి అయ్యాయి. కట్టుబట్టలు తప్ప ఏమీ మిగల్లేదు. ఆ సంవత్సరం చివరిలో కేశవదాసు తన కుటుంబాన్ని జక్కేపల్లి నుండి ఖమ్మం మార్చారు. ఉన్న కొద్దిపాటి భూమిని నమ్మకస్తులకు అప్పజెప్పారు.

# శ్రీపాద కథలు –

తెలుగు కథా రచయితల్లో ద్వితీయుడైనా అద్వితీయుడైన కథా రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి. గురజాడతో ఆరంభమైన కథానిక రచనను సుసంపన్నం చేసిన విశిష్ట రచయిత. తెలుగువారి జీవితాలను నిశితదృష్టితో పరిశీలించి తనదైన శైలిలో గురజాడ, గిడుగు ప్రభావంతో వాడుక భాషలో రాసి మెప్పుపొందిన కథక చక్రవర్తి. బహుముఖ ప్రజ్ఞతో నాటకం, నాటిక, నవల, విమర్శ, స్వీయచరిత్ర వంటి ప్రక్రియలన్నింటినీ సృజించినా, కథారచయితగా ఎక్కువగా సుప్రసిద్ధులయ్యారు. 'రాజరాజు', 'కలంపోటు' 'టీపార్టీ' వంటి నాటికలు రాశారు. నవలా రచయితగా 'మిథునానురాగం' (1914), 'శ్మశానవాటిక' (1917) 'అనాథ బాలిక' (1924), 'రక్షాబంధనం' (1925) వంటి నవలలు రాశారు. ఆయన రచన 'ఆత్మబలి' మనోవిశ్లేషణాత్మక నవలగా ప్రసిద్ధి పొందింది. 'నీలాసుందరం ' పౌరాణిక నవల విమర్శకుల మెప్పు పొందింది. పాత్రికేయులుగా 'ప్రబుద్ధాంధ్ర 'ను పక్షపత్రికగా ప్రారంభించి (1920) మాసపత్రికగా నిర్వహించారు. 'రెడ్డిరాణి ' పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు వహించారు.



ఆధునిక కథా సాహిత్యంలో చిన్నకథకు పెద్దపీట వేసిన శ్రీపాద వారు ఏప్రిల్ 23, 1891న రామచంద్రపురం తాలూకా, పాలమూరు గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి లక్ష్మీపతి సోమయాజులు. తల్లి మహాలక్ష్మి సోదెమ్మ. వారి మగసంతానంలో శాస్త్రి మూడోవారు. తెలుగు కవిత్వం, సాహిత్యం ఏ మాత్రం గిట్టని కుటుంబ వాతావరణంలో గురువులు, పెద్దల కంటపడకుండా వీరేశలింగం 'కవుల చరిత్ర' మూడవ భాగం, పోలూరి వెంకట కృష్ణయ్య 'రోహిణీ సుధాకరం' నాటకాన్ని రహస్యంగా చదివారు. ఏటికెదురీదిన విధంగా కథారచయితగా సుస్థిరస్థానాన్ని సంపాదించు కున్న శ్రీపాద మొత్తం 75 చిన్న కథలు రాశారు. 1925లో 19 చిన్న కథలను కథా సంపుటిగా ప్రచురించారు. 1939లో అద్దేపల్లి వారు 25 కథలను 'చిన్న కథలు ' శీర్షికతో ముద్రించారు. విశాలాంధ్ర పబ్లికేషన్స్ వారు 2005లో 45 కథలను 'పుల్లంపేట జరీచీర' పేరిట ప్రచురించారు.

శ్రీపాద వారు కథానికను చిన్న కథగానే భావించేవారు. కథా రచయితకు వ్యుత్పన్నత, అభ్యాసం, నిశిత పరిశీలనా దృష్టి, సంస్కారం ఉండాలన్నది ఆయన అభిప్రాయం. ఆయన కథలను స్థూలంగా సంస్కరణాత్మక కథలు, విషాదాంత ప్రణయ కథలు, చారిత్రక, జానపద కథలు అని నాలుగు విభాగాలుగా వర్గీకరించి విశ్లేషించవచ్చు. శ్రీపాద వారి కథల్లో ఉన్న సంస్కరణ దృక్పథాన్ని విశ్లేషించడమే ప్రస్తుత వ్యాస ముఖ్యోద్దేశం.

శ్రీపాద సంస్కరణాత్మక కథల్లో 1) వితంతు వివాహ సంస్కరణలు, 2) వితంతువుల దాష్టీక నిరసన, 3) అవినీతి నిరసన, 4) అస్పృశ్యతా నిరసన, మతమార్పిడి పరాయి సంస్కృతి ప్రోత్సాహాలు, 5) నిరుద్యోగం, స్వయం ఉపాధి ప్రబోధం, 6) నిరసనలున్నాయి. ఆయన సంస్కరణ దృక్పథం ప్రధానమైంది. కొన్ని ప్రభోదాత్మకాలు, కొన్ని ప్రణయ కథలున్నాయి. కొన్ని సూటిగా ప్రశ్నించేవి ఉన్నాయి. ప్రత్యేకించి మహిళాభ్యుదయ భావాలున్నాయి. ఆయన కథల్లో అప్పటి సాంఘిక విరుద్ధాలైన వితంతు, వయో పునస్సంధానాలున్నాయి. రజస్వల అనంతర వివాహాలున్నాయి. పరిణిత వితంతువుల అణచివేతపై తిరుగుబాటు ధోరణి, స్వతంత్రించి పునర్వివాహాలు చేసుకోవడాలు ఉన్నాయి. ఆడపిల్లలు స్వయంశక్తి శౌర్యాలు పెంపొందించు కోవడం, సాముగరడీలు నేర్చుకోవడాలున్నాయి. పెళ్లే ప్రధానంగా భావించ కుండా చదువుకొని స్వయం ఉపాధిని కల్పించుకోవడం, వరుల నిర్ణయంలో పాలు పంచుకోవడం, చొరవ చూపడం, వరకట్నాన్ని తిరస్కరించడం, భార్య భర్తను ప్రశ్నించగలగడం, తండ్రీ కూతుళ్లు పరస్పర అవగాహనతో స్నేహపూర్వకంగా మెలగడం, వేశ్యల్లో కూడా గౌరవనీయులుంటా రని గుర్తించడం వంటి మహిళాభ్యుదయ ప్రగతిస్ఫోరక భావాలెన్నో ఉన్నాయి. ఆనాటి సాంఘిక సమస్యలెన్నో నేడు యథాతథంగా లేకున్నా మౌలికంగా స్త్రీ స్వేచ్ఛ, స్త్రీపురుష సమానత్వం ఇప్పటికి సాధించవలసిన ఆశయాలు గానే కొనసాగుతున్నాయి.

# సంస్కరణ దీపికలు




డా॥ పి.వి.సుబ్బారావు
9849177594


**వితంతు వివాహ కథలు:** వీరేశలింగం ప్రభావంతో శ్రీపాద తమ కథల్లో మహిళాభ్యుదయ దృక్పథాన్ని ప్రవేశపెట్టారు. వితంతువివాహాలను ప్రోత్సహించారు. శ్రీపాదలో మహిళాభ్యుదయపు ముందుచూపు ఒక శతాబ్ది ముందుగా వచ్చిందంటే అతిశయోక్తి కాదు. తమ కథల్లో వీరేశ లింగం గారిని పాత్రగా ప్రవేశపెట్టారు. కుహనా సంస్కర్త రంగారావు పన్నిన కుటిల వలయాన్ని వివేకంతో ఛేదించి కోరుకున్న యువకుడిని (సూర్యారావు) వివాహం చేసుకున్న వితంతు సాహసగాథ 'రామలక్ష్మి' కథ.

'వెలిపెడితే అల్లుడైనాడు' కథలో యువ పండితుడు విశ్వనాథశాస్త్రికి వస్తున్న పేరు ప్రఖ్యాతులు చూడలేక కసితో అతడు మాల యువతిని రక్షించాడన్న నెపంతో పద్మనాభశాస్త్రి వెలి వేయించాడు. పద్మనాభశాస్త్రి వితంతు కూతురు నరసమ్మ, విశ్వనాథశాస్త్రితో వెళ్లిపోయి పెళ్లి చేసుకొని తండ్రికి బుద్ధి చెబుతుంది. తండ్రి తనను కొట్టి చంపుతానంటే నరసమ్మ సాహసంతో అర్ధరాత్రి విశ్వనాథ శాస్త్రితో 'ఎక్కడికేనా పోదాం పద' అని ప్రయాణం కట్టించింది. ఆమె సాహసానికి పర్యవసానమే ఆమె పునర్వివాహం. శ్రీపాద వారి కథల్లో స్త్రీ పాత్రలకుండే తెగింపు పురుషపాత్రల్లో అంతగా కనిపించదు. నరసమ్మ, రామలక్ష్మి పాత్రలే ఇందుకు దృష్టాంతాలు.

'అరికాళ్ల కింద మంటలు' కథలో రుక్మిణి 17 ఏళ్ల వితంతువు. ఇంట్లో వారంతా ఆమెతో పనులు చేయించేవారు. పని చేయలేనంటే నిష్ఠూరాలాడే వారు. రుక్మిణికి తల గొరిగించి కూర్చోపెడితో బుద్ధి వస్తుందని కుటుంబ సభ్యులంతా నిర్ణయానికి వచ్చారు. వాళ్ల ప్రయత్నాలను సహించలేక రుక్మిణి, జట్కా బండివాడి సహాయంతో వితంతు వివాహాలు ప్రోత్సహిస్తున్న వీరేశలింగం గారి తోటకు వెళ్లి పునర్వివాహం చేసుకుంటుంది.

శ్రీపాద ఒకవైపు బాల వితంతువుల స్థితిపట్ల సానుభూతిని చూపిస్తూనే, పుట్టింటికి చేరిన వితంతు ఆడపడుచులు పెత్తనాన్ని, వారి ఆగడాలను ఇంట్లో బంధువులు, తమ్ముళ్లు, మరదళ్లు కలిసి బుద్ధి వచ్చేట్లు చేసిన కథలు రాశారు. 'ఇల్లు పట్టిన వెధవాడపడుచు' 'కీలెరిగిన వాత' వంటివి కథలు ఎందుకు ఉదాహరణలు.

అవినీతి నిరసన కథలు:

అప్పటికే సంఘంలో ఉన్న అవినీతి, ఉద్యోగాల కోసం లంచం అడిగే స్థితిని 'కలుపు మొక్కలు' కథలో చిత్రించాడు. ఒక బీద బ్రాహ్మణుడు తన కొడుక్కి ఉద్యోగం కోసం ప్రెసిడెంటు గారి గుమస్తా వద్దకు వెళతాడు. అయితే గుమస్తా అడిగిన లంచం ఇవ్వలేనంటాడు. చిట్టచివరి అస్త్రంగా ఒక వేశ్యను ప్రెసిడెంటు వద్దకు పంపేట్లయితే ఉద్యోగం ఇప్పిస్తానంటాడు. ఏంచేయాలో తోచక అతడు ఒక వేశ్య వద్ద ప్రాధేయపడతాడు. అందుకు మొదట తిరస్కరించినా, అతడి బాధను గమనించి జాలితో అంగీకరిస్తుంది. సమాజంలో పెద్దమనుషులుగా కనపడుతున్న వారంతా స్వార్థంతో ఎంత సంకుచితంగా మారితే, సమాజం చులకనగా చూసే వేశ్య ఒక మంచి పని కోసం తన ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించి, మహోన్నత వ్యక్తిత్వం గల మహిళగా మారుతుంది. పేదబ్రాహ్మణ కుటుంబం కోసం తనకు ఇష్టంలేని వ్యక్తికి శరీరాన్ని సమర్పించుకున్న ఉదాత్త త్యాగశీలిగా శ్రీపాద వేశ్యను చిత్రించాడు.

శ్రీపాద కథల్లో 'ఇలాంటి తవ్వాయి వస్తే' కథలో కులమతం, వివక్ష, అస్పృశ్యత, మతమార్పిడుల విషయంలో గ్రామంలో పెద్దలు, అగ్రవర్ణాల వారు ఎంత అసంబద్ధంగా, అమానుషంగా ప్రవర్తిస్తారో చూపించాడు. కులం కట్టుబాట్లకు జంకి, పెళ్లి కోసం మతం మార్చుకున్న నిమ్నజాతి యువతీ యువకుల ప్రణయగాథ 'సాగర సంగమం' కథ. కులాతీత మతంగా ప్రసిద్ధి చెందిన క్రైస్తవంలో చేరిన వారికి కూడా కులభేదాలు పాటించే యదార్థ స్థితిని శ్రీపాద వాస్తవిక దృష్టితో చిత్రించారు.

**నిరుద్యోగం/స్వయం ఉపాధి ప్రబోధ కథలు**

అప్పటికే సంఘంలో నిరుద్యోగ సమస్య తాండవిస్తోంది. ఇతర సాంఘిక సమస్యలతో పాటు నిరుద్యోగ సమస్యను గూర్చి 'తాపీమేస్త్రి రామదీక్షితులు, బి.ఏ.,' 'మార్గదర్శి' 'గుర్రప్పందాలు' వంటి కథల్లో ప్రబోధాత్మకంగా చిత్రించారు. చదువు కున్న యువకులు అగ్రకులానికి చెందినవారైనా, ఉద్యోగాల వేటలోపడి బాధపడేకన్నా, భేషజాలు మానుకొని ఏదో ఒక వృత్తిని చేపట్టాలని, ఏదో ఒక వ్యాపారాన్ని నిర్వహించాలని రాసిన ఈ కథల్లో కథాశిల్పంతో, కథనశైలితో అగ్రశ్రేణిలో నిలిచే కథ 'మార్గదర్శి'. ఒక ఉద్యోగానికి సిఫారసు చేయాలని కోరుతూ తన దగ్గరకు వచ్చిన యువకుడికి 'ఉద్యోగాల వేట మానుకొని, స్వయంగా ఏదైనా వ్యాపారం చేసుకోమని' శ్రీపాద స్వానుభవంతో సలహా చెప్పారు. అతనికి ఇంకా ఉద్యోగ వ్యామోహం పోనందున గట్టిగా మందలించారు. ఉద్యోగాల వేట ఇతివృత్తంతో శ్రీపాద రాసిన మరో కథ 'గుర్రప్పందాలు'. ఉద్యోగాల ఇంటర్వ్యూలకు వెళ్లే యువకులకు ఎంత అసంబద్ధమైన ప్రశ్నలు వేస్తారో, ఎలా అవమానిస్తారో వ్యంగ్యస్ఫోరక సంభాషణలతో చమత్కారంగా రాశారు. పెళ్లికొడుకు పెళ్లికూతుర్ని చూసుకోవడం లాంటిదే కంపెనీ వాళ్లు దరఖాస్తు దారులను చూసుకోవడం అని అధిక్షేపించారు. తాపీమేస్త్రి రామదీక్షితులు, బి.ఏ. కథలో రామదీక్షితులు,కంపెనీ వారు తాపీ మేస్త్రీ పని ద్వారా డబ్బు సంపాదించడాన్ని యువకులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రబోధించారు. సంస్కరణ దృక్పథంతో వివిధ అంశాలు ఇతివృత్తంగా కథలు రాసిన శ్రీపాద కథాప్రియుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతారు.











వ్యాసకర్త : విశ్రాంత అధ్యాపకుడు

# 'కోమల'త్వం ఆమె

ఇది ఏడు దశాబ్దాల నాటి మాట. కాదు కాదు, పాట.

***'విజ్ఞాన దీపమును వెలిగింపరారయ్యా***
***అజ్ఞాన తిమిరమును హరియింపరయ్యా***
***పరహితమె, పరసుఖమె, పరమార్థ చింతనమె***
***మానవుల ధర్మమని భావించరయ్యా'***

ఈ టైటిల్ సాంగ్‌లో గాయని ఎ.పి.కోమల (ఆర్కాటు పార్థసారధి కోమల). ఆకాశవాణిలో నాడు సరిసాటిలేని మేటి గాయనీమణి. చలనచిత్రాల పరంగా మొదటి పాటను తెలుగులో ఆలాపించిన తమిళనాడు నివాసి. జననీ జనకులు లక్ష్మి, పార్థసారథి. ఉభయులూ గీతామృత ఆరాధకులు, సంగీత సరస్వతీ ఉపాసకులు. వారి ఆలనాపాలనా ఫలితం–ఈమె అతి చిన్న ప్రాయంలోనే గానం చేయడం. గురు ప్రోత్సాహంతో మకాం తెలుగునాట రాజమండ్రికి మారింది. ఆలిండియా రేడియోతో అనుబంధం దినదిన ప్రవర్ధితం అయింది. దేశ స్వాతంత్ర్య సాధన తదుపరి, మొత్తం తెలుగు వారందరూ విని పరవశించేలా ప్రథమంగా దేశభక్తి గీతాన్ని పాడిందీ కోమలే! కుడి ఎడమల.. రేడియో, సినిమా అనేలా తన గానప్రవంతి దశాబ్దాల తరబడి ప్రవహించింది. ఆబాల గోపాలాన్నీ మురిపించిన ఈమె జన్మదినోత్సవ శుభసందర్భంలో ఇది అక్షర కుసుమాంజలి. తెలుగు, తమిళంతో పాటు కన్నడ, మలయాళ భాషల్లోనూ వేలపాటలు పాడి మెప్పించిన కలైమామణి, అమృతగాన వర్షిణి, సుగాత్ర ధారిణి గురించిన సవివర సమర్పనే ఇది. భాగ్యనగరంలో అలనాడు ఘంటసాల పేరిట స్వర్ణకంకణ స్వీకర్త. అన్నట్లు, 'విజ్ఞాన దీపము' గీతాన్ని అప్పట్లో తాను ఆలాపించింది ఘంటసాలవారితోనే. అందులో 'ఓం' అని ఈమె పలికిన విధానం ఆపాతమధురం, శ్రవణానందకరం!

బరంపురంలోని ఆలయ ప్రాంగణంలో పాడినప్పుడు కోమలది చిన్న వయసు. బంగారు పతకం అందుకున్నప్పుడు ఎంతగానో మురిసింది ఆమె మనసు. అటు తర్వాత రాజమండ్రి వేదికగా గీతాలాపనకు వెండి భరిణె బహూకృతి. ఇంకా ఎన్నెన్ని ప్రాంతాల్లో పాడారో ఒక పట్టాన లెక్కించలేం. ఆకాశ గాయనీమణులతో విడివడిగా పాడిన అనుభవమూ ఉంది. ఎన్ని పాటలు పాడినా, ఇంకెన్ని పర్యటనలు చేసినా అలుపూ సొలుపూ ఉండేది కాదు కోమలకి. పద్యం, గద్యం, నృత్యగేయం, భక్తి, హాస్యం సమస్తమూ గొంతులో అలవోకగా పలికేవి.

***'నరజన్మ అత్యున్నతమురా' అనడంలో పరమార్థ భావన***

***'పన్నగ శయనా పంకజనయనా నల్లని స్వామీ నారాయణా' అని పాడటంలో అపార భక్తి తత్పరత***

***'ఈ మౌనమేలనోయీ / గతంబే మరచుట మేలేయి'*** అంటూ ఆలాపించడంలో అత్యంత హితాభిలాష

ఎంత దీటుగా భావాలు వ్యక్తమయ్యేవో తెలిపేందుకు మాటలు చాలవు మరి.

ఆకాశవాణి నుంచి చలనచిత్ర గీతాలా అనేది అప్పట్లో ఎదురైన ప్రశ్న. ఆ పాటల ప్రసారాల వల్ల లలిత గేయాలకు ప్రాచుర్యం తగ్గుతుంది కదా? అనే విమర్శలూ వచ్చేవి. ఫలితంగా, రేడియో కళాకారులకు సినిమాల్లో పాడే అవకాశాలు గణనీయంగా



వాణిలో గానలహరి సాగించిన తొలినాళ్లలో తనను చూసిన ప్రతీ ఒక్కరూ ముచ్చటపడేవారు. అంత బాలగాయని అన్న మాట. శాస్త్రీయ సంగీతానికే అన్ని విధాల పెద్దపీట. దీక్షితార్ కృతి, త్యాగయ్య కీర్తన, ఇంకెన్నెన్నో. అనంతర కాలంలో లలిత సంగీతానికీ సమధిక ప్రాధాన్యమిచ్చారు. దేవులపల్లి భావగీతమైనా, గురజాడ దేశభక్తి గేయమైనా ఆ స్వరంలో మరింత పరిమళించాయి. గ్రామ్‌ఫోన్ గీతాలైతే సరేసరి. మొదటగా యుగళగీతాన్ని ఘంటసాలతో పాడిన సందర్భంలో కోమలకి కేవలం పదిహేనేళ్లు! తాను తెలుగులో పాడిన చిత్రం సింహళంలోకి అనువదిత మైతే, ఆ భాష గీతికనూ తానే ఆలాపన చేశారు. ఆకాశవాణి, చిత్రాలలోకి అనువాదమైతే , ఆ భాష గీతికనూ తానే ఆలాపన చేశారు. ఆకాశవాణి, చిత్రాలగాన ప్రతిభ కారణంగా దేశ విదేశాల్లో పర్యటించారు. ఆమె రేడియో పాట నాటి తమిళ ప్రభుత్వాధినేతల జేజేలందుకుంది. మంగళంపల్లివారి చేతుల మీదుగా మధుర వాణి బిరుదాన్ని అందుకునేలా చేసింది. నిత్యనిరంతర సాధన, పిల్లల మొదలు పెద్దల వరకు ఇచ్చిన శిక్షణ తన జీవితానికి ధన్యత కలిగించింది. అప్పటికప్పుడే పాటకు వరసకట్టి పాడటమన్న అలవాటు గాత్ర దీక్షాదక్షతలను విస్తృతపరచింది. ఒకే పాటను ఇద్దరు సుప్రసిద్ధ తగ్గిపోయాయి. అటువంటి పరిస్థితుల్లోనూ సహనశీలత కనబరిచారు కోమల. వ్యక్తిగత అభిరుచులకు సంబంధించి–ఎం.ఎల్. వసంతకుమారి, ఎస్.వరలక్ష్మి స్వరాలను ఎంతగానో ఇష్టపడేవారు. అదే విధంగా, పి.సుశీల గొంతులో పలికే స్వచ్ఛత, స్పష్టతలను పరిపూర్తిగా అభిమానించేవారు. తాను అన్నమాచార్య కీర్తన పాడినప్పుడు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి రేడియో స్టేషనుకు వచ్చి మెచ్చుకోవడాన్ని మరపురాని అనుభవంగా చెప్తుండేవారు. ఇలా అనేక అనుభవాలను సందర్భం వచ్చినప్పుడల్లా సభాముఖంగా ప్రస్తావిస్తుండేవారు.

***'ప్రేమ'లో 'ఓహో ఇది కదా! వియోగి ఇది గదా! కలలు నిజములై పోయె గదా'***

***'జయసింహ'లో 'నడిరేయి గడిచేనే, చెలియా! రాడాయెనే సామి నా సామి'***

***'బంగారు పంజరం'లో 'పదములె చాలు రామా! నీ పద ధూళులె పదివేలు'***

***'పుట్టిల్లు' చిత్రంలో 'జోజో లాలి లాలి! జోజో కుమారా!'***

ఇలా ఎన్నెన్నో గీతాలను రసహృదయులకు వీనుల విందుగా సమర్పించారామె. 1950 మొదలు 1968 వరకు దరిదాపు రెండు దశాబ్దాల పర్యంతం ఏది పాడినా శ్రోతలలోకం ఉర్రూతలూగింది. ఎన్ని పాడినా, తన తొలి ప్రాముఖ్యం ఆకాశవాణిదే అన్నారు ఎన్నోసార్లు. ఆ సంస్థలోనే ఉద్యోగ జీవితాన్ని

ఆరంభించి, విరమణదాకా కొనసాగుతూ వచ్చారు. వ్యక్తిగతం కన్నా వృత్తి జీవితానికే ప్రాధాన్య మిచ్చారు. భక్తి ప్రపత్తికి పెట్టింది పేరు ఆకాశవాణే అన్నది ఆమె నిశ్చితాభిప్రాయం. ప్రత్యేకించి, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వంటి విఖ్యాత వ్యక్తులు అనేక పర్యాయాలు కోరి మరీ గీతాలాపనను ఆస్వాదించేవారు. కోమల తన జీవనయాత్రను సంగీత సమన్వితంగా నిర్వహించుకున్నారు. ఇదే అన్నింటికంటే మించిన అశేష విశేషం. తెలుగు వెలుగు తాను. నాటికీ నేటికీ కూడా.

ఎందరెందరో కవుల లలిత గీతాలకు చక్కని వేదిక – ఆకాశవాణి. తమకు తాముగా బాణీలు కట్టినవారు కొందరైతే, బహుచక్కగా పాడించి కృతార్థత సాధించినవారు ఇంకొందరు. ఆ సంగీత ప్రక్రియల దర్శకులూ విఖ్యాతి గడించారు. పాట అనే రెండు అక్షరాల్లో ఎన్నో భావనలున్నాయి.



ప్రఖ్యాత గాయని పి.లీల అంటే, కోమలకి ప్రేమాదరాలు – గౌరవాభిమానాలు. కోమల స్వరంలో భాషా నుడికారం బహు మేలిమిగా పలికేది. ఇద్దరూ చాలాకాలం పాటు శాస్త్రీయ సంగీత కచేరీల ద్వారా మనోహర జ్ఞాపకాలను పంచిపెట్టారు. అంతకుముందే ఆకాశవాణి ఉద్దండుల వద్ద విశిష్టత లెన్నింటినో అభ్యసించారు.

*'ఆకులో ఆకునై' పాటలో చివర*
*'ఆకలా దాహమా? చింతలా వంతలా*
*ఈ కరణి వెర్రినై ఏకతను తిరుగాడు*

# గాత్ర తత్త్వం

*ఈయడవి దాగిపోవ, ఎటులైన నిచటనే ఆగిపోనా?'*

అనేటప్పుడు ముక్తాయింపు వైవిధ్యాన్ని విని తీరాల్సిందే! గలగల వీచే చిరుగాలి కెరటాలు, జలజలమని పారేచోట తేటదనాలు – వీటన్నింటినీ సంగీత శ్రోతల అనుభవానికి తెచ్చారు – కోమల.

మరో చిత్రరాజంలోని పాటనీ జ్ఞప్తికి తెచ్చుకోవాల్సిందే! జమునారాణి, జిక్కీలతో కోమల గాత్ర మేళవింపును విని అబ్బురపడాల్సిందే. అలాగే 'మధురా నగరిలో చల్లనమ్మబోదు, దారివిడుము కృష్ణా' అనే పాటలో...

*'కొసరి కొసరి నాతో సరసమాడకు*
*రాజమార్గమిది కృష్ణా, కృష్ణా!*
*వ్రజవనితలు నను చేరవత్తురిక*
*విడువడునా చేయి కృష్ణా, కృష్ణా!....* అనడంలో కూడా లాలిత్యం ఎంతైనా అనుపమానం. పదాల పోహళింపు, గాత్ర సౌలభ్యం పరమ అనిర్వచనీయం. ఎప్పుడు ఎక్కడ ఏ పాట పాడినా కోమలది ప్రత్యేక ముద్ర. ఎత్తుగడ మొదలు ముగింపు వరకు ఆర్ద్రత వెల్లివిరుస్తుండేది.



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

దీపావళి, సత్యనారాయణ మహోత్సవం చిత్రాల్లోనైతే భక్తి గీతికల పరంగా జీవించారు. శ్రుతి, లయ, రాగం, భావం ప్రధానాంశాలు. గాన యోగ్యమైతేనే అది గీతం అనిపించుకుంటుంది. గేయానికి తాళమే ప్రాణాధారం. జానపద గీతమైతే మటుకు, లలిత గేయానికి పరిణామ ఫలితం. ప్రేమ, విరహాలు మాత్రమే కావు; భావుకత వంటివెన్నో ఆ పాటల్లో చోటు చేసుకుంటాయి. వీటికి జోడింపుగా దేశభక్తి, సాంఘిక చైతన్యం పాటలకు సొగసులద్దాయి.

ఎందరెందరో కవుల లలిత గీతాలకు చక్కని వేదిక – ఆకాశవాణి. తమకు తాముగా బాణీలు కట్టినవారు కొందరైతే, బహుచక్కగా పాడించి కృతార్థత సాధించినవారు ఇంకొందరు. ఆ సంగీత ప్రక్రియల దర్శకులూ విఖ్యాతి గడించారు. పాట అనే రెండు అక్షరాల్లో ఎన్నో భావనలున్నాయి. ఆ మాటకొస్తే, సినిమా పాటలకు మూలాధారం లలిత గీతికలే! ఎంతగానో పట్టం కట్టింది ఆల్ ఇండియా రేడియో. నిజానికి ఇది ఏనాడో మద్రాసులో ఆరంభమైంది. పలు లలిత గీతాలకు శిఖరస్థాయి తెచ్చింది. అనంతరకాలంలో నాటకాలకు సంబంధించీ లలిత గీతికలు వెలువడ్డాయి. భాష, సంగీతాభిమానుల హృదయాల్లో సుస్థిర స్థానం పొందాయి. ఒక్క మద్రాసులోనే కాదు; తెలుగునాట విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల్లోనూ లలిత గీతాల ప్రభలు వెల్లివిరిశాయి. ఈ అన్ని సందర్భాల్లోనూ కోమల గాత్రం పరిమళించింది. శ్రోతలకు సదానుభూతిని పంచి పెట్టింది. వీటన్నింటి ప్రభావాలనూ తరచి తరచి చూశారు కోమల. విలక్షణత కనబరచి కీర్తివంతులయ్యారు. అక్షరాలా ఆమె అమృతవర్షిణే!

సినిమాల్లో బుర్రకథ గీతాలలో కూడా కోమలదే పైచేయి. అలనాడున్న జానపద కథాచిత్రంలో

*'తందానా హోయనందానా తాని తందనానా'* అంటూ ఘంటసాలతో కలిసి పాడారు.

*'మనసైన చెలీ! పిలుపు వివరాలేలా ఓ చందమామా!'*కు ఆర్. బాలసరస్వతీదేవితో గొంతు కలిపారు.

అంతేకాక – 'మురిపెము మీరా మీ కోరిక తీరా' పాటను కె.రాణితో కలిసి ఆలపించారు.

'క్లాసికల్ జీనియస్' అని సాక్షాత్తు పి.సుశీలతో పిలిపించుకున్న మేధోనిధి. అంజలీదేవి సినిమాల్లోని పాటల్లో చాలావాటిని కోమలే పాడేవారు. కృష్ణకుమారికి, కేఆర్ విజయకి పాడిందీ తానే! 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' నీ సమర్పించారు. సహజనటి సావిత్రికి పాడిన పాటలతో ఎంతెంతో పేరు సంపాదించారు. ఘంటసాల సొంత చిత్రంలో సైతం కోమలే గాయనీమణి. తిరుమల–తిరుపతి బ్రహ్మోత్సవాల వేదికమీద సంగీత గానఝరిని వెలయించారు. ప్రజల నుంచి వచ్చే అవార్డులూ, రివార్డులే తనకు ప్రధానమని పలుమార్లు చాటి చెప్పారు. గానలోల పదం ఆమెకు పరిపూర్తిగా వర్తిస్తుంది.

*'అడుగడుగో, అరుదెంచెను బృందావన మోహనుడు*
*ఎన్ని నాళ్లకు ఈ కనికరం? ఎన్నాళ్లకు ఈ దర్శనం?*
*ఎన్నో ఏళ్లుగా సలిపిన తపము*
*ఈనాడే ఫలియించినదే!*
*తొందరపడకే రాధికా,*
*నందకుమారుడు నీవాడే'*

అంటూ కోమల గాత్రం వినవస్తుంటే, 1956 ప్రాంతాల్లో గానమాధురి ఉప్పొంగింది, అదీ ఆమె స్వర మధురిమ! కాంతికిరణం, గానప్రక్రియకు ఆభరణం ఆమె! అందుకనే, ఈనాటికీ చిర యశస్విగా నిలిచారు.

పేరుపరంగా సార్థక నామధేయురాలు. ★

కథ

"చెల్లీ.. నాన్న చనిపోయాడే.." అక్క లలిత ఫోన్‌కాల్‌తో ఉలిక్కిపడి లేచి ఆమె చెప్పింది వినగానే వణికి పోయింది నర్మద. క్షణకాలం ఊపిరి ఆడలేదు. అసలే ఆస్మా పేషంట్ కావడంతో ఇన్‌హెలర్ చేతికి తీసుకొని ప్రెస్ చేసింది మందు గొంతులోకి వెళ్లింది కానీ టెన్షన్ మధ్య ఆయాసం తగ్గలేదు.

పక్క గదిలో పడుకున్న కొడుకును "చిన్నా.." అని పిలిచింది. ఉలుకూ పలుకూ లేదు.

" కీర్తనా" అని అరిచింది. కీర్తనలో కూడా స్పందన లేదు. కళ్లు తిరుగుతున్నట్టు అన్పించింది. బలవంతంగా లేచి నిలబడింది. తడుముకుంటూ లైటు వేసి హాల్లో పడుకొని నిద్రపోతున్న కీర్తన దగ్గరకెళ్లి తట్టింది. కీర్తన కళ్లు నులుముకుంటూ లేచింది. "ఏంటి మమ్మీ.." అని అడిగింది.

వెంటనే గొంతు పెగల్లేదు. "ఏమయింది మమ్మీ..?" అడిగింది కీర్తన.

"తాతయ్య చనిపోయాడే" అంది. "వ్వాట్.?" అని లేచింది కీర్తన. "ఏమయిందమ్మా." అడిగింది ఆందోళనగా "ఎలా జరిగిందో తెలీదు.. ఇప్పుడే పెద్దమ్మా.. ఫోన్ చేసింది.." చెప్పింది.

గోడ గడియారం కేసి చూసింది కీర్తన. పన్నెండు అవుతుంది. వెళ్లాలి కదా అమ్మ.." అడిగింది. "అవును తల్లీ .." అంది ఏడుస్తూనే.. చెల్లి ప్రసన్నకి ఫోన్ చేసింది.

"నాకు ఇప్పుడే పెద్దక్క చెప్పిందక్కా. మాకు రావడానికి ట్రాన్స్‌పోర్ట్ లేదు కదా.. పైగా ఇవి కరోనా రోజులు. " అంది. "నాన్నకు వచ్చింది కరోనా కాదు కదా.." అంది నర్మద.

"ఎవరు చూడొచ్చారు? గత వారం నుండి ఆరోగ్యం బాగలేదని అక్క దగ్గరకి వచ్చి వున్నాడాయన. అంది ప్రసన్న. నిజమే నాలుగు రోజుల క్రితం పెద్దక్క లలిత ఫోన్ చేసింది.

"నాన్న జ్వరం వచ్చిందని వచ్చాడు. హాస్పిటల్లో చూపించడానికి తీసుకెళ్లా.. వాళ్లేవో మందులిచ్చి టెస్ట్ రాసిచ్చారు. టెస్ట్ చేయిస్తే వైరల్ ఫీవర్ అని మందులు రాసిచ్చారు. మళ్లీ రెండు రోజుల తర్వాత నాన్నకు దగ్గుకూడా వస్తుందని సిటీ స్కాన్ రాసిచ్చాడు. బయట చేయించాము. "చెప్పింది లలిత. "జాగ్రత్తక్కా." అని ఫోన్ పెట్టేసింది నర్మద.. ఈ సంభాషణ జరిగింది ఆరోజు ఉదయమే. కానీ ఇప్పుడు ఏకంగా మరణ వార్త చెప్పింది. కాళ్లూ చేతులూ ఆడడం లేదు. మంచంకి ఆనుకొని కూర్చొంది. తల్లి ఎగశ్వాస దిగశ్వాసగా ఉంటే అమృతాంజనం తెచ్చి పూసింది కీర్తన. అలికిడికి నర్మద కొడుకు పవన్ లేచి వచ్చాడు. వాడికి పన్నెండేళ్లు.. "ఏమయిందమ్మా?.." అడిగాడు.

"తాతయ్య చనిపోయాడు రా.. మనకున్న ఒకే ఒక దిక్కు పోయింది.." అంది కన్నీళ్ల పర్యంతం అవుతూ. పిల్లలిద్దరూ తల్లికి దగ్గరగా చేరి ధైర్యం చెప్పడం మొదలెట్టారు. లలితక్క మళ్లీ ఫోన్ చేసింది. "వస్తున్నావా?" అడిగింది. "బయట బస్సులు కూడా లేవుకదా అక్కా'అంది నర్మద ఏంమాట్లాడాలో అర్థం కాక. "ఎలాగోలా బయలుదేరవే.. నాకు కాళ్లు చేతులు ఆడడం లేదు.." అంది ఫోన్ పెట్టేస్తూ.. "ఓనరాంటి వాళ్లకు కారు ఉంది కదా అమ్మా.." అంది కీర్తన.

"ఇప్పుడు సమయం పన్నెండు అవుతుంది. ఈ సమయంలో వాళ్లని లేపితే నిద్రాభంగం అవుతుంది కదా." అంది. "ఆంటీకి ఫోన్ చేస్తానమ్మా "అని కీర్తన ఫోన్ చేతికి తీసుకొంది. అప్పటికే నర్మద పెట్టిన శోకాలకు పక్కనే ఉన్న ఇంటి యజమాని మంజుల నిద్ర లేచింది. కీర్తన ఫోన్లో విషయం చెప్పింది.

"అయ్యో" అంది మంజుల. "మరి ఇప్పుడు ఎలా వెళతారు.." అడిగింది.

"మీ కారు ఇవ్వండి ఆంటీ.." అడిగింది కీర్తన. "డ్రైవర్ లేడమ్మా.. ఆరోగ్యం బాగా లేదని వారం నుండి రావడం లేదు.." చెప్పింది. నిమిషాల వ్యవధిలోనే తలుపు తీసుకొని వచ్చింది మంజుల.

కరోనా రోజులు కావడంతో దగ్గరకి తీసుకొని ఓదార్చలేదు. "ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్ నర్మదా.." అంది "ఎలా జరిగింది?.." అడిగింది. కాసేపు నర్మద ఏమీ మాట్లాడలేదు..

"అమ్మ పోయాక నాన్నలో ఒంటరి తనం మరింత పెరిగిపోయింది. అమ్మ పేరే పదే పదే తలుచుకొనేవాడు. నాన్నకి కేన్సర్ అన్న విషయం



# మనోధర్మం

తటవర్తి నాగేశ్వరి



తెలుసు కదా.. మందులు కూడా ఈమధ్య సక్రమంగా వాడడం లేదంట. ఒంట్లో బాగుండడం లేదని పెద్దక్క ఇంటికి హనుమకొండకి వచ్చాడు. అక్కయ్య డాక్టర్కి చూపించింది. ఇప్పుడీ మరణవార్త చెప్పింది..” చెప్పడం ఆపింది నర్మద.

మంజులకు అడగాలని నోటిదాకా వచ్చినా అడగ లేదు. తన మనసులో ఆలోచన అర్థం చేసు కున్నట్టు“సిటీస్కాన్ అక్క ఉదయమే తీయించిందంట. అందులో కరోనా ఉంటే తెలిసి పోతుందట కదా..” అంది. “నేరుగా కరోనా పరీక్ష చేయించా ల్సింది. బహుశా కరోనాఎఫెక్ట్ అయిందేమో..” అంది మంజుల. ‘‘జాగ్రత్తగా ఉండాల్సింది..” అంది మంజుల

“నాన్న ఊర్లో అందరికీ తలలో నాలుకులా ఉంటాడు. పట్వారీ చేశాడు కదా.. ఊర్లో అందరూ తెలుసు ఆయనకి. ఈమధ్య రెండు మూడు చావులకి కూడా వెళ్లి వచ్చాడట. ” అంది.

“కరోనా కాకూడదని ఆశిద్దాం..” అంది మంజుల. “అయినా మనిషి పోయాక.. ఏ జబ్బు అయితే మాత్రం చేసేది ఏముంది మంజుల గారూ..” అంది నర్మద. “మరి ఇప్పుడు ఎలా బయలు దేరుతారు?” అడిగింది మంజుల.

‘‘అదే అర్థం కావడం లేదు..’’ అంది ఆందోళనగా నర్మద.

“మీరేం వర్రీ కాకండి..నాకు తెలిసిన ట్రావెల్స్ నుండి వెహికల్ తెప్పిస్తాను.. ఉదయాన్నే బయలు దేరండి” చెప్పింది మంజుల.“థాంక్స్ మంజుల గారూ” అంది నర్మద, “థాంక్స్ ఆంటీ ” అంది కీర్తన. “ఇలాంటి సమయాల్లో ఒకరికి ఒకరు తోడుం డాలి కదా..” అంది. మంజుల వెళ్లాక మళ్లీ గడియ పెట్టి వచ్చింది కీర్తన. శోక దేవతలా మారిన తల్లిని చూసి కీర్తన కళ్లలో నీళ్లు ఆగలేదు.

“ఉన్న ఒక్క ఆధారం తాతయ్య కూడా మనకి లేకుండా పోయాడు” అంటూ ఏడ్చింది.

తల్లిని పట్టుకొని తనుకూడా ఏడ్చేసింది కీర్తన.

‘‘ఏడవకు మమ్మీ..’’ అంటూ పవన్ కూడా ఓదార్చాడు. పదేళ్ల క్రితం భర్త రామచంద్రం గుండాగి చనిపోయాక మొత్తం కుటుంబ భారం నర్మద మీదే పడింది. అతడొక ప్రయివేటు కంపెనీలో పని చేసేవాడు. కంపెనీనుండి కూడా ఆమెకి ఏ సాయం అందలేదు. కళ్ల ముందు ఇద్దరు పిల్లలు. సొంత ఇల్లు వాకిలి కూడా లేదు. ఎలా బ్రతకడం ? ఇంట్లోనే చిన్న బ్యూటీ క్లినిక్ పెట్టుకుంది. కానీ దాని నుండి కూడా వచ్చే సంపాదన ఇల్లు గడిచే అంత లేదు. తండ్రే సంవత్సరానికి సరిపడే బియ్యం పంపేవాడు. ఇంటి రెంటు కూడా తనే సర్దేవాడు. తాను సంపాదించే కొద్దిపాటి డబ్బు కూరగాయలకు చిల్లర –సామానుకి సరిపోయేది. నాన్నకి ఏమయినా అయితే తన పరిస్థితి ఏంటని మథనపడుతూనే ఉండేది. సరిగ్గా ఇలా ఆలోచిస్తున్న పరిస్థితుల్లో ఆయన కాలం చేయడం ఆమెకి షాకిచ్చింది.తనకి నాన్న సాయం చేయడంపై ఇద్దరక్కలు చెల్లెలు కూడా అసూయ పడుతు ఉండే వాళ్లు. సూటి పోటీ మాటలు అంటూండేవాళ్లు. అమ్మ తనకి రక్షణ కవచంగా ఉండి సహకరిస్తూ ఉండేది. అమ్మ పోయిం తర్వాతే సగం క్రుంగిపోయింది నర్మద. “బిడ్డల్నేసుకొని అది ఒంటరి బ్రతుకు బ్రతుకుతుంది.. దాని బాగోగుల్ని నేనున్నా లేకున్నా చూసుకోండి..” అని పోయేప్పుడు కూడా తల్లి అన్నదని నాన్న మాటల ద్వారానే తెలిసింది. నాన్న చూపే శ్రద్ధ, చేసిన సాయం వల్లే పిల్లల్ని చదివించు కోగలుగుతుంది.

ఇప్పుడెలా? పిల్లల భవిష్యత్తు అంధకారంగా కన్పిస్తుంది. రెండో అక్క శారదకి ఫోన్ చేసింది.

“నేను రావడం లేదే స్వీటీ నీళ్లు పోసుకొని ఉందికదా” అంది. శారదక్క కూతురు గర్భవతి కావ డంతో తను పుట్టింటికి వచ్చి ఉందట. అదే ఊర్లో ఉంటూ కూడా తండ్రి చివరి చూపు చూడక పోవడం దారుణమనిపించింది. చెల్లి ప్రసన్న మళ్లీ ఫోన్ చేసి “నువ్వు కూడా పోక పోవడం బెటర్ కదా అక్కా” అంది “ఏంమాట్లాడుతున్నావ్ చిన్నీ” అంది కోపంగా.

“నాన్న సిమ్టమ్స్‌ను బట్టి అది కోవిడే అని అక్క కూడా అనుకుంటుంది. తనే వణికి పోతుంది ” అంది. “ఎలా చనిపోయినా నాన్నని చివరి చూపు చూసుకోకపోతే అది జీవితకాలం నాకు క్షోభగానే మిగిలి పోతుంది చిన్నీ..” అంది. కాసేపు మౌనం వహించి “నీకు అలా అన్పించడం సహజమే కదక్కా. ఆయన సాయం ఎక్కువ పొందిన దానివి కూడా నువ్వే కదా..బహుశా కృతజ్ఞతా భావం నిన్ను నలిబిలి చేస్తూ ఉంటుంది..” కంక్లూజన్ ఇచ్చింది.

కొద్దిసేపటి తర్వాత పెద్దక్క లలిత ఫోన్ చేసింది. “నర్మదా నాన్న డెడ్ బాడీ ఊర్లో ఉన్న మనింటికి తీసుకెళ్లి పోతున్నాము. అక్కడే కదా బరియల్ చేసేది..” అంది. “సరే అక్కా. నేను ఎర్లీ మార్నింగ్ బయలుదేరుతాను.. ”చెప్పింది. కాసేపటి తర్వాత చిన్నక్క శారద ఫోన్ చేసింది. “ఏంటే వెళ్లాలని డిసైడ్ అయ్యావా?” అడిగింది. “వెళుతున్నా అక్కా..” అంది స్థిరంగా. “సర్లే నువ్వు వెళ్తే వెళ్లావ్ పిల్లల్ని ఇంట్లోనే వదిలి వెళ్లు.. తిరిగివచ్చాక తలస్నానం చేసి సపరేట్గా ఒక గదిలో ఉండిపో.. పద్నాలుగు రోజుల వరకూ పిల్లల్ని దగ్గరకు రానీవ్వకు..” సలహా ఇచ్చింది.

“ముందు నన్ను వెళ్లనీయక్కా ” అంది. చెప్పి నట్టుగానే ఇంటి ఓనర్ మంజుల తనకు తెలిసిన ట్రావెల్స్ మాట్లాడి కారు పంపింది. పిల్లలకు జాగ్రత్తలు చెప్పి బయల్దేరింది నర్మద. కారు వెళ్తూ ఉన్నంతసేపు నర్మద కళ్లల్లో నీళ్లు ఆగలేదు. కారు హనుమకొండ దాటి గణపురం చేరేసరికి శారదక్క ఫోన్ చేసింది. “నాన్న శవంపై పడి ఏడవకు. ఆయనకు కరోనా ఎఫెక్ట్ అయ్యిందన్న సందేహం కూడా ఉందట.” చెప్పింది. ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. నర్మదకి.. ఫోన్ కట్ చేసింది.

శ్మశాన వాటిక దగ్గర ఏర్పాట్లు జరుగు తున్నాయ్. దగ్గర బంధువులు పదిమంది కంటే ఎక్కువ లేరు. ఊర్లో పనిచేసిన పట్వారీ కాబట్టి. ఆర్.ఐ.వచ్చి పోయాడు. నర్మదను చూడగానే ఆమె అక్క లలిత భోరున ఏడ్చింది. అక్కని కావలించుకొని ఏడ్వాలను కుంది కానీ చెల్లెలు ప్రసన్న మాట్లాడిన మాటలే గుర్తొచ్చాయ్..

“అక్క గతవారంగా నాన్నకు సేవలు చేస్తుంది కదా. తనకి కూడా ఎఫెక్ట్ అయ్యే ఉంటుందేమో కాస్త దూరంగా ఉండు ఆమెకి కూడా. పైగా నువ్వు ఆస్మా పేషంటివి..” నర్మదకి ఆమె మాటలన్నీ గుర్తొచ్చినా దుఃఖం ఆగలేదు. “అక్కా నాన్న ఇక మనకిక లేడా..” అంటూ కావలించుకొని ఏడ్చేసింది. ఏమనుకుందో ఏమో లలిత ఆమెని కాస్త దూరంగా నెట్టింది. బంధువులు ఆపుతున్నా ఆగలేదు. తండ్రి శవంపై పడి భోరున ఏడ్చింది నర్మద. ఎందుకైనా మంచిదని నర్మదని దూరంగా తెచ్చారు. అదే రోజు తిరిగి ప్రయాణమయ్యింది. ఊపిరాడనట్లు అనిపిస్తే మాస్క్ తీసివేసింది. అప్పుడు మొదలైంది ఆమెలో భయం. “నాన్న కరోనాతో పోయారా? అక్కకి ఎఫెక్ట్ అయ్యిందా? తనకి కూడా కరోనా వస్తుందా. తనకే

మయినా అయితే తన బిడ్డల పరిస్థితి ఏంటి?" సందేహాలతో ఆమె తల వేడెక్కి పోయింది. హైదరాబాద్ చేరేసరికి ఒళ్లు వేడిక్కి నట్టు అన్పిం చింది. కారు దిగి ఇంట్లోకెళ్లి బేసిన్ దగ్గరకు వెళ్లి వాంతులు చేసుకుంది. పిల్ల లిద్దరూ "అమ్మా.." అని ఎదురొస్తే "దగ్గరకు రావొద్దు ముందు గదిలో కూర్చోండి" అని చెప్పింది. ఒంటిమీద ఉన్న బట్టలన్నీ వాషింగ్ మిషన్లో వేసి వేడినీళ్లతో తల స్నానం చేసింది. అంతలోకి చిన్న చెల్లెలు ఫోన్‌చేసింది. "అక్కా నాలుగు రోజులు ఐసోలేషన్లో ఉండు. పిల్లల్ని దగ్గరకు రానివ్వకు.." చెప్పింది. గుండె గుబేల్ మంది. తండ్రిని గుర్తు చేసుకుంటూ ఆ రాత్రంతా ఏడుస్తూనే పడుకుంది నర్మద. కీర్తన అన్నంవండి తాను తిని కొంత తమ్ముడికి పెట్టి ముందు గదిలో పడుకున్నారు. పక్కరోజు పదకొండు గంటలకు ఫోన్ చేసింది లలితక్క, "సిటీ స్కానింగ్ రిపోర్ట్ వచ్చింది నర్మదా.. నాన్నకి కరోనా ఎఫెక్ట్ అయ్యిందట." అంది. నర్మద గుండె జారిపోయింది. "ముందు నువ్వు వెళ్లి టెస్ట్ చేసుకో అక్కా.." అంది నర్మద లేని ధైర్యాన్ని తెచ్చు కుంటూ.. కాసేపటి తర్వాత శారదక్క ఫోన్ చేసింది.

"నేనూ, చిన్నది ప్రసన్న రాకుండా పోవడం మంచిదయింది. నాన్నకి వచ్చింది కరోనానే అంట కదా.." అంది .నర్మద ఏమీ మాట్లాడలేదు. "నాన్న శవం మీద పడి బోరున ఏడ్చావట కదా.. జాగ్రత్తగా ఉండవే"అంది. "దేవుడు ఎలా నిర్ణయిస్తే అలా జరుగుతుంది లేక్కా" అంది. అలాఅన్నదే కానీ క్షణ.. క్షణం తనలో భయం పెరిగిపోయింది. తనకి ఏనా అయితే తన పిల్లల పరిస్థితి ఏంటి? వారిని ఎవరు చేరదీస్తారు. నాన్న సాయం చేస్తుంటే ఓర్వలేని తన అక్కా చెల్లెళ్లు 'ఇప్పుడు తనకేమయినా అయితే పిల్లల్ని చేరదీస్తారా? "నువ్వుకూడా వెళ్లకుండా ఉండాల్సింది" చెల్లి మాటలు "వెళ్తేనే ప్రేమ ఉన్నట్టా" శారదక్క మాటలు గుర్తొచ్చాయి నర్మదకు ..నాన్న కరోనాకి ఎఫెక్ట్ అయ్యినట్టు తనకి సందేహాలు ఉన్నా తనకి చేసిన సాయానికి కృతజ్ఞతగా ఆయన్ని కడసారిచూసి వీడ్కోలుపలకడం తన ధర్మం" అనుకుంది.

తల్లి పరిస్థితి గమనించి కీర్తన దగ్గరకి రాబో తుంటే "వద్దు తల్లీ.. దూరంగా ఉండడి" అంది.

"ఎందుకమ్మా..అంత భయపడుతున్నావ్. కరోనా ఎఫెక్ట్ అయిన వాళ్లందరూ చనిపోరు. తాతయ్య క్యాన్సర్ పేషెంట్ కాబట్టి ఆయనలో కరోనా ఎఫెక్ట్ ఎక్కువగా ఉంది." అంది.



తల్లి పరిస్థితి గమనించి కీర్తన దగ్గరకి రాబో తుంటే "వద్దు తల్లీ.. దూరంగా ఉండడి" అంది. "ఎందుకమ్మా.. అంత భయపడుతున్నావ్. కరోనా ఎఫెక్ట్ అయిన వాళ్లందరూ చనిపోరు. తాతయ్య క్యాన్సర్ పేషెంట్ కాబట్టి ఆయనలో కరోనా ఎఫెక్ట్ ఎక్కువగా ఉంది." అంది.

"అమ్మకి కూడా ఆస్మా వుంది కదక్కా, అమ్మకేమయినా అయితే.." అన్నాడు పవన్ సందేహంగా. "ఏమీ కాదు..వందేళ్లు వయస్సు ఉన్న వాళ్లు కూడా కోలుకున్న వాళ్లు చాలామంది వున్నారు."అంది కీర్తన. పవన్ ఏడ్చేశాడు. "అమ్మా.. నీకేమయినా అయితే.. నేను బతకనమ్మా.." అన్నాడు. తమ్ముడ్ని అదిలిస్తూ. "ఏంట్రా పిచ్చి మాటలు.." అంది కీర్తన కోపంగా. నర్మదకి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. "అయినా తాతయ్య ఆఖరి చూపుకి మమ్మల్ని కూడా– నువ్వు తీసుకెళ్లాల్సింది మమ్మీ.. తాతయ్య మనందరికీ సాయం చేశాడు కానీ,. నీ ఒక్కదానికే కాదు కదా.." అంది కీర్తన బాధగా. సాయంత్రంగా లలితక్క ఫోన్ చేసింది. "నేను రాపిడ్ టెస్ట్ చేయించుకున్నాను.. బై గాడ్ గ్రేస్ నాకు నెగిటివ్ వచ్చింది" చెప్పింది. నర్మద కళ్లు ఆనందంతో మెరిశాయ్.. "కంగ్రాట్స్ అక్కా.. నాన్నకి సర్వీస్ చేసినా నీకు పాజిటివ్ రాలేదు. దేవుడికి వందసార్లు థాంక్స్ చెప్పాలి" అంది. "నువ్వు కూడా టెస్ట్ చేయించుకో చెల్లీ.." అంది లలితక్క "వారం రోజులు నాన్నకు సేవచేసిన నీకే నెగిటివ్ వస్తే నాకు పాజిటివ్ ఎందుకు వస్తుంది అక్కా" అంది. "కీడెంచి మేలు లెక్కపెట్టాలికదా" అంది. నర్మద వెంటనే ఏమీ మాట్లాడలేదు. అవతల లలితక్క ఏడుస్తున్న చప్పుడు విన్పించింది. 'ఏంటక్కా ఏడుస్తున్నావా?" అంది. "అవును చెల్లీ నాన్న గుర్తొస్తున్నాడు. ఆయన మాట్లాడిన ఆఖరి మాటలు గుర్తొస్తున్నాయి" అంది. "ఏం చెప్పాడక్కా?" అడిగింది. "చెల్లి దిక్కులేని జీవి తాన్ని జీవిస్తుందమ్మా.. దానికి అండగా నిలువ మని ఆఖరి శ్వాసవదిలాడు" నర్మద కళ్లలోకూడా నీళ్లు చిప్పిల్లాయి. "ఆయన ప్రాణాలన్నీ నీమీదే ఉన్నాయ్ చెల్లీ" అంది. "నాన్న ప్రేమ గురించి నాకు తెలుసక్కా.. అందుకే చిన్నక్కా, చెల్లీ వారిస్తున్నా ప్రాణా లకు తెగించి వచ్చి నాన్నను చూశాను. అది నా మనోధర్మం" అంది నర్మద. "నేను నా ధర్మాన్ని నిర్వర్తించలేదు.." అనుకుంది గొణుగుతూ లలిత. రెండునెలల తర్వాత ఒక రిజిస్టర్ పార్శిల్ అందుకుంది నర్మద. అవి వీలునామా పత్రాలు. అందులో ఒక ఉత్తరంకూడాఉంది.

"చెల్లీ నాన్నని చేతులారా పోగొట్టుకున్నానేమో అన్న బెంగ నన్ను ప్రతిరోజూ కృంగదీస్తుంది.

నిజానికి అందరికంటే నాన్న ఎక్కువ మేలు చేసింది నాకే. పాతికేళ్లక్రితం మీ బావ బావిలో పడి చనిపోయిన విషయం నీకు తెలిసిందే. అది ఆఫీసులో గొడవలతో చనిపోయాడని ప్రపంచం అనుకుంది. నా గయ్యాళి తనం, నా అనుమానాలే మీ బావని మృత్యువు దగ్గరికి తీసుకెళ్లింది. మీ బావ తాలూకూ వ్యక్తులు 'నేనే మీబావని హత్య వేసి బావిలో పడేశా'నని నిందలు వేశారు. నేను వణికి పోయాను. నాన్న తన ప్రతిష్టనంతటిని అడ్డుగా వేసి నన్ను కాపాడారు. మీ బావ ప్రభుత్వ ఉద్యోగం కూడా నాకు వచ్చేలా చేశారు. నేను వాళ్ల నాన్న హంతకురాలినని పిల్లలు నా నుండి దూరంగా వెళ్లి పోయారు. డబ్బుకి లోటులేదు కానీ ఒంటరి జీవితంతో కుంగిపోయాను. నాన్నే లేకుంటే నేనెప్పుడో లోకం వదిలి పోయేదాన్నేమో. ఈ మధ్యే నా పిల్లలు నాకు దగ్గరవుతున్నారు. నేను సంపాదించే ప్రతి పైసా వాళ్లకే చెందాలని పొదుపు చేస్తున్నాను. నాన్న జ్వరంతో వచ్చినప్పుడే నాలో అనుమానం వేసింది.

ఏ ప్రవేటు హాస్పిటల్లోనో చేర్పిస్తే కరోనా అంటారేమో నా దగ్గరున్న మొత్తం డబ్బు హాస్పిటల్ ఫీజుల క్రింద తీసేసుకుంటారేమోనని భయపడినేను హాస్పిటల్లో సమయానికి చేర్చలేదు. బహుశా సకాలంలో చేర్చుంటే నాన్న కొంతకాలం మన మధ్య ఉండేవారేమో. ఎందుకో మనసు పీకి ఎట్టకేలకు ఒక ఆలోచన కొచ్చి, సీటీ స్కాన్ చేయిస్తే రిపోర్టులు రాకముందే..అదే రోజు నాన్న లోకం వదిలి పోయారు. బిడ్డగా నేను నా ధర్మాన్ని నెరవేర్చలేదేమో అన్పించింది. ఆయనకి సేవ చేయడానికి కూడా నేను వెనుకా ముందూ ఆడేదాన్ని. ఆ దూరం నాకు కరోనా రాకుండా కాపాడిందేమో కానీ అంతకు మించిన డబ్బు జబ్బు నా రక్తంలో ఉందని గుర్తించలేక పోయాను. నాన్నని కాపాడుకోలేకపొయ్యానన్న గిల్టీ ఫీలింగ్ కంటే మరో రోగం మరేముంటుంది? అన్నం సయించడం లేదు. చిక్కి శల్యమవుతున్నాను. పిల్లలు కూడా నా దగ్గరకు రావడం మానేశారు. ఆరోగ్యం క్షీణించింది. ఎప్పుడు మృత్యుఒడిలోకి వెళతానో నాకే తెలీదు. నాన్న పోయాక ఆర్థికంగా నువ్వు చాలా విషమ పరిస్థితిలోకి వెళ్లావని నాకు అర్థమవుతుంది. నాన్నకి కరోనా ఎఫెక్ట్ అయ్యిందేమో అన్న సందేహాలున్నా అన్నింటికీ తెగించి నాన్నను చివరి చూపు చూడాలనివచ్చిన నీ మనోధర్మం ముందు నేను దూది పింజలా మారిపోయాను. చెల్లీ! నేను సంపాదించుకున్న ఆస్తి మొత్తం నీ పేరు మీద నీ పిల్లల పేరు మీద రాస్తున్నాను ఒకవేళ నేను రాలిపోతే నీ పిల్లలే నా ఆస్తికి వారసులు. నీ అక్క లలిత.'

ఉత్తరం చదివి హతాశురాలైంది నర్మద.

"ఎందుకు చేశావక్కా ఇలా ఏమైంది నీకు?.." అని దుఃఖ పడుతుంటే అక్కడికి వచ్చింది కీర్తన. తల్లి చేతిలోని ఉత్తరం, ఆస్తి పత్రాలు చూసింది.

"పెద్దమ్మ ఆస్తి ఏమీ మనకు వద్దమ్మా. ఈ ఏడాది ఇంటర్ అయిపోతుంది నాకు. నేను జాబ్ చేస్తాను."అంది కీర్తన చేతిలో లలిత ఆస్తి పత్రాలు ముక్కలు ముక్కలు అయ్యాయి. ★

భారత క్రికెట్ పరుగుల యంత్రం, రికార్డుల మొనగాడు విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెటర్‌గా 15వ పడిలో ప్రవేశించాడు. 'క్రికెట్ ఎవరెస్ట్' సచిన్ పేరుతో ఉన్న ఒక్కో రికార్డును తిరగరాస్తూ తన ప్రస్థానం కొనసాగిస్తున్నాడు. అంతర్జాతీయ క్రికెట్లో భారత పతాకాన్ని తన అసాధారణ ఆటతీరు, అనితర సాధ్యమైన రికార్డులతో రెపరెపలాడిస్తున్న విరాట్ కోహ్లీ జైత్రయాత్ర సాగుతోంది.



# విరాట్.. భారత క్రికెట్ సమ్రాట్

2008 ఆగస్టు 18న శ్రీలంక ప్రత్యర్థిగా అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రం చేసిన విరాట్.. గత 14 సంవత్సరాల కాలంలో క్రికెట్ మూడు ఫార్మాట్లలోనూ ఆడుతూ పరుగుల హోరు, రికార్డుల జోరుతో 15వ ఏడాదిలో అడుగుపెట్టాడు. దంబుల్లా వేదికగా శ్రీలంకతో జరిగిన వన్డే మ్యాచ్ ద్వారా అరంగేట్రం చేసి, తన తొలి వన్డే ఇన్నింగ్స్‌లో 22 బంతుల్లో 12 పరుగులు మాత్రమే సాధించినా, ఆ తర్వాత తిరిగి చూడలేదు. ఇటీవలి వెస్టిండీస్ సిరీస్ వరకూ ఆడిన 111 టెస్టుల్లో 8 వేల 676 పరుగులు, 275 వన్డేలలో 12వేల 898 పరుగులు, 115 టీ-20 మ్యాచ్‌ల్లో 4 వేల 8 పరుగులు సాధించాడు. టెస్టుల్లో 29 శతకాలు, 7 ద్విశతకాలు, 29 అర్ధ శతకాలు, వన్డేల్లో 46 శతకాలు, 65 అర్ధ శతకాలు, టీ-20ల్లో ఒక శతకం, 37 అర్ధ శతకాల ఘనత కేవలం విరాట్ కోహ్లీకి మాత్రమే సొంతం.

## 2011లో టెస్టు క్రికెట్ అరంగేట్రం

విరాట్ కోహ్లీకి ఫార్మాట్ ఏదైనా పరుగుల మోత మోగించడం బ్యాటుతో అబ్బిన విద్య. అందుకే స్వల్ప కాలంలోనే ప్రపంచంలోని మేటి బ్యాట్స్‌మెన్‌లలో ఒకరిగా నిలిచాడు. టెస్టుల్లో సైతం 12 సంవత్సరాల కాలాన్ని విజయవంతంగా పూర్తి చేశాడు. 2011 జూన్ 20న విరాట్ టెస్టు జెర్సీ ధరించాడు. జమైకాలోని సబీనా పార్క్ వేదికగా వెస్టిండీస్ పై తన తొలిటెస్టు ఆడాడు. నాలుగో స్థానంలో బరిలోకి దిగిన అతను రెండు ఇన్నింగ్స్‌ల్లో 4, 15 స్కోర్లు మాత్రమే సాధించాడు. 2012లో కోహ్లీ ఆస్ట్రేలియాపై ఆడిలైడ్‌లో తన టెస్టు తొలి శతకం (112) సాధించాడు. టెస్టు క్రికెట్లో భారత ఐదో అత్యుత్తమ బ్యాటర్‌గా, అంతర్జాతీయ క్రికెటర్లలో 23వ అత్యధిక పరుగులు సాధించిన మొనగాడిగా నిలిచాడు. భారత్ తరపున అత్యధిక సెంచరీలు బాదిన నాలుగో బ్యాటర్‌గా రికార్డుల్లో చేరాడు. అంతేకాదు, టెస్టుల్లో అత్యధికంగా 7 డబుల్ సెంచరీలు సాధించిన భారత తొలి ఆటగాడిగా విరాట్ చరిత్ర సృష్టించాడు.

భారత టెస్టు జట్టు కెప్టెన్‌గా 2014లో ధోనీ నుంచి పగ్గాలు అందుకున్న కోహ్లీ తన దూకుడైన వ్యూహాలతో భారత్‌ను ప్రపంచ నంబర్ 1 జట్టుగా నిలిపాడు. అంతేకాదు ఐసీసీ తొలిసారి నిర్వహించిన ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ లీగ్ ఫైనల్‌కు చేర్చాడు. అయితే.. ఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో అనూహ్యంగా ఓటమి పాలై రన్నరప్ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

## వన్డే క్రికెట్‌లో మొనగాడు విరాట్..

50 ఓవర్ల వన్డే క్రికెట్లోనూ విరాట్ పేరుతో తిరుగులేని రికార్డులే ఉన్నాయి. 2023 వెస్టిండీస్ సిరీస్ వరకూ 275 మ్యాచ్‌లు ఆడిన విరాట్ 46 సెంచరీలు, 65 హాఫ్ సెంచరీల తో 12వేల 898 పరుగులు సాధించి 57.32 సగటుతో 183 పరుగుల వ్యక్తిగత స్కోరు సాధించాడు.

వన్డే క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా 8వేలు, 9 వేలు, 10 వేలు, 11 వేలు, 12 వేల పరుగుల మైలురాయి చేరిన బ్యాటర్‌గా ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు. భారత జట్టుకు 95 వన్డేలలో నాయకత్వం వహించిన విరాట్ 65 విజయాలు, 27 పరాజయాలు, ఓ టై, రెండు ఫలితం తేలని మ్యాచ్‌లతో 68.42 విజయశాతం సాధించాడు. 2011 ఐసీసీ వన్డే ప్రపంచకప్, 2013 చాంపియన్స్ ట్రోఫీ టోర్నీలలో విజేతగా నిలిచిన భారతజట్టులో సభ్యుడిగా ఉన్న విరాట్, 2017లోకు ఫైనల్స్ చేరిన జట్లలో కీలక ఆటగాడిగా ఉన్నాడు.

ప్రపంచ కప్‌లో 26 మ్యాచ్‌లు ఆడిన విరాట్ 1030 పరుగులతో 46.81 సగటు నమోదు చేశాడు. 13 చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌ల్లో 529 పరుగులతో 88.16 సగటు నమోదు చేసి,12 ఇన్నింగ్స్‌ల్లో 5 హాఫ్ సెంచరీలు సాధించాడు.

## టీ-20ల్లోనూ అదే జోరు

ఏ ఫార్మాట్‌లో అయినా దూకుడుగా ఆడే బ్యాటర్‌గా గుర్తింపు విరాట్ సంపాదించి, టీ-20ల్లో ఓ సెంచరీ, 37 హాఫ్ సెంచరీలతో సహా 52.73 సగటు నమోదు చేశాడు. 122 పరుగుల నాటౌట్ అత్యధిక స్కోరుతో పాటు 137.96 సగటు సాధించాడు. టీ-20 చరిత్రలోనే అత్యధిక హాఫ్ సెంచరీలు సాధించిన బ్యాటర్‌గా గుర్తింపుతో, అత్యధికంగా 15 మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు, అత్యధిక మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌లు (7) సాధించిన ఒకే ఒక్కడిగా చరిత్ర సృష్టించాడు. ఐసీసీ టీ-20 ప్రపంచ కప్ టోర్నీలలో భాగంగా 27 మ్యాచ్‌లు ఆడి 25 ఇన్నింగ్స్‌ల్లో 1141 పరుగులు సాధించాడు. 14 హాఫ్ సెంచరీలతో 131.30 స్ట్రయిక్ రేటు, 81.50 సగటు సాధించాడు. 2014, 2016 ఐసీసీ ప్రపంచ కప్ టోర్నీలలో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు.

మూడు ఫార్మాట్లలోనూ కలిపి 501 మ్యాచ్‌లు ఆడి 25వేల 582 పరుగులు సాధించాడు. 559 ఇన్నింగ్స్‌ల్లో 76 సెంచరీలు, 131 హాఫ్ సెంచరీలు సాధించాడు. 254 పరుగులు అత్యధిక వ్యక్తిగత స్కోరుతో 53.63 సగటు సాధించాడు. 664 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 34 వేల 357 పరుగులు, 100 శతకాలు సాధించిన మాస్టర్ సచిన్ రికార్డులకు విరాట్ గురి పెట్టాడు. 2011- 2020 కాలానికి ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది డికేడ్ పురస్కారాన్ని సైతం విరాట్ కోహ్లీ అందుకొన్నాడు. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

దేశ విభజన కాలంలో కశ్మీర్ సంస్థానాధీశుడు హరిసింగ్ ఆ ప్రాంతాన్ని భారత్‌లో విలీనం చేయడానికి అంగీకరించడం, కొత్తగా ఏర్పడిన పాకిస్తాన్‌కు అది రుచించకపోవడం, విలీనం జరగకుండానే ఆ ప్రాంతం తమదేనంటూ పొరుగు దేశం ఆక్రమణకు పాల్పడడం తెలిసిందే. ఇటు ఆ ప్రాంత మహారాజు దానిని భారత్‌లో విలీనం చేసినప్పటికీ, అటు పాక్, భారత ప్రధానులు, జమ్ముకశ్మీర్ 'ప్రధాని' షేక్ అబ్దుల్లా వంటి వారంతా దానిని వివాదస్పదంగా మార్చడంలో తమ వంతు పాత్ర నిర్వహించారు. ఆ క్రమంలోనే భారత రాజ్యాంగంలో ఈ ప్రాంతానికి ప్రత్యేక హోదాని కల్పిస్తూ 370 అధికరణను రాజ్యాంగ సభ పొందుపరిచింది. అయితే, ఈ ఆర్టికల్ తాత్కాలికమైనదని, రాజ్యాంగ సభ లేక రాష్ట్రపతి శాసనం, పార్లమెంటులో బిల్లును ఆమోదించడం ద్వారా రద్దు చేయవచ్చని విస్పష్టంగా పేర్కొంది.

అయినా, ఆర్టికల్ 370 రాజ్యాంగ విరుద్ధమంటూ రాజకీయనాయకులు/ న్యాయవాదులు, ఉదారవాదులు, హక్కుల కార్యకర్తలుగా చెలామణి అయ్యేవారంతా సుప్రీం కోర్టుకు వెళ్లడం, వారి పిటిషన్‌ను విచారించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం అంగీకరించడం అందరినీ ఆశ్చర్య పరిచింది. ఎందుకంటే, తమపై జరిగిన ఘాతుకాలపై విచారణకు ఆదేశించాలని కోరుతూ కశ్మీరీ హిందువులు వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. 'అవి జరిగి చాలాకాలం అయిపోయింది, కష్ట'మని వ్యాఖ్యానించింది. దీనితో హిందువులు హతాశులయ్యారు. కాగా, మేధావులు, ఉదారవాదుల ముసుగులో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే శక్తులు మాత్రం కోర్టు నిర్ణయంతో పండుగ చేసుకున్నాయి. కానీ వారు అక్కడే 'తప్పులో కాలు వేశారు.' ఆర్టికల్ 370 రద్దు ఎందుకు రాజ్యాంగ విరుద్ధమో వాదించేందుకు పిటిషినర్లకు ధర్మాసనం పదిహేను రోజుల సమయం ఇచ్చింది. ఇప్పటివరకూ, వారు చేసిన వాదనలు, జస్టిస్ చంద్రచూడ్ ప్రశ్నలు ఆసక్తికరంగా ఉన్నాయి.

**సుప్రీం కోర్టులో వాదవివాదాలు**

సుప్రీం కోర్టుకు చెందిన రాజ్యాంగ ధర్మాసనం ఆగస్టు 2వ తేదీ నుంచి ఈ పిటిషన్లను విచారించడం ఆరంభించింది. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్,జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం సోమ, శుక్రవారం మినహా రోజూ విచారిస్తోంది.

తన వాదనలను ప్రారంభిస్తూ ఎన్నికైన శాసన సభకు కూడా ఆర్టికల్ 370ని రద్దుచేయడం సాధ్యం కాదంటూ కపిల్ సిబాల్ పేర్కొన్నారు. రాజ్యాంగ సభ 1950లోనే రద్దు అయిపోయిందని, దానితో ఆర్టికల్ 370 కూడా తాత్కాలిక ఆర్టికల్ స్థితి నుంచి శాశ్వత స్థితికి చేరుకుందని ఆయన వాదన. ఒకవేళ దానిని రద్దు చేయాలంటే, రాజ్యాంగ సభ సలహా ఉండాలంటూ ఆయన వాదనలు వినిపిస్తుండగా, రాజ్యాంగ సభ ఉన్నంత కాలమే దాని సలహా సాధ్యం అంటూ ప్రధాన న్యాయమూర్తి మధ్యలో అడ్డుకున్నారు. దీనితో ఉత్సాహపడిన సిబాల్, రాజ్యాంగాన్ని రూపొందించిన తర్వాత రాజ్యాంగసభ ప్రయోజనం అయిపో యిందని అన్నారు. దీనికి స్పందిస్తూ, 'అంటే దీనివల్ల తాత్కాలికమైన ఆర్టికల్ 370 శాశ్వత స్వభావాన్ని ధరిస్తుందా? కేవలం రాజ్యాంగ సభ లేనందువల్లే?' అంటూ ప్రధాన న్యాయమూర్తి మరొక ప్రశ్న వేశారు. ఆర్టికల్ 370లోని క్లాజ్ 3 1957 తర్వాత పనికిరాదంటారా అంటే జస్టిస్ కౌల్ వేసిన ప్రశ్నకు, 'భారత రాజ్యాంగ నేపథ్యంలో రాజ్యాంగ సభ వ్యర్థం' అంటూ కపిల్ సిబాల్ సమాధానం చెప్పడంతో, అయితే, ఆర్టికల్ 370 (3)పోతే, ఆర్టికల్ 370ని ఎప్పటికీ రద్దు చేయలేరన్న మాట అంటూ జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించడం, దానికి అవును, అదే కదా నేను చెప్పేది అని సిబాల్ స్పందించడం జరిగాయి. సిబాల్ తన వాదనలను వినిపించిన తర్వాత, మరొక న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపించారు. ఆ వాదనలు కూడా కపిల్ సిబాల్ వాదనలనే ప్రతిధ్వనింపచేశాయి.

అయితే, ప్రధాన న్యాయమూర్తి మాత్రం ఈ వాదనలతో ఏకీభవించడం లేదు. ఆయన 1957 అనంతరం జారీ అయిన అనేక రాజ్యాంగ ఉత్తర్వులను పట్టి చూపుతూ, వారి వాదనలో పస లేదని చెబుతున్నారు. విచారణ సమయంలో ఆర్టికల్ 370ను రద్దు చేయాలన్న నిర్ణయంలో అంతర్లీనంగా ఉన్న వివేకాన్ని న్యాయపరంగా సమీక్షించమని న్యాయస్థానాన్ని కోరుతున్నారా అని ప్రశ్నించడమే కాదు, న్యాయ సమీక్షలు అన్నవి రాజ్యాంగ ఉల్లంఘనలకు మాత్రమే పరిమితం అయిన విషయాన్ని నొక్కి చెప్పారు. అంతేకాదు, 1957 తర్వాత జమ్ముకాశ్మీర్‌కి సంబంధించి రాజ్యాంగంలో చేసిన సవరణలను ఆ రాష్ట్రమే కాదు, భారత ప్రభుత్వం కూడా ఆమోదించడమన్న వాస్తవం మీ వాదనలను సమర్థించడం లేదు కదా అని కూడా ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించడం గమనార్హం.



1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కానీ ఏడు దశాబ్దాల అనంతరం కశ్మీర్‌కు నిజమైన స్వేచ్ఛ వచ్చింది. దేశానికి ఎంతో కీలకమైన ఈ రాష్ట్రానికీ కేంద్రానికీ, ప్రధాన స్రవంతి జీవనానికీ మధ్య దూరాన్ని పెంచినదే 370 అధికరణ. దానిని బీజేపీ ప్రభుత్వం సాహసోపేతంగా రద్దు చేసింది. ఆ ప్రక్రియ పూర్తయి మూడేళ్లు గడిచాయి. కేంద్రం తీసుకున్న నిర్ణయం సరైనదని క్షేత్రస్థాయిలో ఫలితాలు రుజువు చేస్తున్నాయి. కానీ 370 అధికరణ రద్దు నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో కొందరు సవాలు చేశారు. ఇది ఈ దేశంలో బుజ్జగింపు రాజకీయాలకీ, ప్రతిపక్షాల, మేధావుల తలాతోకా లేని ఆలోచనలకీ అద్దం పట్టేదే. అయితే సుప్రీంకోర్టు అభిప్రాయం ఏమిటి? వాదనల సారం ఏమిటి? ఇదొక ఆసక్తికరమైన అంశమే.

రాజ్యాంగ పరిషత్ తన పనిని పూర్తి చేసిన ఆర్టికల్ 370 తన ప్రయోజనాన్ని నెరవేర్చి ఉంటే, 1957 తర్వాత రాజ్యాంగపరమైన ఉత్తర్వులను జారీచేసే అవ కాశం ఎక్కడిదని కూడా న్యాయమూర్తి ప్రశ్నించారు. ఒకవేళ మీ వాదనే సరైనదనుకుంటే, అసలు రాజ్యాంగాన్ని సవరించే అవకాశం ఎక్కడిది? రాజ్యాంగ పరిషత్ రద్దుచేసిన తర్వాత జమ్ముకశ్మీర్‌కు సంబంధించి ఎటువంటి మార్పులూ చేయడానికి అధికారం లేదు. అలాంటప్పుడు ఆర్టికల్ 370 (1), (2), (3)లపై వ్యాఖ్యానించేందుకు తార్కికమైన అనుగుణ్యత ఉండాలని కూడా జస్టిస్ చంద్రచూడ్ అనడం వారికి నిరాశనే కలిగించిందని చెప్పాలి.

డి.అరుణ

# పాక్ ప్రేమికులకు నిరాశ



> ఇటీవలి కాలంలో పలు సందర్భాలలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ చేస్తున్న వ్యాఖ్యల నేపథ్యంలో తమకు తిరుగు ఉండదని భావించి, కోర్టులో వాదనల బరిలోకి దిగిన ఉదారవాద, మానవహక్కుల సమూహాలతో పాటు, స్వయంగా పాక్ ప్రేమికులు సైతం హతాశులయ్యారు. అటువంటి వారి తరుపున వాదిస్తున్న న్యాయవాదులకు అనుకోని ఎదురుదెబ్బ తగిలింది. ఎంతో ఆత్మవిశ్వాసంతో కోర్టులోకి అడుగుపెట్టిన న్యాయ వాదులకు ధర్మాసనం వేస్తున్న ప్రశ్నలు మింగుడు పడడం లేదు.

నిజంగానే 370 అధికరణంతో రాష్ట్రానికి వచ్చిన ప్రత్యేక ప్రతిపత్తి ఏం ఒరగబెట్టింది? ఇదే పెద్ద చర్చ. ఆరు దశాబ్దాల పాటు దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆదాయాన్ని తమ ప్రాంతంపై పెడుతుంటే, అక్కడి కొన్ని రాజకీయ కుటుంబాలు దానిని భక్షిస్తూ, లోయలో ఏ మాత్రం అభివృద్ధి లేకుండా చేయడమే కాదు, పాక్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ 80వ దశకంలో ఇస్లామిక్ తీవ్రవాదం పెచ్చరిల్లడానికి దోహదపడినాయి. 90వ దశకం ప్రారంభంలో హింస, అత్యాచారాలతో హిందువులను తరిమివేశారు. కశ్మీర్‌లోని హిందువులు మైనార్టీలే అయినా మైనార్టీల భద్రత, హక్కుల గురించి చొక్కాలు చింపుకునే మేధావులు, ఉదారవాదులు ఎవరూ ఈ దుర్ఘటనలను పరిగణనలోకి తీసుకుని రచ్చ చేయడం కానీ, విదేశీ వార్తాపత్రికలలో వ్యాసాలను ప్రచురించడం కానీ చేయలేదు. ఇస్లామిక్ మతతత్త్వవాదుల తరుఫునే మాట్లాడారు. కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నెహ్రూ విధానాన్నే కొనసాగించింది తప్ప కశ్మీరీ పండితులు కూడా ఈ దేశ పౌరులేనని, వారికి న్యాయం చేయవలసిన బాధ్యత తమకు ఉందనే విషయాన్ని గుర్తించక పోయింది. అంతేకాదు, ఆ హింసకు కేంద్ర బిందువులుగా నిలిచిన యాసిన్ మాలిక్, మరణించిన గిలానీ వంటి వేర్పాటువాదులను గౌరవించి, వారికి అండగా నిలబడింది.

2019లో పూర్తి మెజారిటీతో మోదీ నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దుకు ఉపక్రమించింది. ఆగస్టు 5, 2019న పార్లమెంటులో జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2019ని ఆమోదించడం ద్వారా ఆర్టికల్ 370ని రద్దు చేసి, తాను ఎన్నికలలో ఇచ్చిన హామీని నెరవేర్చింది. కేవలం ఆర్టికల్ 370ని రద్దు చేయడమే కాదు, కశ్మీర్‌లో ఆర్థికాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టింది. వాస్తవానికి ఇప్పుడు కశ్మీర్‌కి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. నిన్నటివరకూ అక్కడ భూమిని ఎవరూ కొనుగోలు చేయకూడదన్న నిబంధన ఉండడంతో ముందుకురాని వ్యాపార వర్గాలు అక్కడ భూమి కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఇస్లాంకు వ్యతిరేకమన్న ప్రచారంతో ఇంతకాలం ఆగిపోయిన సినిమా ప్రదర్శనలు ఇప్పుడు హౌస్‌ఫుల్‌గా సాగుతున్నాయి. పర్యాటకం ఊపందుకుంది. ఈ క్రమంలోనే కశ్మీర్‌లో ఉండిపోయిన, కొత్తగా వెళ్లిన హిందువులను పాక్ ప్రేరిత తీవ్రవాదులు ఎంపిక చేసి మరీ హత్య చేయడాన్ని చూశాం. అయితే, ప్రభుత్వం మాత్రం కేవలం ప్రకటనలకు పరిమితం కాకుండా అటువంటివారిని నిర్దాక్షిణ్యంగా ఏరిపారేసి, అక్కడ శాంతిని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నది. ఇందుకు అక్కడి కశ్మీరీలు కూడా సహకరిస్తున్నారన్న విషయం ఇటీవలే ఆగస్టు 15న లాల్ చౌక్‌లో జాతీయ జెండాను ఎగురవేయడం, ఇతర నగరాలలో వలెనే శాంతియుతంగా సంబరాలు జరుపుకోవడం ద్వారా విదితమవుతోంది.

కశ్మీర్‌కు వచ్చే ఏ నిధినైనా మింగడానికి అలవాటు పడిన రాజకీయ పార్టీలు మాత్రం ఈ పరిణామాలను సహించలేకపోతున్నాయి. రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తూ ప్రజలను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాయి. 'భారత్ జోడో యాత్ర' అంటూ 'మొహబ్బత్ కీ దుకాణ్'ను తన కూడా తీసుకువెళ్లిన రాహూల్ గాంధీ మాత్రం కశ్మీరు భారత్ నుంచి 'టుకడే టుకడే' కావాలనే కోరుకున్నారు. అక్కడకు వెళ్లి, తాము అధికారంలోకి వస్తే తాము మళ్లీ ఆర్టికల్ 370ని తీసుకువచ్చి, కశ్మీర్‌ను 'ప్రత్యేక' ప్రాంతంగా గుర్తిస్తామంటూ ప్రకటనలు చేసిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది.

**సార్వభౌమత్వం 1947లోనే భారత్‌కు అప్పగింత**

రాహుల్ వంటి మందబుద్ధులంతా గుర్తించవలసిన అంశం ఒకటి ఉంది. ఇది కూడా సుప్రీం కోర్టు వాదనలలో వచ్చింది. ఒకనాటి ఆ సంస్థానాన్ని అక్టోబర్ 1947లో విలీనం చేయడంతో జమ్ముకశ్మీర్ సార్వభౌమత్వాన్ని పూర్తిగా భారత్‌కు అప్పగించినట్టేనని, అందువల్ల ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చిన ఆర్టికల్ 370 శాశ్వత స్వభావం కలిగి ఉందని చెప్పడం కష్టమేనని కూడా వాదన సమయంలో కోర్టు అభిప్రాయ పడింది. దీనిని గుర్తించడానికి ఈ నేతలు ఎందుకు వెనుకాడుతున్నారు? జమ్ముకశ్మీర్ సహా భారత్ రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 చెబుతున్నప్పుడు, ఆ రాష్ట్ర సార్వభౌమత్వాన్ని అన్ని రకాలుగా భారత్‌కు అప్పచెప్పినట్టేనని కూడా జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్1లో ఉన్న రాష్ట్రాల జాబితాలో జమ్ముకశ్మీర్ పేరు కూడా ఉన్నప్పుడు అది వేరెలా అవుతుందనే ప్రశ్నను కూడా ధర్మాసనం లేవనెత్తింది. కనుక, ఆర్టికల్ 370ను పొందుపరిచిన తర్వాత జమ్ముకశ్మీర్ సార్వభౌమత్వంలోని కొన్ని అంశాలను మాత్రమే యథాతథంగా ఉంచారని చెప్పలేమని కూడా స్పష్టం చేసింది.

అయినప్పటికీ, దవే, నఫాడే వంటి న్యాయవాదులు పలు కేసులను ప్రస్తావిస్తూ, రాష్ట్రపతి దీనిని రద్దుచేస్తూ ఉత్తర్వులను జారీ చేయడం సరికాదంటూ వాదిస్తున్నారు. రాజ్యాంగ సభ రద్దు కావడం వల్లే ఆర్టికల్ 370ని రద్దు చేయడం సాధ్యం కాకపోతే, రద్దు అనంతరం రాజ్యాంగంలో చేసిన సవరణల మాటేమిటి?

ఇటీవలి కాలంలో పలు సందర్భాలలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ చేస్తున్న వ్యాఖ్యల నేపథ్యంలో తమకు తిరుగు ఉండదని భావించి, కోర్టులో వాదనల బరిలోకి దిగిన ఉదారవాద, మానవహక్కుల సమూహాలతో పాటు, స్వయంగా పాక్ ప్రేమికులు సైతం హతాశులయ్యారు. అటువంటివారి తరుపున వాదిస్తున్న న్యాయవాదులకు అనుకోని ఎదురుదెబ్బ తగిలింది. ఎంతో ఆత్మవిశ్వాసంతో కోర్టులోకి అడుగుపెట్టిన న్యాయవాదులకు ధర్మాసనం వేస్తున్న ప్రశ్నలు మింగుడు పడడం లేదు. ఎన్ని మెలికలు పెట్టి వాదిస్తున్నా, ధర్మాసనం మాత్రం 'పాయింట్‌కి రా' అంటూ వారిని దారిలోకి తెస్తుండడం అంత సీనియర్లకి ఒక రకమైన అవమానమే. ఈ దెబ్బతో చట్టపరమైన దిగ్గజాలుగా పేరుపొందిన కపిల్ సిబాల్, దుష్యంత్ దవే వంటివారి పరువు దిగజారడం ఖాయం. ★

# బాల జాగృతి

## తెలుసుకుందాం

## బుగ్గ రామలింగేశ్వర స్వామి - ముశిపట్ల



తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా, మోత్కూరు మండలంలోని ముశిపట్ల గ్రామంలో ఈ ఆలయం కొలువుదీరింది. బుగ్గరామలింగేశ్వర స్వామి లింగాకారంలో దర్శనమిస్తాడు. త్రేతాయుగంలో రాముడు సీతా దేవిని వెతుక్కుంటూ వెళ్తూ ముశిపట్ల గుట్టమీద కొన్ని రోజులు నివాసం ఉండి, నల్లరంగులో ఉన్న ఒక శివలింగాన్ని ఈ గుట్ట మీద ప్రతిష్ఠించాడని, అందుకే ఇక్కడి దేవుడిని బుగ్గరామలింగేశ్వర స్వామి అంటారని స్థానికుల విశ్వాసం.

## కథ | గుండె ధైర్యం ముఖ్యం!



ఒక కుందేలు ఒక కొక్కిరాయి వద్దకు వచ్చి 'నీవు కట్టుడు పళ్లు బాగా కడతావుట. నాకు రెండు మంచి దంతాలు కట్టు' అన్నది.

'నీ పళ్లన్ని బాగానే ఉన్నాయే!' అన్నది కొక్కిరాయి.

'బాగా లేవని కాదు. నాకు ఇంకా పొడుగైన కోరలు – సింహం కోరల్లాంటివి కావాలి' అన్నది కుందేలు.

'దేనికి?' అని కొక్కిరాయి అడిగింది.

'నక్కను భయపెట్టడానికి. దానితో వేగలేకపోతున్నాను. దాన్ని చూసినప్పుడల్లా పారిపోవలసి వస్తున్నది. ఈ దెబ్బతో అదే నన్ను చూసి పారిపోవాలి' అన్నది కుందేలు.

కొక్కిరాయి తనలోనే నవ్వుకుని కుందేలుకు రెండు భయంకరమైన కోరలు అమర్చింది.

కుందేలు అద్దంలో చూసుకుని, 'అద్భుతం! ఇప్పుడు చెబుతాను నక్క పని!' అని నక్కను వెతుకుతూ

## పద్యము

**కనగ సొమ్ము లెన్నొ కనకంబదొక్కటి**
**పసుల వన్నె లెన్నొ పాలొకటియె**
**పుష్పజాతులెన్నొ పూజయొక్కటె సుమీ**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

భావం : ఆభరణములు వేరైనా బంగారం ఒక్కటే. పశువుల రంగుల వేరైనా పాలు ఒక్కటే. సుగంధభరిత పుష్పజాతులు వేరైనా చేసే పూజ మాత్రం ఒక్కటే. అలాగే శాస్త్ర పరిజ్ఞానం గల పండితులు వేరైనా జ్ఞానం మాత్రం ఒక్కటే.

## శ్లోకము

**'అమిత్రస్య కుతో సుఖమ్'**

**'అలసస్య కుతో విద్యా అవిద్యస్య కుతోధనమ్**
**అధనస్య కుతో మిత్రం అమిత్రస్య కుతో సుఖమ్'**

భావం : సోమరికి చదువు అంటదు. చదువు రాకపోతే ఆర్జన ఉండదు. సంపాదన లేకపోతే మనుషులు దరిజేరరు. అయిన వాళ్లు లేనప్పుడు జీవితంలో సుఖసంతోషాలకు తావెక్కడ?

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| తీరము | ఉవిద |
| నిత్యము | బరువు |
| ప్రతిజ్ఞ | దరి |
| పుస్తకము | ప్రతిన |
| భారము | పొత్తము |
| యువతి | నిచ్చలు |

జవాబులు : తీరము–దరి, నిత్యము–నిచ్చలు, ప్రతిజ్ఞ–ప్రతిన, పుస్తకము–పొత్తము, భారము–బరువు, యువతి–ఉవిద

## భారత స్వాతంత్ర్య సమరయోధులు




### ఇమ్మనువేల్ దేవేందర్

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, పౌరహక్కుల కార్యకర్త. అక్టోబర్ 9, 1924న తమిళనాడులో జన్మించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. మూడు నెలలు జైలు శిక్ష కూడా అనుభవించారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో చురుగ్గా వ్యవహరించారు. సెప్టెంబర్ 11,1957న తుదిశ్వాస విడిచారు.



బయలుదేరింది.

అది ఎంతో దూరం పోకుండానే ఒక పొద చాటున పొంచి చూస్తున్న నక్క కనిపించింది.

కుందేలు అదురుకుని, శరవేగంతో కొక్కిరాయి వద్దకు తిరిగి వచ్చింది.

'అన్నా, ఈ కోరలు తీసేసి, ఇంత కన్న భయంకరంగా ఉండేదేమైనా అమర్చగలవా?' అని అడిగింది.

'మార్చవలసినది నీ దంతాలు కావు, నీ పిరికి గుండె! దాన్ని తీసేసి గట్టి గుండె అమర్చినప్పుడు గాని, నీ సమస్య తీరదు' అన్నది కొక్కిరాయి.

★

## జనరల్ నాలెడ్జ్

1. కెనడా దేశ రాజధాని ఏది?
2. ప్రపంచంలో గుడ్ల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న దేశమేది?
3. మూడు సంవత్సరాలు నిద్రపోయే జీవి ఏది?

జవాబులు : 1. ఒట్టావా; 2. చైనా; 3. నత్త

## మెదడుకు మేత

పొట్టివాడికి ఒళ్లంతా బట్టలే.. ఎవరది?

జవాబు : దిండు

## మంచిమాట

పిల్లలకు నిజాయితీని అలవర్చడం విద్యాభ్యాసంలో తొలిమెట్టు



# వారఫలాలు

28 ఆగష్టు - 03 సెప్టెంబర్ 2023



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

పరిచయాలు పెరుగుతాయి. ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. దీర్ఘకాలిక రుణాలు, సమస్యలనుంచి బయటపడతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. ఉద్యోగులకు ఊహించని బాధ్యతలు దక్కవచ్చు. రచయితలు, క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలకు మరింత అనుకూల పరిస్థితులు. 28,29 తేదీల్లో వ్యయప్రయాసలు. కుటుంబ సభ్యులతో తగాదాలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

కొన్ని కార్యక్రమాలలో కొంత జాప్యం జరిగినా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి. కొత్త కాంట్రాక్టులు పొందుతారు. పరిచయాలు మరింత పెరుగుతాయి. అదనపు ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. వ్యాపారులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. పారిశ్రామికవర్గాలు, కళాకారులు, పరిశోధకుల యత్నాలు సఫలం. 28,29 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో తగాదాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

అనుకున్న కార్యక్రమాలు స్నేహితుల సహ కారంతో పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి పిలుపు అందుతుంది. ఆదాయం గతం కంటే కాస్త పుంజుకుంటుంది. కొన్ని సమస్యలు అత్యంత నేర్పుగా పరిష్కరించుకుంటారు. విద్యార్థులకు కొంత ఊరట లభిస్తుంది. క్రీడాకారులు,పరిశోధకులు, రచయితలకు శుభవార్తలు అందుతాయి. 30,31 తేదీల్లో దూర ప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

శత్రువులను సైతం మాటలతో ఆకట్టుకుంటారు. అనుకున్న కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబంలో చికాకులు తొలగి ఊరట చెందుతారు. నిరుద్యోగుల శ్రమ ఫలించే సమయం. వ్యాపారులకు లాభాలు అందుతాయి. ఉద్యోగులకు పని ఒత్తిడుల నుంచి విముక్తి. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు శ్రమ ఫలిస్తుంది. రచయితల యత్నాలు సఫలం. 1,2 తేదీల్లో బంధువులతో తగాదాలు. శారీరక రుగ్మతలు. ఆదిత్య హృదయం పఠించండి.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

అనుకున్న కార్యక్రమాలు సమయానికి పూర్తి చేస్తారు. సమాజంలో ప్రత్యేక గౌరవం పొందుతారు. ఆశించిన రాబడి దక్కి అవసరాలు తీరతాయి. సన్నిహితుల సూచనలతో కొన్ని సమస్యల నుంచి గట్టెక్కుతారు. పెట్టుబడులు సమకూరతాయి. పారి శ్రామిక వర్గాలు, రచయితలకు కీలక సమాచారం అందుతుంది. 31,1 తేదీల్లో శారీరక రుగ్మతలు. సోదరులతో విభేదాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

వీరికి పట్టింది బంగారమే అన్నట్లుగా ఉంటుంది. సోదరులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. నిరుద్యోగులకు అనుకూల వాతావరణం. వ్యాపారులకు మరింత లాభసాటిగా ఉంటుంది. ఉద్యోగులకు విశేష గుర్తింపు పొందుతారు. రచయితలు, క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 29,30 తేదీల్లో కుటుంబసభ్యులతో విభేదాలు. మానసిక అశాంతి. లక్ష్మీస్తుతి మంచిది.

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

సన్నిహితులు మీకు మరింత చేదోడుగా నిలుస్తారు. సమాజంలో మీకంటూ గౌరవం పొందుతారు. ఆస్తి విషయాలలో సమస్యలు తీరతాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు కాస్త ఊరట లభిస్తుంది. రచయితలు, కళాకారులకు శ్రమ ఫలిస్తుంది. 28, 29 తేదీల్లో ఖర్చులు. శారీరక రుగ్మతలు. ఆకస్మిక ప్రయాణాలు. నృసింహస్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఒక సమాచారం ఆశ్చర్యపరుస్తుంది. శ్రమానంతరం కార్యక్రమాలు పూర్తి కాగలవు. ఆత్మీయులతో అకారణంగా విభేదాలు నెలకొనవచ్చు. ఉద్యోగులకు కొద్దిపాటి చికాకులు ఎదురుకావచ్చు. రాజకీయ,పారిశ్రామిక వర్గాలు, రచయితలకు ఒత్తిడులు మరింత పెరుగుతాయి. 31,1 తేదీల్లో శుభవార్తలు. వాహనసౌఖ్యం. విష్ణుధ్యానం చేయండి.

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

సమస్యలు ఎదురైనా క్రమేపీ తొలగుతాయి. చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. ఆస్తుల విషయంలో కొత్త ఒప్పందాలు. వ్యాపారులకు అనుకూల పరిస్థితి ఉంటుంది. ఉద్యోగులకు బాధ్యతలు కొంత తగ్గే సూచనలు. రాజకీయ, పారిశ్రామివర్గాలు, పరిశోధకులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 1,2 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్యం. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

వ్యతిరేకులు కూడా అనుకూలురుగా మారతారు. నూతన ఉద్యోగయత్నాలు సానుకూలం. అదనపు ఆదాయం సమకూరుతుంది. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వచ్చి లబ్ధి పొందుతారు. ఉద్యోగులకు నిరుత్సాహం. కళాకారులు, రచయితలు, పారిశ్రామిక వర్గాలకు అవ కాశాలు అప్రయత్నంగా దక్కవచ్చు. 28,29 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో ఒత్తిడులు. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

కొన్ని సమస్యలు ఎదురైనా పట్టుదలతో అధిగమిస్తారు. అనుకున్న కార్యక్రమాలు పూర్తి చేసే వరకూ విశ్రమించరు. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. ఇంటి నిర్మాణయత్నాలలో కొంత పురోగతి ఉంటుంది. వ్యాపారులు సంస్థలను లాభాల దిశగా నడిపిస్తారు. రచయితలు, కళాకారులకు కాస్త అనుకూలత ఉంటుంది. 29,30 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

చేపట్టిన కార్యక్రమాలు చకచకా పూర్తి అవుతాయి. ఆదాయం కొంత పెరిగి అవసరాలు తీరతాయి. కాంట్రాక్టర్లకు మరింత ఉత్సాహవంతంగా గడుస్తుంది. వ్యాపారులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. ఉద్యోగులకు కొత్త బాధ్యతల నుంచి విముక్తి లభిస్తుంది. కళాకారులు, క్రీడాకారులు, పరిశోధకులకు ఆహ్వానాలు అందుతాయి. 31,1 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో సమస్యలు. శారీరక రుగ్మతలు. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

# పదరసం-430

## ఆధారాలు

**అడ్డం**

1. సర్పయాగం చేసిన రాజు (5)
5. భారతీయ జనతా పార్టీ సంక్షిప్తంగా (ఆంగ్లంలో) (3)
7. మహిళకు పర్యాయపదం (3)
8. ఇది ఎవరి కోసం ఆగదట (2)
9. చెట్టు, మీకు కాదు...(2)
11. శనీశ్వరుడి వాహనం (2)
12. ఎడమ వైపు (2)
13. హలమే....(3)
15. తోట సంరక్షకుడు (2)
16. శబ్దం, చప్పుడు (2)
18. చివరి (2)
19. అభినయం (3)
20. గడ్డి కోసే చిన్న కత్తి (2)
21. ప్రధాన అవతారాలు ఇన్ని (2)
24. రెండు పక్షాలు, నెల (2)
26. కాగడా లాంటిదే (3)
27. పట్టణం (2)
30. తింటే ఇవే తినాలట (3)
31. శలభాలే (4)
32. అగ్రజ పత్ని (3)

**నిలువు**

1. మేఘం (3)
2. ఒక తెలుగు సంవత్సరం (2)
3. అమ్మ సోదరుడు (4)
4. ఉపాయం, ఆలోచన (2)
5. రంధ్రం, గుహ (2)
6. ఐదువేళ్లు బిగిస్తే (4)
10. నీట మునిగిన కృష్ణుని పురం (3)
11. కంచిలో కొలువైన అమ్మవారు (3)
12. పదును, వీడి కాదు (2)
14. సముద్రం (3)
16. వధూవరులు వేసే అడుగులు (4)
17. పరాజయం (3)
22. స్వర్గంలో పుట్టినవాడు (4)
23. కెరటాలు (4)
25. ఆర్జన (4)
28. సన్మానితులకు కప్పే వస్త్రం (3)
29. దీనికి విషం తోకలో ఉంటుంది (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | | 4 | | ✠ | 5 | | 6 |
| 7 | | | ✠ | | ✠ | 8 | | ✠ | |
| | ✠ | 9 | | ✠ | 10 | ✠ | ✠ | 11 | |
| ✠ | 12 | | ✠ | 13 | | 14 | ✠ | 15 | |
| 16 | | ✠ | 17 | ✠ | 18 | | ✠ | | ✠ |
| | ✠ | 19 | | | ✠ | 20 | | ✠ | ✠ |
| 21 | 22 | ✠ | | ✠ | 23 | ✠ | ✠ | 24 | 25 |
| 26 | | | ✠ | 27 | | ✠ | 28 | ✠ | |
| ✠ | | ✠ | 29 | ✠ | 30 | | | ✠ | |
| 31 | | | | ✠ | | ✠ | 32 | | |

**పదరసం – 430**

పేరు : ..............................................................................................

చిరునామా:..............................................................................................

..............................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 సెప్టెంబర్ 11లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 426 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 మృ | గ | 2 తృ | ష్ణ | ✠ | 3 దే | 4 వ | ర్షి | ✠ | 5 జో |
| త్తి | ✠ | క్షి | ✠ | 6 కా | వే | రి | ✠ | 7 బీ | మ |
| 8 క | 9 ల | ✠ | 10 జా | ల | రి | ✠ | 11 పో | ✠ | లి |
| ✠ | 12 వ | ర్ణ | ✠ | డి | ✠ | 13 ఫూ | త | 14 న | ✠ |
| 15 ర | ణం | ✠ | 16 ఇ | ✠ | 17 బా | ✠ | 18 న | జ | ము |
| మా | ✠ | 19 బా | ల | ✠ | 20 స | దా | ✠ | రా | ✠ |
| 21 ర | క్క | సి | ✠ | 22 శ్రీ | ✠ | ✠ | 23 అ | న | వ |
| మి | ✠ | 24 కం | 25 చు | ✠ | 26 పా | పా | టు | ✠ | ✠ |
| ✠ | 27 క | ✠ | | ✠ | గ | ✠ | 28 కు | ము | 29 దం |
| 30 మొ | ల్ల | ✠ | 31 ము | గ | రం | ✠ | లు | ✠ | డ |

**విజేతలు:** కె.సత్యనారాయణ, డి.స్వాతి, సత్యనారాయణ మూర్తి, కె.విమలాదేవి, వై.రాధాకిషన్, రామచంద్రమూర్తి, రాజేశ్వరరావు, కె.అరవింద్, ఎ.ప్రదీప్‌కుమార్, మహాలక్ష్మి, వేంకటశ్రీనివాసరావు, కె.పి.శాస్త్రి, బి.ఇందుశేఖర్, కె.వి.రమణమూర్తి, పి.సీతామహాలక్ష్మి, వి.పద్మారంగనాథ్, జి.వి.వై.ఎన్.శాస్త్రి, డా. ప్రకాశరావు,వంగీపురం ఇందిరం, టి.వెంకటసూర్యం, టి.గిరీశ్, లింగేశ్వరరావు, శ్రీధర్, రాములు, విజయకుమార్, జనమంచి ముకుందము, సూర్యప్రభ, ఎస్.ఫణిమంజరి, వెంకటేశ్‌బాబు, ఎస్.భావ్యశ్రీ, శ్రీపతి పూర్ణకుమారి, రామకూరు లక్ష్మి,శేషు,హనుమంతరావు, అప్పాశేషాశాస్త్రి, బి.ఆర్. ఆంజనేయులు, గణేశ్, అల్లీరాణి, బా.విజయలక్ష్మి.

**ఈ వారం విజేత : టి. నాగజ్యోతి, నెల్లూరు.**

సినిమా

అరుణ

# 'జైలర్'తో రజనీ కెరీర్‌కు కొత్త ఊపిరి!



డెభయ్ రెండు వసంతాలను చవిచూసిన సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్' మూవీలో వీరోచితంగా అరి వర్గాలను అంతమొందిస్తుంటే సగటు ప్రేక్షకుడు నోరెళ్లబెట్టి చూశాడు. నలభై యేళ్ల జైలర్‌గా ఆయన తనదైన మేనరిజంతో చక చకా నడుస్తూ స్టైల్‌గా ఫోజు పెడితే థియేటర్‌లో విజిల్స్ వేశారు. మరో రెండేళ్లలో ఆయన నటుడిగా స్వర్ణోత్సవం జరుపుకోబోతున్నారు. ఇప్పటికీ అభిమానుల్లో ఆయన మీద ప్రేమ, ఆప్యాయతలు అలానే ఉన్నాయి. దానికి రజనీకాంత్ వ్యక్తిత్వం కూడా కారణమని చెప్పక తప్పదు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల పట్ల ఆయనకు ఉన్న ఎనలేని గౌరవంతో పాటు ఎంచుకున్న ఆధ్యాత్మిక మార్గం కూడా ప్రేక్షకుల సానుకూల స్పందనకు మూలం.

నిజం చెప్పాలంటే రజనీకాంత్ కమర్షియల్ సక్సెస్ సాధించి పుష్కరకాలం గడిచిపోయింది. శంకర్ దర్శకత్వంలో రజనీ చేసిన 'రోబో' తర్వాత ఆ స్థాయి విజయం దక్కలేదు. 2018లో వచ్చిన 'రోబో' సీక్వెల్ '2.ఓ'. రూ. 500 కోట్ల క్లబ్‌లో చోటు దక్కించుకున్నా, ఆ సినిమా బడ్జెట్‌తో పోల్చితే అదేమంత గొప్ప విజయం సాధించినట్టు కాదు. మరి 72 సంవత్సరాల రజనీకాంత్‌కు 'జైలర్'తో ఈ విజయం ఎలా దక్కిందన్నదే ప్రశ్న. ఇందులో రిటైర్డ్ జైలర్‌గా తన వయసుకు తగ్గ పాత్రను పోషించాడు. పదవీ విరమణ చేసిన వ్యక్తులకు ఇంట్లో ఎలాంటి గౌరవ మర్యాదలు ఉంటాయో ఇందులో సరదాగా చూపించారు.

తనంటే ప్రేమ ఉన్నా, పెద్దంత గౌరవం ఇవ్వని భార్య, తనను ఆటపట్టించే మనవడితో కాలక్షేపం చేస్తుంటాడు ఒకప్పటి జైలర్ ముత్తు (రజనీకాంత్). అతని కొడుకు ఏసీపీ అర్జున్ (వసంత్ రవి) దేవుడి విగ్రహాలను స్మగ్లింగ్‌చేసే ముఠా గుట్టు రట్టు చేసే క్రమంలో హత్యకు గురవుతాడు. దాంతో కొడుకు హత్యకు ప్రతీకారం తీర్చుకోవడానికి ముత్తు రంగంలోకి దిగాల్సి వస్తుంది. స్మగ్లర్ వర్మ (వినాయకన్)తో ఒకానొక దశలో రాజీ చేసుకోవడానికి ముత్తు ప్రయత్నించినా, అతను అంగీకరించకపోవడంతో తన పాత అవతారాన్ని తిరిగి తెర మీదకు తీసుకొస్తాడు. తీహార్ జైలులో పనిచేసినప్పుడు పరిచయమైన కరడుగట్టిన నేరస్థులు, అలానే తన సంపర్కంలోకి వచ్చిన తర్వాత చెడు మార్గాన్ని వదిలిపెట్టిన వారి సాయం తీసుకుని వర్మ అంతు చూస్తాడు. ఈ క్రమంలో తన కొడుకు అర్జున్ సజీవంగానే ఉన్నాడనే వాస్తవం కూడా తెలుస్తుంది. కానీ ఆ విషయంలోనూ కథను ప్రేక్షకుల ఊహకు అందని విధంగా మలుపులు తిప్పాడు దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్.



సినిమా ప్రథమార్ధం సరదా సరదాగా సాగిపోయింది. ముఖ్యంగా రజనీకాంత్ – యోగిబాబు మీద చిత్రీకరించిన సన్నివేశాలు వినోదాన్ని పంచాయి. అలానే రజనీకాంత్, అతని మనవడి మీద తీసిన సీన్స్ కూడా సరదాగా ఆకట్టుకున్నాయి. రజనీ భార్యగా రమ్య కృష్ణది అంత ప్రాధాన్యమున్న పాత్రేమీ కాదు. కొడుకుగా వసంత్ రవి పెద్దంత మెప్పించలేకపోయాడు. ఇప్పటికే తెలుగులో 'క్రేజీ ఫెలో', 'ఉగ్రం' సినిమాలలో నాయికగా నటించిన మిర్నా మీనన్ ఇందులో రజనీకాంత్ కోడలి పాత్ర పోషించింది. ఇక ద్వితీయార్థం ఈ సినిమాకు పెద్ద మైనస్ అని చెప్పాలి. విలన్ వర్మ కోరిక మేరకు మంగళగిరిలోని దేవాలయం నుండి దేవుడి కిరీటాన్ని హీరో ఎలా దొంగిలించాడనే దాని మీదనే ద్వితీయార్థం నడుస్తుంది. ఆ సన్నివేశాలన్నీ పేలవంగా ఉన్నాయి. ఆ సందర్భంలో తెర మీదకు వచ్చే సునీల్, తమన్నా, సునీల్ రెడ్డి (దర్శకులు ఎ. కోదండరామిరెడ్డి పెద్ద కొడుకు) పాత్రలు, వారిపై చిత్రీకరించిన సన్నివేశాలు ప్రేక్షకుల సహనాన్ని పరీక్షించే విధంగా ఉన్నాయి. ద్వితీయార్థం బాగా తీసి ఉంటే సినిమా మరింత గొప్ప విజయాన్ని అందుకుని ఉండేది. అయితే మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్, ఉత్తరాదికి చెందిన జాకీ ష్రాఫ్‌లతో గెస్ట్ రోల్స్ చేయించడంతో క్లయిమాక్స్‌లో మూవీ గ్రాఫ్ ఒక్కసారిగా పైకి లేచింది. ఆ మధ్య వచ్చిన కమల్ హాసన్ 'విక్రమ్' మూవీలో సూర్యను తురుపుముక్కగా వాడుకున్నట్టు ఇందులో మోహన్‌లాల్, శివరాజ్ కుమార్‌ను అలా ఉపయోగించుకున్నారు.

'జైలర్' మూవీ రెండో వారాంతానికి ప్రపంచ వ్యాప్తంగా రూ. 500 కోట్ల గ్రాస్‌ను వసూలు చేసింది. రజనీకాంత్ '2.ఓ' తర్వాత మళ్లీ 500 కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టిన సినిమా ఇదే. ఈ మధ్య కాలంలో రజనీకాంత్ తన ట్రాక్ మార్చి 'కబాలి', 'కాలా', 'పేట', 'దర్బార్' వంటి సినిమాలు చేశారు కానీ అవేవీ కమర్షియల్ సక్సెస్ సాధించలేదు. 'జైలర్'తో ఆ లోటు తీరిందనే చెప్పాలి.

'జైలర్' మూవీ విడుదలైన కొన్ని రోజులకే లక్నో వెళ్లిన రజనీకాంత్ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాదాలకు నమస్కారం చేయడాన్ని కూడా కొందరు తప్పు పట్టారు. రజనీకాంత్ తన కంటే చిన్నవాడైన ముఖ్యమంత్రి కాళ్లకు నమస్కారం చేయడం ఏమిటని కొందరు విమర్శించారు. అయితే ముఖ్యమంత్రి వయసును చూడలేదని, ఆయనలోని యోగత్వానికి తాను నమస్కరించానని రజనీకాంత్ వివరణ ఇవ్వడంతో వాళ్ల నోళ్లు మూత పడ్డాయి. సూపర్‌స్టార్‌గా ఎంత ఎదిగినా రజనీకాంత్ పాటించే నిరాడంబరతను, సాగే ఆధ్యాత్మిక మార్గాన్ని, చేస్తున్న సేవా కార్యక్రమాలను హర్షించని వారు ఉండరనే చెప్పాలి!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# తిరుమలేశుడి పవిత్రోత్సవం

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, ఈ యుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరుడి వైభవం గురించి ప్రత్యేకించి ముచ్చటించనవసరం లేదు. ఆయనకు ఏడాది పొడవునా జరిగే విశేష అర్చనాదులూ తెలిసినవే. అయితే ఆయా సందర్భాలలో తెలిసీ తెలియక సంభవించే దోషనివృత్తికి ప్రత్యేకంగా ఉత్సవ రూపం కల్పించారు. అదే 'పవిత్రోత్సవం'. ఉత్సవ కైంకర్యాదుల సందర్భాలలో చోటుచేసుకునే అపచార, అపరాధాలకు మన్నింపును కోరుతూ ఏటా శ్రావణమాసంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. యజ్ఞయాగాదులలో జరిగే లోపాలు పూర్ణాహుతితో తొలగిపోతాయన్నట్లుగానే శ్రీనివాసుడి సంవత్సరార్చన, ఆరాధనలో చోటు చేసుకునే దోషాల నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. అలా కాని పక్షంలో దేవదేవుడికి ఏడాది పాటు చేసిన ఆరాధనంతా నిష్ఫలమవుతుందని ఆగమశాస్త్రాలు పేర్కొంటున్నాయి. కేవలం దోషనివృత్తి కోసమే కాకుండా సర్వ యజ్ఞఫలప్రదం, ఆయురారోగ్యప్రదం, సర్వ దోషోపశమనం, సర్వ కామసమృద్ధి, లోకశాంతి మొదలైన శుభ ఫలితాలకు కోసం ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

సాధారణ శకం 1464లో సాళువ మల్లయ దేవమహారాజు ఈ ఉత్సవాలను ప్రారంభించారని శాసనాలను బట్టి తెలుస్తోంది.

ఈ నెల (ఆగస్టు) 27న ఏకాదశి నాడు అంకురార్పణతో ఈ ఉత్సవం మూడు రోజుల పాటు జరిగింది. రెండవనాడు (ద్వాదశి) అర్చనాదులు నిర్వహించారు. ఆ మరునాడు పూర్ణాహుతి, స్వామివారు తిరువీధుల ఊరేగింపుతో ఉత్సవాలు ముగిశాయి.





From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 45



# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు












వెల : ₹.220/- వెల : ₹.200/- వెల : ₹.390/- వెల : ₹.250/- వెల : ₹.250/-












వెల : ₹.100/- వెల : ₹.100/- వెల : ₹.200/- వెల : ₹.100/- వెల : ₹.150/-












వెల : ₹.799/- వెల : ₹.499/- వెల :₹.495/- వెల : ₹.799/- వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!
సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329
సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687